RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 19.08.2026 | సంపుటి :13 సంచిక : 30 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులు

2025 సంవత్సరానికి గాను ప్రకటించిన కేంద్రం • ఈసారి 'నో' ఖేల్‌రత్న

న్యూఢిల్లీ(జనంసాక్షి):2025 సంవత్సరానికి గాను కేంద్రం జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. 17 మందిని అర్జున అవార్డులు వరించగా.. అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును ఈ ఏడాది ఎవరికీ ప్రకటించలేదు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ఎంపిక కమిటీ దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన ఖేల్‌రత్న కోసం హాకీ స్టార్ హార్దిక్ సింగ్ పేరును పరిశీలించినప్పటికీ చివరకు ఆయన ఆ రేసు నుంచి వైదొలిగారు.

మిగతా 2లో..

జస్టిస్ బి సుదర్శన్ రెడ్డిని జాతీయస్థాయి మీడియా కాంక్లేవ్‌కు ఆహ్వానిస్తున్న ప్రెస్ క్లబ్ ప్రతినిధులు

హైదరాబాద్‌లో జాతీయ స్థాయి మీడియా కాంక్లేవ్

ప్రెస్‌క్లబ్స్ సమాఖ్య ఆవిర్భావం..

మీడియాపై విశ్వాసం, జర్నలిస్టుల రక్షణపై మేధోమథనం

హాజరుకానున్న జాతీయస్థాయి మీడియా ప్రముఖులు, న్యాయ నిపుణులు

మీడియా రంగం ఎదుర్కొంటున్న సమకాలీన సవాళ్లు, ప్రజల్లో మీడియాపై తగ్గుతున్న విశ్వాసం, జర్నలిస్టుల వృత్తిపరమైన స్వేచ్ఛ, భద్రత తదితర కీలక అంశాలపై హైదరాబాద్‌లో జాతీయ స్థాయి మీడియా సదస్సు నిర్వహించనున్నారు. రెండురోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్స్ సమాఖ్య ఆవిర్భావ కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించనున్నారు. జాతీయ స్థాయిలో మీడియా రంగానికి చెందిన ప్రముఖులు, సీనియర్ జర్నలిస్టులు, న్యాయ నిపుణులు ఒకే వేదికపై పాల్గొని కీలక అంశాలపై చర్చించనుండటం సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

హైదరాబాద్, ఆగస్టు 18 (జనంసాక్షి ప్రతినిధి): ఆగస్టు 22న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేటలో టూరిజం ప్లాజా సమీపంలోని ఐఏఎస్ క్లబ్‌లో ప్రెస్ క్లబ్స్ సమాఖ్య ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించనున్నారు. డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరవుతారు. మంత్రి పొంగులేటి ,ది హిందూ గ్రూప్ సంచాలకులు ఎన్. రామ్, తెలంగాణ మీడియా అకాడమీ అధ్య క్షులు కె. శ్రీనివాస రెడ్డి, ది కారవాన్ సంపాదకులు, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులు అనంత్‌నాథ్ తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొననున్నారు. రెండోరోజు ఆగస్టు 23న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మీడియా సదస్సు నిర్వహించను న్నారు. మీడియా రంగ ప్రముఖులు, సీనియర్ జర్నలిస్టులు, న్యాయ నిపుణులు, మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొని మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రత, ప్రజాస్వా మ్యంలో స్వతంత్ర మీడియా పాత్ర తదితర అంశా లపై విస్తృతంగా చర్చించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే తొలి సమావేశంలో 'మీడియాపై విశ్వాస లోపం–భారతీయ మీడియా మళ్లీ ప్రజల నమ్మకాన్ని పొందగలదా?' అనే అంశంపై చర్చ జరుగుతుంది. ఈ సమావేశంలో ది హిందూ గ్రూప్ సంచాలకులు ఎన్. రామ్, ఆల్ట్ న్యూస్ వ్యవస్థాపకులు ప్రతీక్ సిన్హా, తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షులు కె. శ్రీనివాస రెడ్డి పాల్గొంటారు. సీనియర్ జర్నలిస్టు, ఎన్డీటీవీ మాజీ ఎగ్జిక్యూటివ్‌ఎడిటర్‌ఉమాసుధీర్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

జర్నలిస్టుల రక్షణపై మేధోమథనం

రెండోరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30 గంటల వరకు జరిగే రెండో సమావేశంలో 'జర్నలిస్టుల రక్షణ–రాష్ట్ర ఆధిపత్యం నుంచి జర్నలిస్టులను కాపాడేందుకు సమిష్టి చర్యల అవసరం' అనే అంశంపై చర్చ నిర్వహించనున్నారు. ది కారవాన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ హర్తోష్ సింగ్ బాల్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ది సియాసత్ డైలీ డిజిటల్ ఎడిటర్ సయ్యదా ఫైజా పాల్గొంటారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు, ప్రెస్‌క్లబ్స్ సమాఖ్య సహాయ కార్యదర్శి సంగీత బారువా పిషారోటి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు శ్రీగిరి విజయకుమార్, కార్యదర్శి వరికుప్పల రమేష్ మాట్లాడుతూ.. మారుతున్న మీడియా పరిస్థితులు, జర్నలిస్టుల వృత్తిపరమైన స్వేచ్ఛ, భద్రత, ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాల్సిన అవసరంపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి మీడియా ప్రముఖులు ఒకే వేదికపైకి వచ్చి కీలక అంశాలపై చర్చించడం ఈ సదస్సు ప్రత్యేకతగా పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛ, జర్నలిస్టుల భద్రత, వృత్తిపరమైనస్వేచ్ఛ, ప్రజాస్వామ్యం లో స్వతంత్ర మీడియా పాత్ర వంటి అంశాలపై జాతీయ స్థాయిలో మేధోమథనం జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రెస్‌క్లబ్స్ ఫెడరేషన్ జాతీయ సదస్సుకు గవర్నర్‌కు ఆహ్వానం

వార్త 2 లో

బహుజన ఆత్మగౌరవ పతాక

సర్వాయి పాపన్న

ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన యోధుడు

- 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- బిఆర్ఎస్‌లా సాంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
- ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం
- విగ్రహావిష్కరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్18(జనంసాక్షి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్తూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే

మిగతా 2లో..

ప్రజల ఆస్తి హక్కులను పరిరక్షిస్తాం

22ఏ నిషేధిత భూములపై దుష్ప్రచారాలు నమ్మొద్దు : సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి):ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షణకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలంగాణ సీఎం

మిగతా 2లో..

రేపటి నుంచి సీఎం రేవంత్ విదేశీ పర్యటన

పది రోజుల పాటు యూకె, అమెరికా సందర్శన

వార్త 2 లో

నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కరిస్తున్నాం

- ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం
- 24 గంటల్లోనే 34 రిజిస్ట్రేషన్లు పూర్తి
- తప్పును సరిదిద్దుకుంటున్నాం
- హరీశ్‌రావు కాదు..అబద్ధాల రావు
- మంత్రి పొంగులేటి విమర్శలు

హైదరాబాద్(జనంసాక్షి): 22ఏ నిషేధిత భూముల జాబితాలోకి పొరపాటున చేరిన ప్రైవేట్ భూముల సమస్యను పరిష్కరించే ప్రక్రియను వేగవంతం చేశామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 24 గంటల్లోనే మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో 30, రంగారెడ్డి జిల్లాలో 4.. మొత్తం 34 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన ప్రైవేట్ ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలోని

మిగతా 2లో..

తాగునీటికే తొలి ప్రాధాన్యం

ఎల్‌నినో వేళ ప్రతి నీటి చుక్కకూ లెక్క ఉండాలి

- అందుబాటులో ఉన్న నిల్వల ఆధారంగానే నిర్ణయాలు
- కృష్ణా బేసిన్‌లో 76.63 శాతం.. గోదావరి బేసిన్‌లో 68.1 శాతం నిల్వలు
- నాగార్జునసాగర్‌లో 164 టీఎంసీల నీరు.. ఇంకా 47 శాతం వరద జలాలకు అవకాశం .. సింగూరు మరమ్మతులకు అత్యధిక ప్రాధాన్యం
- అంతర్రాష్ట్ర జల వివాదాలపై పటిష్ట వాదనకు సమగ్ర కార్యాచరణ
- నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్18(జనంసాక్షి): ఆకాశం వైపు ఆశగా చూడటం ఒక్కటే జల నిర్వహణ కాదు... ఆనకట్టలో ఎంత నీరుంది, అందులో నిజంగా వినియోగించగలిగేది ఎంత, తాగునీటికి ఎంత కాపాడాలి, నిలువునా ఉన్న పంటకు ఎంత అందించగలం అన్న ప్రతి లెక్కలో శాస్త్రీయత, వాస్తవికత ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన వర్షాకాలంపై అనిశ్చితి కొనసాగుతున్నందున 'తాగునీటి భద్రతకు తొలి ప్రాధాన్యం... అదే సమయంలో అందుబాటులో ఉన్న నీటితో ఖరీఫ్ పంటలకు గరిష్ఠ రక్షణ' అనే సూత్రంతో ముందుకు సాగాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మంగళవారం జలసౌధలో రాష్ట్రంలోని జలాశయాల నీటిమట్టాలు, ప్రవాహాలు, మిగిలిన ఖరీఫ్ సీజన్‌కు సాగునీటి అవకాశాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాబోయే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీగా వర్షాలు కురుస్తాయని, ఎగువ నుంచి పెద్దఎత్తున వరదలు వస్తాయని ముందుగానే ఊహించుకొని నీటి నిర్వహణ ప్రణాళికలు రూపొందించడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం చేతిలో ఉన్న నీరే ప్రామాణికం కావాలి... నమ్మదగిన ప్రవాహాలే అంచనాలకు ఆధారం కావాలి... వర్షపాతంపై శాస్త్రీయ విశ్లేషణలే నిర్ణయాలకు దిక్సూచి కావాలి అని స్పష్టం చేశారు. మన విధానం సమతుల్యంగా, వివేకవంతంగా ఉండాలి. ప్రజల తాగునీటి అవసరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదంలోకి నెట్టకూడదు. అదే సమయంలో తాగునీటి అవసరాలకు మించి అందుబాటులో ఉన్న నీరు జలాశయాల్లో ఉన్నప్పుడు పంటలు ఎండిపోతుంటే చూస్తూ ఉండకూడదు. ప్రతి నీటి విడుదల నిర్ణయం వాస్తవంగా వినియోగించగల నిల్వలు, నమ్మదగిన ప్రవాహాలు, వాస్తవిక వర్షపాత అంచనాల ఆధారంగానే జరగాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో మొత్తం 973.68 టీఎంసీల సామర్థ్యానికి గాను 746.12 టీఎంసీల నీరు ఉండి, 76.63 శాతం నిల్వలు నమోదయ్యాయని సమీక్షలో వెల్లడైంది.

మిగతా 2లో..

బీజేపీ జేబుసంస్థలా ఈసీ

- ఇష్టం వచ్చినట్లుగా ఓట్లు తొలగించారు
- 22శాతం ఓట్ల తొలగింపు దుర్మార్గపు చర్య
- తెలంగాణలో సర్ ప్రక్రియను పాడిగించాలి: మహేశ్ గౌడ్

2 లో..

ఇప్పటికైతే ఉరే సరైంది

- మరణశిక్షకు ఇతర సులువైన ప్రక్రియను చేపట్టాలని సుప్రీంలో పిటీషన్
- కొట్టివేసిన ధర్మాసనం

పోలీసుల క్రూర హింసకు సర్కారు ఎందుకు వత్తాసు?

రాహుల్ గాంధీ ఫైర్

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత

న్యూఢిల్లీ(జనంసాక్షి):దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల నిరసనల సమయంలో ఒక్కరికీ ఎలాంటి హాని జరగలేదని, వాస్తవానికి దిల్లీ పోలీసులను ప్రశంసించాలంటూ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. దేశ విద్యార్థులతో అవాస్తవాలు చెప్పొద్దని.. వారికి కళ్లు, జ్ఞాపకశక్తి ఉన్నాయంటూ 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు."దిల్లీ పోలీసులను ప్రశంసించాలని మోదీ ప్రభుత్వంలోని ఒక మంత్రి అంటున్నారు. పార్లమెంటు

మిగతా 2లో..

విద్యార్థులపై దమనకాండపై విచారణకు

సుప్రీం పర్యవేక్షణలో ఉన్నతస్థాయి కమిటీ

భద్రతా బలగాలపై విమర్శల నేపథ్యంలో ఏర్పాటు చేస్తూ ధర్మాసనం నిర్ణయం

2లో..

హర్మూజ్ మాదే..

జలసంధి అమెరికాలో భాగం • ఫొటో షేర్ చేసిన ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):హర్మూజ్ జలసంధిపై పూర్తిగా నియంత్రణ తమకే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదిస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా 'ట్రూత్ సోషల్' వేదికగా కీలక పోస్టు పెట్టారు. 'హర్మూజ్.. అమెరికా కొత్త ప్రదేశం' అని ఆ జలసంధి మ్యాప్‌పై రాసి ఉన్న ఫొటోను షేర్ చేశారు. ప్రస్తుతం హర్మూజ్‌ను దిగ్బంధనం చేసిన అమెరికా.. ఇరాన్ నౌకలను అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇరాన్‌తో చర్చలు, సంప్రదింపులేవీ జరగడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ నౌకల విషయంలో దిగ్బంధనం పూర్తిస్థాయిలో

మిగతా 2లో..

ఎన్నికల నిర్వహణపై భారత్‌ను ఓ ఉదాహరణగా తీసుకోవాలి

- తక్షణమే 'సేవ్ అమెరికా యాక్ట్'ను ఆమోదించాల్సిన అవసరముంది
- భారత్, అమెరికా ఎన్నికల వ్యవస్థపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

వార్త 2 లో

విజయ్ @ 20 అవర్స్ వర్క్..

ఆ రాష్ట్రమంత్రి ఆధవ్ అర్జున వెల్లడి

చెన్నై(జనంసాక్షి): తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రతిరోజూ 20గంటలు పని చేస్తారని ఆ రాష్ట్రమంత్రి ఆధవ్ అర్జున వెల్లడించారు. రోజూ ఉదయం 4గంటలకే తన దినచర్యను ప్రారంభిస్తారని.. ఆ తర్వాత మంత్రులతో సంబంధిత శాఖల్లోని సమస్యలు,

మిగతా 2లో..

హైదరాబాద్ కేబీఆర్ చుట్టూ

ట్రాఫిక్ జామ్

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ అమల్లోకి వచ్చింది. ఇవాళ్టి నుంచి ఏడాదిన్నరపాటు కేబీఆర్ పార్క్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన 7 ఫ్లైఓవర్లు, 7 అండర్ పాస్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్

మిగతా 2లో..

అయోధ్య రామాలయ విరాళాల చోరీ కేసు..

చంపత్ రాయ్‌కు క్లీన్ చిట్

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
19.08.2026

ప్రెస్‌క్లబ్స్ ఫెడరేషన్ జాతీయ సదస్సుకు

గవర్నర్‌కు ఆహ్వానం

ఖైరతాబాద్,ఆగస్టు18(జనంసాక్షి): హైదరాబాద్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఆహ్వానించారు. మంగళవారం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలోని ప్రతినిధి బృందం కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేసింది. జాతీయ స్థాయిలో మీడియా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, జర్నలిస్టుల వృత్తిపరమైన బాధ్యతలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై గవర్నర్ తన సందేశం ద్వారా మార్గదర్శనం చేయాలని ప్రతినిధులు కోరారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఈ నెల 21న ప్రారంభమయ్యే జాతీయ సదస్సు రెండురోజుల పాటు కొనసాగనుంది. గవర్నర్‌ను కలిసిన ప్రతినిధి బృందంలో హరిప్రసాద్, రమేష్ వైట్ల, బాపూరావు, రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హర్మూజ్.. మాదే..

కొనసాగుతోందని తెలిపారు. హర్మూజ్ జలసంధి తెరిచే ఉందని చెప్పారు. సముద్ర జలాల్లో ఇరాన్ అమర్చిన పేలుడు పదార్థాలను తొలగించామని, కొన్నింటిని పేల్చివేశామని 'ట్రూత్ సోషల్' వేదికగా ప్రకటించారు.మరోవైపు.. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు హర్మూజ్‌పై పట్టును కొనసాగిస్తామని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ గాలిబాఫ్ మంగళవారం స్పష్టం చేశారు. "ఒప్పందం ప్రకారం దిగ్బంధనాన్ని ఎత్తేయాలి. స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలి. చమురుపై ఆంక్షలను తొలగించాలి. అదేవిధంగా సైనిక చర్యలకు ముగింపు పలకాలి. అప్పటివరకు హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవబోం" అని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణపై భారత్‌ను ఓ ఉదాహరణగా తీసుకోవాలి

వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా ఎన్నికల్లో ఓటరు గుర్తింపు, పౌరసత్వ నిబంధనలను కఠినతరం చేసేందుకు ప్రయత్నిస్తున్న డొనాల్డ్ ట్రంప్ తక్షణమే 'సేవ్ అమెరికా యాక్ట్'ను ఆమోదించాల్సిన అవసరముందని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా భారత్, అమెరికా ఎన్నికల వ్యవస్థలపై కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇటీవల భారత్ సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ ఎన్నికల నిర్వహణపై మా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గుర్తింపు కార్డు లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారన్నారు. భారత్‌లో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 64.6 కోట్ల మంది ఓటర్లు పాల్గొన్నారు. కేవలం ఒకటి శాతం కంటే తక్కువ మంది మాత్రమే మెయిల్ ద్వారా ఓటు వేశారు.భారత్‌లో ప్రతి ఓటరు దగ్గర తప్పనిసరిగా చెల్లుబాటయ్యే ఫొటో గుర్తింపు కార్డు ఉంటుంది. ఎన్నికల నిర్వహణపై భారత్‌ను ఓ ఉదాహరణగా తీసుకోవాలి. వెంటనే 'సేవ్ అమెరికా యాక్ట్'ను ఆమోదించుకోవాలి" అని సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో డొనాల్డ్ ట్రంప్ పోస్టు చేశారు. అమెరికా ఎన్నికల్లో కఠిన నిబంధనలు అమలు చేయాలని గత కొన్నాళ్లుగా ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో భారత్, అమెరికా ఎన్నికల విధానాలను సరిపోలుస్తూ.. తన వాదనలకు బలం చేకూర్చుకునేందుకు యత్నిస్తున్నారు.

హైదరాబాద్ 'కేబీఆర్' చుట్టూ ట్రాఫిక్ జామ్

స్పష్టం చేశారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, రోడ్ నెం.45 మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వాహనదారులు.. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి బసవతారకం, ఫిల్మ్ నగర్ మీదుగా రోడ్ నెం.45 చేరుకొని అక్కడి నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఈ వార్త చదివారా: సోషల్ మీడియాలో పిల్లల ఫొటోలు పెడుతున్నారా?

పోలీసుల క్రూర హింసకు సర్కారు ఎందుకు వత్తాసు?

సమీపంలో శాంతి యుతంగా ఉన్న విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పు లు జరిపారు. మేకులతో కూడిన లాఠీలతో కొట్టారు. ఈ క్రూరత్వాన్ని ప్రశంసించాలా? గాయపడిన విద్యా ర్థులను నేను స్వయంగా కలిశాను. ఏం జరిగిందో దేశమంతా చూసింది. ఇటీవల పార్లమెంటు సమావేశాల సమయంలో కేంద్రమంత్రి అమిత్ షా కనిపించలేదు. ప్రధాని ఇప్పటివరకూ విద్యార్థులకు క్షమాపణ చెప్పలేదు. వారు తమ తప్పులను చూడరు. వాటిని అంగీకరించరు. దేశ యువతకు అబద్ధాలు చెప్పకండి. వారికి కళ్లతోపాటు జ్ఞాపకశక్తి కూడా ఉంది" అని రాహుల్ విమర్శించారు.

విద్యార్థులపై దమనకాండపై విచారణకు పర్యవేక్షణలో ఉన్నతస్థాయి కమిటీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జులై 20న కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో పార్లమెంట్' మార్చ్ ఉద్రిక్తంగా మారడంతో భద్రతా బలగాలపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఆ ఆరోపణలపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని మంగళవారం సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని చెప్పింది. ఆ నిరసనల్లో భాగంగా మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. వాటిపైనా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది. నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజా విచారణలో ప్యానెల్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు, పోలీసు చర్య ఆరోపణలపై దిల్లీ, బిహార్ పోలీసులు అఫిడవిట్‌లు దాఖలు చేశారు. "ఆ రోజు 30 వేల మంది నిరసనకారులు మూడు కిలోమీటర్ల వరకు ఉన్నారు. ఆ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూసేలా 5 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. ఆందోళనకారులు బారికేడ్లను దాటేందుకు యత్నించడం ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ ఘటనలో 240 మంది భద్రతా సిబ్బంది గాయపడ్డారు. 200 మంది ఆందోళనకారులు వైద్య చికిత్స చేయించుకున్నారు. వాస్తవానికి ఆ మార్చ్‌కు ఎలాంటి అధికారిక అనుమతి లేదు. అయినా సరే నిరసనకారులు పార్లమెంట్ వైపుగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకోవడం చట్టవిరుద్ధం. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, సంఘ విద్రోహ శక్తులు ఆ గుంపులో కలిసిపోయారు" అని దిల్లీ పోలీసులు ఆరోపించారు.

గుంపులో చిక్కుకుపోయి..

బిహార్‌లోని సివాన్‌లో విద్యార్థులు నిర్వహించిన ఆందోళనల్లో ఓ కానిస్టేబుల్ ఏకే 47 తుపాకీని ఎక్కుపెట్టిన వీడియో బయటకు రావటం రాజకీయంగా దుమారం రేపిన సంగతి తెలిసిందే ఈక్రమంలో బిహార్ పోలీసులు సుప్రీంలో అఫిడవిట్ దాఖలు చేశారు. నిరసనల్లో భాగంగా కానిస్టేబుల్ ఆ గుంపులో చిక్కుకుపోవడంతో గాల్లోకి నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారని వెల్లడించారు. దాని వల్ల ఎవరూ గాయపడలేదని తెలియజేశారు.

విజయ్ @20 అవర్స్ వర్క్..

ఆ రోజు చేపట్టాల్సిన పనుల గురించి చర్చిస్తారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన అనంతరం ఎటువంటి సంబరాలు చేసుకోకుండా రాష్ట్రం కోసం పని చేస్తున్నారని కొనియాడారు. చెన్నైలో జరిగిన 'ఇండియా టుడే తమిళనాడు కాంక్లేవ్'లో మాట్లాడుతూ విజయ్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'ఎన్నికల్లో గెలిచాను కదా అని మా సీఎం విశ్రాంతి తీసుకోవట్లేదు. ప్రభుత్వానికి ఉన్న సవాళ్లను గుర్తించడానికి అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ప్రజల ఇబ్బందులు, మంత్రిత్వ శాఖలలోని సమస్యల పరిష్కరించడంపైనే దృష్టి సారించారు. ప్రజల కోసం మాత్రమే పని చేయాలని మాకు సూచించారు.

బహుజన ఆత్మగౌరవ పతాక సర్వాయి పాపన్న

ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం
హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ
2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు
ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం
విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు.

ప్రజల ఆస్తి హక్కుల పరిరక్షిస్తాం

రేవంత్‌రెడ్డి అన్నారు. ఆస్తులు కలిగిన వారు రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 22ఏ నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ల అంశంపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. రిజిస్ట్రేషన్ల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ తీసుకున్న వారి ఆస్తులు 22ఏ జాబితాలో ఉంటే రెవెన్యూ అధికారులు రెండు రోజుల్లో పరిశీలిస్తారని సీఎం తెలిపారు. అది ప్రైవేటు భూమి అయితే రిజిస్ట్రేషన్ వెంటనే చేస్తారని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు 22ఏ జాబితా భూములను క్షుణ్ణంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి సరైన జాబితాను రూపొందిస్తారని.. అందులో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలు తమ భూ హక్కుల విషయం లో ఎలాంటి ఆందోళన వద్దన్నారు

నిషేధిత జాబితా భూ సమస్యలు పరిష్కారిస్తున్నాం

తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. 22ఏ జాబితా విషయంలో జరిగిన పొరపాట్లను ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిషేధిత భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో క్షేత్రస్థాయిలో కొన్ని తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దే పక్రియను ప్రభుత్వం వేగంగా చేపట్టిందని వివరించారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం లేదని పొంగులేటి అన్నారు. పొరపాటు జరిగితే దాన్ని అంగీకరించడం తో పాటు.. దాని వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా పరిష్కరించడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వివిధ జీవోలు, మెమోల ద్వారా క్రమబద్ధీకరించిన కొన్ని ప్రైవేట్ భూములు, హైకోర్టు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అనుమతులు పొందిన స్థలాలు కూడా సాంకేతిక కారణాలతో 22ఏ జాబితాలోకి చేరినట్లు తెలిపారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు ప్రారంభించామని, అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్ల పక్రియను పునరుద్ధరించామని మంత్రి వెల్లడించారు.22ఏ భూములకు సంబంధిం చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పొంగులేటి తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీతో పాటు ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాబోయే 15 రోజుల పాటు ఈ కమిటీ ప్రతిరోజూ దరఖాస్తులను పరిశీలించనుం దని, అర్హత ఉన్న నిజమైన ప్రైవేట్ ఆస్తులను వీలైనంత త్వరగా 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. పేదల హక్కులు, ఆస్తులకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిస్తుందని పొంగులేటి స్పష్టం చేశారు. చట్టబద్ధంగా ఉన్న పేదల భూమిలో ఒక్క అంగుళాన్ని కూడా ప్రభుత్వం తీసుకోదని అన్నారు. ఇది పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమని పేర్కొన్నారు.

హరీశ్‌రావు కాదు..అబద్ధాల రావు

మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. హరీశ్‌రావు కాదు ఆయన అబద్ధాల రావు అని ఎద్దేవా చేశారు. 22ఏ లో ఆయన కొండను తవ్వి ఎలుకను పట్టారని.. దాన్ని గొప్పగా చెప్పుకుంటున్నారని సెటైర్లు గుప్పించారు. మంగళవారం హైదరాబాద్ వేదికగా మీడియాతో మంత్రి పొంగులేటి మాట్లాడారు. గతంలో సాఫ్ట్ కాపీ అప్‌లోడ్ చేయకపోవడం వల్ల తప్పు జరిగిందని తామే గుర్తించామని అన్నారు. ఆయన ఎత్తు పెరగడం కాదని.. విమర్శలు చేసే ముందు బుర్ర కూడా ఉపయోగించాలని మంత్రి వ్యంగ్యంగా మాట్లాడారు. ఎవరికీ అన్యాయం జరగనివ్వేమని అన్నారు. ప్రభుత్వ భూములు కాకపోతే కచ్చితంగా వాటిని 22ఏ నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు.

రేపటి నుంచి సీఎం రేవంత్ విదేశీ పర్యటన

హైదరాబాద్,ఆగస్టు18(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు సిద్ధమయ్యారు. ఆగస్టు 20 నుంచి 30వ తేదీ వరకు లండన్, అమెరికాలో సీఎం పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలను సందర్శించడంతో పాటు వివిధ సమావేశాల్లో పాల్గొననున్నారు. ఆగస్టు 20వ తేదీ అర్ధరాత్రి 12:30 గంటలకు న్యూఢిల్లీ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో సీఎం రేవంత్ రెడ్డి లండన్‌కు బయలుదేరనున్నారు. ఆగస్టు 20 ఉదయం 7 గంటలకు యూకే స్థానిక కాలమానం ప్రకారం లండన్ చేరుకోనున్నారు. ఆగస్టు 21న ఉదయం 10:30 గంటలకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం సందర్శించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ఫుట్‌బాల్ ప్రెజెంటేషన్ కార్యక్రమం కోసం ఎమిరేట్స్ స్టేడియాన్ని సందర్శించనున్నారు. 22న ఉదయం 10:30 గంటలకు కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం కానున్నారు. ఉదయం 11:30 గంటలకు లండన్ యూనివర్సిటీ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను సందర్శించ నున్నారు. సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌ను సందర్శించనున్నారు. యూకే పర్యటన అనంతరం ఆగస్టు 23న లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరి వెళతారు.

బీజేపీ జేబుసంస్థలా 'ఈసీ'

హైదరాబాద్,ఆగస్ట్18(జనంసాక్షి):2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ పామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వచ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. హైదరాబాద్ నగరంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ముఖ్యంగా పేదలు, వలస కూలీల ఓట్లే పెద్ద సంఖ్యలో తొలగించారని విమర్శించారు. 2002 నాటి ఓటర్ల జాబితా ఎంతమందికి అందుబాటులో ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎలాంటి కారణం లేకుండా 73 లక్షల ఓట్లను ఎన్నికల సంఘం తొలగించిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. మొత్తంగా 92 లక్షల ఓట్లను ప్రశ్నార్థకం చేశారని పేర్కొన్నారు. డీలిమిటేషన్, పోలింగ్ కేంద్రాల మార్పు కారణంగా 2002 నాటి ఓటర్ల వివరాలతో ప్రస్తుత జాబితాను సరిపోల్చడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయన్నారు.

ఇప్పటికైతే ఉరే సరైంది..

న్యూఢిల్లీ,ఆగస్ట్18(జనంసాక్షి): మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

చంపత్ రాయ్‌కు క్లీన్ చిట్

లక్నో(జనంసాక్షి):అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో ముమ్మర దర్యాప్తు జరుగుతోంది. ఈ క్రమంలో శ్రీరామ జన్మభూమి ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ తో పాటు ట్రస్ట్ మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) క్లీన్‌చిట్ ఇచ్చినట్లు సమాచారం. సిట్ నివేదిక ఇప్పటికే యూపీ ప్రభుత్వానికి అందగా.. దానిని ట్రస్ట్‌కు అప్పగించారు.విరాళాల లెక్కింపు సమయంలో చోరీ జరిగిందని ఆరోపణలు రావడంతో జూన్ నెలలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ ఆరోపణలపై రాయ్ గతంలో స్పందించారు. తనపై వస్తోన్న ఆరోపణలు నిరాధారమన్నారు. సిట్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన తర్వాతే ఈ వ్యవహారంపై స్పందిస్తానని వెల్లడించిన సంగతి తెలిసిందే.

తాగునీటికే తొలి ప్రాధాన్యం

గోదావరి బేసిన్‌లో 306.20 టీఎంసీల సామర్థ్యానికి 208.38 టీఎంసీలు, అంటే 68.1 శాతం నీరు అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. కృష్ణా నదిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం సుమారు 164 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు మంత్రికి వివరించారు. ప్రాజెక్టు స్థూల సామర్థ్యం సుమారు 312 టీఎంసీలు కాగా, ఇంకా దాదాపు 47 శాతం మేర వరద జలాలను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 6.4 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో సాగునీటి అవసరాలను అత్యంత జాగ్రత్తగా అంచనా వేయాలని మంత్రి సూచించారు. అయితే జలాశయాల్లో కనిపించే స్థూల నిల్వ శాతాలను మాత్రమే చూపించి పరిస్థితి ఎంతో ఆశాజనకంగా ఉందన్న భావన కలిగించవద్దని అధికారులను మంత్రి హెచ్చరించారు. స్థూల సామర్థ్యం ఎంత? లైవ్ స్టోరేజ్ ఎంత? వాస్తవంగా వినియోగించగల నీరు ఎంత? ఇప్పటికే కేటాయించిన అవసరాలు ఎంత? వాటన్నింటినీ మినహాయించిన తర్వాత సాగునీటికి మిగిలేది ఎంత? అన్న వివరాలు ప్రతి నివేదికలో స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. 2025, 2026 సంవత్సరాల నిల్వలు, ప్రవాహాలను తులనాత్మకంగా అధ్యయనం చేసి నిర

కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలు

- ఏడాదిన్నరపాటు అమలు కానున్న ఆంక్షలు
- ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం
- ట్రాఫిక్ సూచనలను పాటించాలన్న సజ్జనార్

హైదరాబాద్, ఆగస్ట్ 18 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ అమల్లోకి వచ్చింది. 18న అమల్లోకి వచ్చిన ఈ ప్రక్రియ నుంచి ఏడాదిన్నరపాటు కేబీఆర్ పార్క్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, రోడ్ నెం.45 మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వాహనదారులు.. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి బసవతారకం, ఫిల్మ్ నగర్ మీదుగా రోడ్ నెం.45 చేరుకొని అక్కడి నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. హెచ్- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ వీటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. 'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు. అగ్రసేన్ చౌరస్తా రోడ్ నం 45, చెక్ పోస్ట్, వెంకటగిరి దగ్గర కాస్త ఇబ్బంది కలిగింది. డ్రోన్స్ ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని చోట్ల సూచికలు పెట్టాల్సి ఉంది. సాంకేతికతను ఉపయోగించి ఇంకా ఎటువంటి మార్పులు చేయాలో చూస్తాం. ముఖ్యంగా కొంత మంది సూచనలు పాటించకుండా వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ వాహనదారులు ముందుకు వెళ్లాలని సూచిస్తున్నామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

- 22ఎ నిషేధిత జాబితా పేరుతో దోపిడీకి స్కెచ్
- రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్

హైదరాబాద్, ఆగస్ట్18 (జనంసాక్షి) : గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండింతలు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరకు ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు అప్పగించే కుట్ర ఉందని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసినప్పటికీ భూములను లాక్కునే ప్రభుత్వాల విధానంలో ఎలాంటి మార్పు రాలేదని ఈటల విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే భూములను సెటిల్‌మెంట్ చేసుకుంటోందని ఆరోపించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనంటూ ఈటల సంచలన ఆరోపణలు చేశారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ ద్వారా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని ఈటల పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. పేదలు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ముకాయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంలో ఈటల చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

పెన్షన్ కోసం వయోవృద్ధుల ఎదురుచూపు

- కొత్త ప్రకటనలో అవకాశం లేకపోవడంపై ఆందోళన

హైదరాబాద్, ఆగస్ట్18 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నూతన చేయూత పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించి, అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఈ నిర్ణయం ఏళ్ల తరబడి పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వేలాదిమంది వయోవృద్ధులకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం ఏడు రకాల పింఛన్లకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తుండగా, వృద్ధాప్య పింఛన్లను ఈ జాబితాలో చేర్చకపోవడం తో వృద్ధుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతంలో వృద్ధాప్య పింఛను వయోపరిమితిని తగ్గించినప్పటికీ అనేక మంది అర్హులకు అవకాశం దక్కలేదు. ఆన్‌లైన ఐడీలు ఓపెన్ కాకపోవడంతో వేలాది మంది అర్హులైన వృద్ధులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ప్రభుత్వం మారిన తర్వాతైనా తమకు అవకాశం వస్తుందని భావించిన వయోవృద్ధులకు ప్రస్తుతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వకపోవడంతో వారు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మొదటి విడతగా ఏడు కేటగిరీల వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, పైలేరియా, తలసేమియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు మాత్రమే ప్రాధాన్యం కల్పించారు. కొత్త పింఛన్ల దరఖాస్తుకు రకరకాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేయడంతో జిల్లాల్లోని తహసీల్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం నుంచి దివ్యాంగుల పింఛను రూ.4016, వితంతు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ.2016 ప్రతినెలా అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులకు అవకాశం కల్పించక పోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ ఆ దరఖాస్తుదారులకు నేరుగా పింఛన్ ఇస్తారా లేక మళ్లీ కొత్తగా అప్లై చేసుకోవాలా? అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. అర్హులైన వారు ఈనెల 31లోపు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు లేదా వార్డు ఆఫీసర్లకు తమ దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

మెడికల్, డెంటల్ కాలేజీల్లో సీట్ల భర్తీ

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదుకు అవకాశం

వరంగల్, ఆగస్ట్18 (జనంసాక్షి) : తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పక్రియను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తిరిగి ప్రారంభించింది. అభ్యర్థుల నుంచి వచ్చిన పలు అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు మరో అవకాశం కల్పించినట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. నీట్ యూజీ 2026లో నిర్ణీత కటాఫ్ స్కోర్ లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి అర్హత పొందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ పక్రియ ఆగస్టు 18 మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆగస్టు 20 సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. ఇప్పటికే తమ దరఖాస్తులను సమర్పించిన అభ్యర్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని యూనివర్సిటీ స్పష్టం చేసింది. అభ్యర్థులు ఇతర వివరాల కోసం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్, ప్రాస్పెక్టస్‌ను పరిశీలించాలని సూచించింది. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18(జనంసాక్షి): అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల పంపిణీ, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్దే అనిల్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ ఛైర్మన్లు ఆకాష్, సహిన్ సుల్తానా, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు మంగ, దేవయ్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు సిర్పూర్, కాగజ్ నగర్ నియోజకవర్గాలకు సమానంగా కేటాయించడం జరిగిందని, అర్హులైన నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెలలో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇద్దామని తెలిపారు. మైనారిటీ మహిళలకు ఆర్థికంగా తోడ్పాటు అందించేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ కొరకు అధిక ప్రాథమిక ఇస్తుందని తెలిపారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలలో పర్యాటకరంగ అభివృద్ధికి నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అవుతున్న నేపథ్యంలో రైతుల సంక్షేమం దృష్ట్యా వట్టివాగు ప్రాజెక్టు నుండి సాగునీరు అందిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతను పాటించడం జరుగుతుందని, ఏ ఒక్క అనర్హుడికి ఇల్లు మంజూరు అయితే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి.అహ్మద్, గృహ నిర్మాణ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, లబ్ధిదారులు, కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంతో ప్రజలకు ప్రయాణం సులభతరం

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామీణ ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలం అంకుశపూర్ - తట్టుగూడెం మధ్య 8 కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో మంజూరైన హై లెవెల్ వంతెన నిర్మాణానికి శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, కాగజ్ నగర్ రాజస్వ మండలాధికారి చెన్నూరి కిష్టయ్య, రోడ్డు భవనాల శాఖ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వర్షాకాలంలో వాగులు, వంకలు పొంగిపొర్లినప్పుడు ఆయా ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హై లెవెల్ వంతెనల నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయితే కాగజ్‌నగర్, వాంకిడి ప్రాంతాల మధ్య రవాణా అనుసంధానం మరింత మెరుగుపడుతుందని, గ్రామీణ ప్రాంతాల నుంచి సమీప పట్టణాలు, మార్కెట్లు, విద్యా సంస్థలు, వైద్య సేవలు, ఇతర అవసరాలకు చేరుకోవడం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. హై లెవెల్ వంతెన నిర్మాణంతో వరదల సమయంలో ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. వంతెన పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత అంచనాలు, సాంకేతిక ప్రమాణాల మేరకు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణిలో 142 దరఖాస్తులు



హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన 248వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 142 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 32, మున్సిపల్ శాఖకు 29, హోం శాఖకు 16, ప్రవాసి ప్రజావాణికి 02, ఇతర శాఖలకు 63 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్మెంట్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు. వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన వివిధ విభాగాల సిబ్బంది సమస్యలపై సీ.ఐ.టీ.యు. అనుబంధ సంఘం నాయకులతో కూడిన సభ్యులు సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాకతీయ కె హబ్ విద్యార్థులకు అవగాహన

- టి హబ్ ప్రతినిధులతో ఒకరోజు శిక్షణ

వరంగల్, ఆగస్ట్18 (జనంసాక్షి) : కాకతీయ విశ్వవిద్యాలయ కే-హబ్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులకు టీ-హబ్ ప్రతినిధులతో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం విశ్వవిద్యాలయ సెనెట్‌హాల్‌లో నిర్వహించారు. కే-హబ్ డైరెక్టర్ ఆచార్య టీ సవితా జ్యోత్స్నాసారథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీ-హబ్ ప్రతినిధి బాల మురళి భాస్కరన్ విద్యార్థులకు స్టార్టప్ మెంటార్‌షిప్, ఐడియా జనరేషన్, ఐడియా వ్యాలిడేషన్ తదితర అంశాలపై ఆచరణాత్మక శిక్షణ అందించారు. విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా ఎలా మలచుకోవాలి, ఒక ఆలోచనలోని కొత్తదనం, సృజనాత్మకత, సాధ్యాసాధ్యాలను ఎలా గుర్తించాలి అనే అంశాలను వివిధ ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులు స్టార్టప్‌లు, వ్యాపార ఆలోచనలకు సంబంధించిన పలు ప్రశ్నలను అడగగా, టీ-హబ్ ప్రతినిధులు వాటిని నివృత్తి చేశారు. ఆలోచనలను గుర్తించి, వాటికి సమర్థవంతమైన రూపకల్పన చేసి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇలాంటి 15 శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కే-హబ్ డైరెక్టర్ సవితా జ్యోత్స్న తెలిపారు. ఈ శిక్షణల ద్వారా విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం, అంకుర సంస్థల స్థాపనపై అవగాహన, సృజనాత్మక ఆలోచనా శక్తి మరింత పెంపొందుతుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కే-హబ్ సంయుక్త సంచాలకులు సిద్ధు, కిరణ్ పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి పారిశ్రామిక తోడ్పాటు

- ఇందిరమ్మ ఇళ్లకు రూ.230 కే సిమెంట్ బస్తా
- సామాజిక బాధ్యతను ప్రశంసించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఆగస్ట 18 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో ప్రజాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్ ధరల తగ్గింపుపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ మినహా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశాం. అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ కు శ్రీకారం చుట్టాం. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 100 శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఎంతటి ఆర్థిక భారం పడినా పేదల ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రతి లబ్దిదారుడికి నిర్మాణ పురోగతికి అనుగుణంగా విడతల వారీగా ప్రతి సోమవారం పారదర్శకంగా నిధులను విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ బృహత్తరమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో సిమెంట్ పరిశ్రమల యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రజలు కలిసి పనిచేస్తే తెలంగాణలో గుడిసెలు లేని రాష్ట్రం లక్ష్యాన్ని త్వరితగతిన సాధించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి వర్గం సహకారం అందించాలని పిలుపునిచ్చారు. మంత్రి విజ్ఞప్తి మేరకు ఒక్కో బస్తాను 230 రూపాయి లకు ఇవ్వడానికి యాజమాన్యాలు అంగీకరిం చాయి. ఈసందర్భంగా మంత్రి పొంగులేటి యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతో పాటు హౌసింగ్ సెక్రటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం

- మంటల్లో చిక్కుకుని కార్మికుడు మృతి

రాజన్నసిరిసిల్ల, ఆగస్ట్18 (జనంసాక్షి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పెద్దూరు శివారులోని మహాలక్ష్మి ఫర్నిచర్ దుకాణంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా 3 ఫైర్ ఇంజన్లతో సిబ్బంది దాదాపు మూడు గంటలకు పైగా శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో రాత్రి దుకాణంలో నిద్రించిన ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన ఒక కార్మికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ నాగేంద్ర చారి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డెడ్‌బాడీని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాదాపుగా 40 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణ యజమాని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో యువకుడి దారుణ హత్య

- స్నేహితులే హత్య చేసినట్లు పోలీసుల గుర్తింపు



రంగారెడ్డి, ఆగస్ట్ 18 (జనంసాక్షి) : రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో స్నేహితులే అతడిని కిరాతకంగా చంపేశారు. రివర్స్ కేఫ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు బిహార్‌కు చెందిన అనికేత్‌గా గుర్తించారు. అనికేత్.. తన స్నేహితులు రోహిత్, రాహుల్, అంకిత్‌లతో కలిసి మద్యం సేవించాడు. ఈ సమయంలో స్నేహితుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. తీవ్ర ఆగ్రహానికి గురైన రాహుల్.. అనికేత్ తల వెనుక భాగంలో ఐరన్ రాడ్‌తో బలంగా కొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న యువకుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అనికేత్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణను వేగవంతం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
19 ఆగస్టు 2026

న్యాయవ్యవస్థపై నమ్మకం కోల్పోతే ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటిక

సంపాదకీయం

విమర్శలను అణచివేయడం కంటే వాటికి సమాధానం ఇవ్వడం ప్రజాస్వామ్యానికి బలం. న్యాయవ్యవస్థపై నమ్మకం కోల్పోవడం ఒక సంస్థకు మాత్రమే నష్టం కాదు... మొత్తం ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటిక.

'చలో పార్లమెంట్' ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారన్న ఆరోపణలపై విచారణకు సుప్రీంకోర్టు ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ పరిణామం. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, రిటైర్డ్ డీజీపీ వంటి అనుభవజ్ఞులతో కమిటీ ఏర్పాటు చేయడం విచారణ నిష్పాక్షికంగా జరగాలన్న ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోంది.

పోలీసులు అతిగా వ్యవహరించారన్న ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. తప్పు జరగలేదని తేలితే ఆ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పాలి. విచారణ పూర్తికాకముందే ఎవరినీ దోషులుగా తేల్చడం కూడా సరికాదు. నిజానిజాలు వాస్తవాల ఆధారంగా బయటకు రావాలి.

ఇదే సమయంలో హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థుల తర్వాత కర్ణాటకలోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కూడా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను తమ పట్టాల ప్రధానోత్సవానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై అభ్యంతరం వ్యక్తం చేయడం ఆలోచించాల్సిన పరిణామం. నల్సార్‌లో 450 మందికి పైగా విద్యార్థులు ఆహ్వానం వద్దని లేఖ రాశారన్న విషయం కూడా గమనించాలి.

జూలై 2026లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల మార్చ్‌పై జరిగిన పోలీసు చర్యకు సంబంధించిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు అత్యవసరంగా విచారించకపోవడం, ఆ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి చేసిన కొన్ని వ్యాఖ్యలపై విద్యార్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలు ఈ ఆందోళనలకు కారణాలుగా ముందుకు వస్తున్నాయి. అయితే ఈ అంశాలపై పూర్తి వాస్తవాలు న్యాయపరమైన రికార్డులు, ఉత్తర్వుల ఆధారంగానే తేలాలి.

న్యాయ విద్యార్థుల ఆందోళనను పూర్తిగా కొట్టిపారేయడం ఎంత తప్పో, దాని ఆధారంగా ప్రధాన న్యాయమూర్తి తప్పు చేశారని ముందుగానే తీర్పు ఇవ్వడం కూడా అంతే తప్పు. ప్రతి ఆరోపణకు విచారణ అవసరం. ప్రతి నిరసన వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకోవాలి.

న్యాయ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు న్యాయవ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తడం మాత్రం తీవ్రమైన సంకేతం. ఎందుకంటే రేపటి న్యాయవాదులు, న్యాయమూర్తులు తయారయ్యేది ఈ విద్యాసంస్థల నుంచే. వారి సందేహాలను విస్మరించడం కాకుండా వాటికి సమాధానాలు వెతకాలి.

న్యాయస్థానాలు అధికారంతో మాత్రమే నిలబడవు. ప్రజల విశ్వాసమే వాటి అసలైన బలం. పోలీసు, న్యాయ వ్యవస్థలపై నమ్మకం దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థకే నష్టం. అందుకే సుప్రీంకోర్టు కమిటీ నిష్పాక్షికంగా విచారణ పూర్తి చేసి వాస్తవాలను వెలుగులోకి తేవాలి. అదే సమయంలో విద్యార్థుల ఆందోళనలను కూడా గౌరవంగా పరిశీలించాలి.

దిమాగీ నక్సలైట్!

జెన్ - జీ జంగ్ ముందుకే!

ముద్రలు వేసి... మెదడును మూయలేరు
సంకెళ్లు వేసి... ప్రశ్నను ఆపలేరు
భయపు చీకటిని చీల్చే యువతరం
జెన్-జీ జంగ్ ముందుకే, దిమాగీ నక్సలైట్ ముందుకే!
ఆగస్టు 15 ఎర్రకోట
జాతీయ పతాకం సాక్షిగా ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన వేదిక. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రజలు తమ బతుకుల ప్రశ్నలకు సమాధానాలు ఆశిస్తారు. చదువు, ఉద్యోగం, రైతు, కార్మికుడు, ధరలు, ప్రజాస్వామ్యం, భవిష్యత్తు గురించి పాలకుల వైఖరి తెలుసుకోవాలనుకుంటారు. ప్రసంగంలో ప్రజల ముందున్న అనేక ప్రశ్నలకు సమాధానాల కంటే ఒక కొత్త రాజకీయ పదం బలంగా వినిపించింది, "దిమాగీ నక్సల్." నక్సలిజం హింసాత్మక రూపం బలహీనపడిందని చెబుతూ, దాని వెనక ఉన్న "మేధో నక్సల్స్"ను గుర్తించి సామాజికంగా ఒంటరిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు.

రెండు మాటలు, ఆ రెండు మాటల వెనక అధికార భయం కనిపిస్తోంది. దిమాగ్‌తో ఆలోచిస్తే నక్సలైట్‌నా? అన్యాయాన్ని చూసి "ఎందుకు?" అంటే నక్సలైట్‌నా? పేపర్ లీక్‌పై లెక్క అడిగితే నక్సలైట్‌నా? ఉద్యోగం ఎక్కడుందని ప్రశ్నిస్తే నక్సలైట్‌నా? ఫీజులు ఎందుకు పెరుగుతున్నాయని నిలదీస్తే నక్సలైట్‌నా? విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామ్య హక్కులు కావాలంటే నక్సలైట్‌నా?అలా అయితే.. ఆలోచించే మెదళ్లన్నీ నక్సలైట్లే! ప్రశ్నించే గొంతులన్నీ నక్సలైట్లే! ఇది మాటల ఆట కాదు. అధికారమే వేసిన ముద్రను తిరిగి అధికారానికే అద్దంలా చూపించడం. "నీ ప్రశ్న తప్పు" అని చెప్పాలంటే వాదన కావాలి. ఆధారం కావాలి. సమాధానం కావాలి. "నువ్వే తప్పు" అని చెప్పడానికి ఒక ముద్ర చాలు. అక్కడే ప్రజాస్వామ్య సంభాషణకు తలుపు మూసుకుపోతుంది. ప్రశ్నకు జవాబు ఇవ్వలేనప్పుడు ప్రశ్నించినవాడినే ప్రశ్నార్థకుడిగా నిలబెట్టడం పాత రాజకీయ చిట్కా. పేరు మారుతుంది. ముద్ర మారుతుంది. మతలబు మాత్రం మారదు.

ఒకప్పుడు "దేశద్రోహి", తర్వాత "అర్బన్ నక్సల్", మధ్యలో "టుక్డే టుక్డే గ్యాంగ్", "ఆందోళన్‌జీవీ", ఇప్పుడు ఇదిగో "దిమాగీ నక్సల్". పదాలు మారుతున్నాయి, ప్రశ్నించే గొంతును అనుమానంగా మార్చే రాజకీయ భాష మాత్రం కొనసాగుతోంది. ఇక్కడే ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. ఆయుధ హింసను సమర్థించడం ఒక విషయం. ప్రభుత్వ విధానాన్ని విమర్శించడం, సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించడం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడటం మరో విషయం. రెండింటినీ ఒకే గంపలో వేసి కొలవడం ప్రజాస్వామ్య నికి న్యాయం కాదు. ప్రభుత్వం ఏ భావజాలంతోనైనా విభేదించవ చ్చు. రాజకీయ ఉద్యమాలను విమర్శించవచ్చు. ప్రజాస్వామ్యంలో సమాధానం వాదనతో రావాలి. ముద్రతో కాదు. ప్రతివాదం రాజకీ యంగా ఉండాలి, సామాజిక బహిష్కరణ పిలుపుగా మారకూడదు. నేహా బోరా వంటి యువ గొంతులు ఇక్కడ ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

నేహాతో ఏకీభవించాల్సిన అవసరం లేదు. ఆమె మాటలను విమర్శించొచ్చు. రాజకీయ పద్ధతులను ప్రశ్నించొచ్చు. ఆలోచనలతో విభేదించొచ్చు. అదే ప్రజాస్వామ్యం. ఆమె లేవనెత్తిన ప్రశ్నలకు జవాబు చెప్పకుండా ఆమెపై ముద్ర వేయడం ప్రజాస్వామ్య చర్చ కాదు. నేహా అడిగేది నేహా ఒక్కదాని ప్రశ్న కాదు. "మా చదువు? మా ఉద్యోగం? మా భవిష్యత్తు ఏంది?" దేశవ్యాప్తంగా లక్షలాది యువత గుండెల్లో మండుతున్న ప్రశ్నలివి. ఒక నేహాను ఒంటరిచేయవచ్చు, సభను అడ్డుకోవచ్చు, ఒక మైక్ లాక్కోవచ్చు, పోస్టర్ చింపేయవచ్చు. ఒక తరానికి వచ్చిన ప్రశ్నను ఎక్కడికి పంపుతారు? జైల్లో పెడతారా? ఫైల్లో దాచేస్తారా? పేరు మార్చి పిలుస్తారా? "దిమాగీ నక్సల్" అని ముద్ర వేస్తారా? వేయండి. ప్రశ్నను ఎక్కడ దాచగలరు? ఒకరి నోట పుడుతుంది. పది మందిలో పాకుతుంది. వంద మందిలో నినాదమవుతుంది. వేల గొంతుల్లో ఉద్యమమవుతుంది. చివరకు చరిత్ర తలుపు తడుతుంది. చరిత్రకు తాళం వేసినోడెవరూ లేడు.

మోదీ ప్రసంగంలోని మరో అంశం గమనించాలి. యువత గురించి పదే పదే మాట్లాడినా, జెన్ - జీని వీధుల్లోకి తెచ్చిన విద్యా సంక్షోభం, పేపర్ లీక్‌లు, నిరుద్యోగం, ఫీజుల భారం, పరిశోధన అవకాశాల కొరత వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కనిపించలేదు. జంతర్ మంతర్ నిరసనల రాజకీయ ప్రతిధ్వని ఎర్రకోట ప్రసంగంలో వినిపించలేదు. అదే ప్రసంగం ఒక కొత్త శత్రువును పరిచయం చేసింది, "దిమాగీ నక్సల్." ప్రజల సమస్యలపై సమాధానం చెప్పాల్సిన సమయంలో ప్రజల ఆలోచనలపై అనుమానం పెంచే పదం రావడం రాజకీయంగా పరిశీలించాల్సిన పరిణామం.

> **యూపీఏ కాలంలో సమాచార హక్కు, ఉపాధి హామీ, అటవీ హక్కులు, ఆహార భద్రత, భూసేకరణలో పరిహారం, పునరావాసం వంటి హక్కుల చట్టాల కోసం వామపక్షాలు, ప్రజా ఉద్యమాలు, మేధావులు పోరాడారు. ప్రజలకు ప్రభుత్వం నుంచి ప్రశ్నించే, హక్కులు అడిగే స్థలం ఏర్పడింది. ఆ హక్కుల రాజకీయమే అసలు భయమా? సమాచార హక్కుతో ప్రభుత్వం లెక్క చెప్పాల్సి రావడం ఎందుకు అసౌకర్యం? అటవీ హక్కులతో ఆదివాసీ తన భూమి గురించి మాట్లాడటం ఎందుకు అడ్డంకి? ఉపాధి హామీతో పేద కూలీ పని అడగడం ఎందుకు భారంగా మారాలి? భూసేకరణలో రైతు సమ్మతి, పరిహారం, పునరావాసం అడగడం ఎందుకు అభివృద్ధి వ్యతిరేకతగా మారాలి? ప్రజలకు హక్కులు పెరిగిన కొద్దీ అధికారం జవాబుదారిగా మారుతుంది. ప్రజాస్వామ్య సారం అదే.**

"దిమాగీ నక్సల్" అనే పదాన్ని కేవలం రాజకీయ విమర్శగా వదిలేయలేం. ఆలోచనను, మేధస్సును, అసమ్మతిని ఒకే ముద్రలోకి నెట్టే రాజకీయ భాషగా మారితే ప్రమాదం మరింత పెద్దది. మన దేశం ఇలాంటి చీకటి అనుభవాలను చూసింది. నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే, ఎం.ఎం. కల్బుర్గి, గౌరీ లంకేశ్.. భిన్నంగా ఆలోచించిన మేధావుల హత్యలు ప్రజాస్వామ్య మనస్సాక్షిపై మిగిలిన గాయాలు. రచయితలు, కార్యకర్తలు, మానవ హక్కుల పరిరక్షకులు కేసులు, అరెస్టులు, వేధింపులు ఎదుర్కొన్న అనుభవాలు మన ప్రజాస్వామ్య చరిత్రలో నమోదయ్యాయి. భిన్నంగా ఆలోచించడం భారత ప్రజాస్వామ్య బలం. భిన్నంగా ఆలోచించడమే అనుమానంగా మారితే అది ప్రమాద సంకేతం. ప్రజలు ఏమి ఆలోచించాలి?ఏ పుస్తకం చదవాలి? ఏ సిద్ధాంతాన్ని చర్చించాలి? ఎవరిని విమర్శించాలి. అన్నింటికీ అధికారం సమాధానం చెప్పాలనుకుంటే ప్రజాస్వామ్యం ఎక్కడ మిగులుతుంది?

జార్జ్ ఆర్వెల్ ఊహించిన 'థాట్ పోలీస్' గుర్తుకు రావడం అందుకే. నియంతృత్వం మొదట చేతులను కాదు మెదళ్లను భయపెట్టాలని చూస్తుంది. ప్రజల సమస్యలకు జవాబు చెప్పడం కంటే ఒక శత్రువును చూపించడం సులువు. ఉద్యోగాలు లేవా? ఒక శత్రువును చూపించు. విద్య కూలిపోతోందా? మరో శత్రువును చూపించు. ప్రజలు రోడ్డెక్కుతున్నారా? వాళ్ల వెనక కుట్ర ఉందని చెప్పు. యువత ప్రశ్నిస్తున్నదా? "దిమాగీ నక్సల్స్" ఉన్నారని చెప్పు. ముద్రతో పేపర్ లీక్ ఆగుతుందా? నిరుద్యోగం తగ్గుతుందా? పాఠశాలలు తెరుచుకుంటాయా? ఫెలోషిప్‌లు పెరుగుతాయా? విశ్వవిద్యాలయాలు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటాయా? ముద్రలు ఏ సమస్యనూ పరిష్కరించవు. జంతర్ మంతర్ కేవలం ఒక ప్రదేశం కాదు. ప్రశ్నకు చిరునామా. నేహా బోరా కేవలం ఒక వ్యక్తి కాదు. తన భవిష్యత్తు కోసం గొంతెత్తుతున్న యువతకు ప్రతీక. "దిమాగీ నక్సల్" కేవలం రెండు మాటలు కాదు. మెదడు--అధికారం మధ్య జరుగుతున్న పోరాటానికి సంకేతం. ఒక వైపు అధికార కేంద్రీకరణ. మరో వైపు ప్రశ్నించే తరం. ఒక వైపు కార్పొరేట్ - మతతత్వ రాజకీయాల కలయిక. మరో వైపు ప్రజల హక్కులు. ఒక వైపు మూఢభక్తి. మరో వైపు వివేకం. ఒక వైపు భయం. మరో వైపు ధిక్కారం. ఈ పోరాటంలో ప్రశ్నించే మెదడే ప్రజాస్వామ్యానికి మొదటి కాపలాదారు.

అందుచేత దిమాగ్‌కు తాళం వేయలేరు. ప్రశ్నకు సంకెళ్లు వేయలేరు. ఆలోచనను అరెస్టు చేయలేరు. మూఢభక్తిపై వివేకం గెలవాలి. మత ఛాందసత్వంపై మానవత్వం గెలవాలి. భయంపై ధైర్యం గెలవాలి. అబద్ధంపై సత్యం గెలవాలి. అధికార ముద్రలపై ప్రజల ప్రశ్న గెలవాలి. మనసు నిర్భయంగా ఉండాలి. మెదడు స్వేచ్ఛగా ఆలోచించాలి. గొంతు ధైర్యంగా పలకాలి. క్యాంపస్ నుంచి వీధిదాకా ప్రశ్న నడవాలి. ప్రశ్న పుడితే ఆలోచన మొదలవుతుంది. ఆలోచన పెరిగితే చైతన్యం పుడుతుంది. చైతన్యం కలిస్తే ఉద్యమం పుడుతుంది. ఉద్యమం నడిస్తే చరిత్ర కదులుతుంది. "దిమాగీ నక్సలైట్" అని ముద్ర వేస్తారా? ఆలోచించే హక్కు కోసం, అవును! ప్రశ్నించే హక్కు కోసం, అవును! అన్యాయాన్ని లెక్క అడిగే హక్కు కోసం, అవును! ముద్రలు ఎన్ని వేసినా... ప్రశ్నించే తరం వెనక్కి తగ్గదు. దిమాగ్ తెరిచే ఉంటుంది. గొంతు పలుకుతూనే ఉంటుంది. జెండా ఎగురుతూనే ఉంటుంది. జెన్ - జీ జంగ్ ముందుకే!

- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి,
సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తెలంగాణ
సెల్ : 78932 30218

తెలంగాణ బీజేపీ నేతలకు జాతీయ కమిటీలో చుక్కెదురు

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటించిన కొత్త జాతీయ కార్యవర్గంలో తెలంగాణ నుంచి ఒక్క నేతకూ చోటు దక్కలేదు. గతంలో జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న డి.కె. అరుణ, ప్రధాన కార్యదర్శిగా ఉన్న బండి సంజయ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఉన్న కె. లక్ష్మణ్‌లకు పునర్నియామకం లేకపోవడం రాష్ట్ర పార్టీకి గట్టి హెచ్చరిక. తెలంగాణ మాత్రమే దక్షిణ భారతంలో జాతీయ ప్రాతినిధ్యం లేని రాష్ట్రంగా నిలిచింది.

దీన్ని కేవలం "అవమానం"గా చూడటం సరికాదు. కేంద్ర నాయకత్వం వ్యక్తిగత ప్రభావం కంటే సంస్థాగత విశ్వసనీయత, ఎన్నికల సామర్థ్యం, ఐక్యతను ఎక్కువగా చూస్తోందా అన్నది ప్రశ్న. 2024 లోక్‌సభలో బీజేపీ 8 సీట్లు, 35 శాతం ఓట్లు సాధించి బలం చూపింది. కానీ ఎనిమిది మంది ఎంపీలు ఉన్నా ఒకే రాజకీయ స్వరంతో పనిచేయలేకపోతే సంఖ్య సంస్థాగత బలంగా మారదు.

తెలంగాణ బీజేపీలో నాయకత్వ పోటీలు, వర్గ విభేదాలు, పరస్పర విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. కాంగ్రెస్‌పై పోరాడాల్సిన సమయంలో కొందరు నేతలు అధికార పక్షంతో సన్నిహితంగా కనిపించడం కార్యకర్తల్లో సందేహాలు కలిగించాయి. 2023 అసెంబ్లీలో 8 సీట్లు, 14 శాతం ఓట్ల నుంచి 2024లో పెరిగినా, దాన్ని శాశ్వత రాష్ట్ర బలంగా మార్చే గ్రామస్థాయి సంస్థ, సామాజిక సమీకరణ, నిరంతర ఉద్యమాలు ఇంకా పూర్తికాలేదు. జాతీయ కమిటీలో స్థానం లేకపోవడం "కేంద్రం ఆశలు వదులుకుంది" అని తేల్చడం తొందర. కానీ ప్రస్తుత నాయకత్వంపై పూర్తి సంతృప్తి లేదనే సంకేతం మాత్రం స్పష్టం. ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం రావడం దీన్ని మరింత నొక్కి చెబుతోంది.

అసలు సమస్య జాతీయ పదవులు కాదు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడటమే. ఎనిమిది మంది ఎంపీల బలాన్ని ఒకే దిశలో నడిపించలేకపోవడమే ప్రమాదం. ఇది తెలంగాణ బీజేపీకి ఆత్మపరిశీలనకు అవకాశం. అంతర్గత ఐక్యత, ప్రజా సమస్యలపై పోరాటం, సమన్వయం పెంచుకోకుండా ఢిల్లీని మాత్రమే తప్పుపట్టడం పనికిరాదు.

2024లో ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సంస్థాగత శక్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర నాయకత్వంపైనే ఉంది.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

ఫోటో జర్నలిస్టులూ చరిత్ర కారులే..

క్షణాల్లో మారిపోయే సంఘటనలను సరైన సమయంలో, సరైన కోణంలో బంధించడం ఫోటో జర్నలిస్టులకు నిత్య సవాలు. రాస్తారోకోలు, ధర్నాలు, రకరకాల నిరసనలు జరుగుతున్నప్పుడు ఆ ఉద్యమం ఎటు దారితీస్తుందో క్షణక్షణం పరిశీలిస్తూ, చూపుడు వేలును కెమెరాపై ఉంచి 'క్లిక్' అనిపించేందుకు సిద్ధంగా ఉంటారు. కెమెరాకు కన్నుగా మారి, ముందు-వెనుక చూడకుండా యుద్ధరంగంలో సైనికునిలా మారిపోతారు. అలా బంధించిన ఒక్క ఫోటో కొన్నిసార్లు వేల మాటల కంటే ఎక్కువ నిజాన్ని, ఎక్కువ భావోద్వేగాన్ని చెబుతుంది. లక్ష మాటలు చెప్పలేని విషయాన్ని ఒక్క ఫోటో చెప్పేస్తుంది. అందుకే ఫోటో జర్నలిజానికి ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ ఆదరణ తగ్గలేదు.

1880లో పత్రికల్లో వ్యాసాలతో పాటు నేరుగా ఫోటోలను ముద్రించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. ఇది ఫోటో జర్నలిజానికి పునాది వేసింది. రాసిన వాటిని అర్థం చేసుకోవాలంటే చదవడం రావాలి. కానీ ఫోటో మాత్రం ఏ చదువు లేకున్నా అంతా అర్థం చేయిస్తుంది. 1848లో ఫ్రాన్స్ విప్లవ సమయంలో తీసిన బారికేడ్ల ఫోటోను చరిత్ర మొదటి 'న్యూస్ ఫోటో'గా గుర్తించింది. అప్పటి నుంచి దాదాపు 178 సంవత్సరాల చరిత్రలో ఫోటో జర్నలిజం సమాచార రంగంలో కీలక శక్తిగా మారింది. 1925లో 'లైకా' అనే చిన్న 35 ఎం.ఎం. కెమెరా మార్కెట్‌లోకి రావడంతో ఫోటో జర్నలిజంలో వేగం, సులభత పెరిగాయి. 1930-50 మధ్య కాలాన్ని ఫోటో జర్నలిజం స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చు. లైఫ్, లుక్ వంటి అంతర్జాతీయ పత్రికలు కేవలం ఫోటోలతోనే కథనాలను ప్రచురించి పాఠకులకు దగ్గరయ్యాయి.

రోజర్ ఫెంటన్ మొట్టమొదటిసారి యుద్ధరంగంలోకి వెళ్లి ఫోటోలు తీశాడు. 1853 నుంచి మూడేళ్లపాటు తన ప్రాణాలకు తెగించి క్రిమియన్ యుద్ధాన్ని ప్రపంచం కళ్లకు కట్టినట్లు చూపించాడు. 1972లో నిక్ ఉట్ తీసిన ఫోటో ప్రపంచ చరిత్రనే మార్చేసింది. బాంబు దాడివల్ల ఒంటిపై బట్టలు కాలిపోగా భయంతో ఏడుస్తూ పరిగెడుతున్న తొమ్మిదేళ్ల కిమ్ ఫుక్ ఫోటో అమెరికాను గడగడలాడించింది. వియత్నాం యుద్ధాన్ని తక్షణమే ఆపాలని అమెరికాలో నిరసనలు వెల్లువెత్తాయి. ఒక ఫోటో యుద్ధాన్ని ఆపగలదని ప్రపంచానికి మొదటిసారి తెలిసింది.

భారతదేశంలో ఫోటో జర్నలిస్టు అంటే రఘు రాయ్ గుర్తుకొస్తారు. ఆధునిక భారత ఫోటో జర్నలిజానికి ఆయన పితామహుడు. సివిల్ ఇంజనీరింగ్ చదివిన ఆయన అన్న ప్రభావంతో ఈ రంగంలోకి అడుగుపెట్టారు.

సునీల్ జనహ్, పాల్ లూయిస్ లుకూడా ఫోటో జర్నలిజాన్ని కొత్త పుంతలు తొక్కించారు. కేవలం వార్తల కోసం కాకుండా చరిత్రను నిర్మించే కోణంలో ఫోటోగ్రఫీని రాజకీయ, సామాజిక ఆయుధంగా మలుచుకున్నారు. బెంగాల్ కరువు, తెభాగా పోరాటం, అనేక కార్మికోద్యమాల తీవ్రతను సునీల్ జనహ్ ఫోటోలు ప్రపంచానికి చాటాయి. పాల్ లూయిస్ ఫోటోలు గిరిజన, రైతాంగ పోరాటాలను, పెట్టుబడిదారీ విధానాల వల్ల నలిగిపోతున్న పేదల వేదనను పట్టి చూపాయి.

తెలంగాణ ఫోటో జర్నలిస్టుల చరిత్ర కూడా తక్కువ కాదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో వారి పాత్ర వెలకట్టలేనిది. మిలియన్ మార్చ్, సాగరహారం, ఛలో అసెంబ్లీ, సడక్ బంద్, రైల్ రోకో, రాస్తారోకో, వంటవార్పు వంటి అన్ని ఉద్యమ ఘట్టాలను తనివితీరా రికార్డు చేశారు. పొద్దున్నే పత్రికల్లో కనిపించిన ఆ ఫోటోలు పాఠకుల్లో ఉద్యమ తీవ్రతను పెంచాయి. నిలువెల్లా కాలిబూడిదైపోయిన శ్రీకాంతా చారి ఫోటో చూసి యావత్ తెలంగాణ చలించిపోయింది, కన్నీరు మున్నీరైంది. ఆనాటి ఉద్యమ ఘట్టాలను ఫోటోల రూపంలో నేటికీ సజీవంగా ఉంచిన ఘనత ఫోటో జర్నలిస్టులదే.

ఇప్పుడు వృత్తిపరమైన ఫోటో జర్నలిస్టులు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నారు. స్మార్ట్‌ఫోన్ల ప్రభావం, సోషల్ మీడియా వెల్లువ, కృత్రిమ మేధ సృష్టిస్తున్న చిత్రాలు నిజమైన, విశ్వసనీయమైన ఫోటోలకు సవాలు విసురుతున్నాయి. ఒక ఫోటో జర్నలిస్ట్ సమాజం పట్ల బాధ్యతాయుతంగా, నిజాయితీగా, మానవత్వంతో ఉండాలి. సమాజంలో జరిగే వాస్తవాలను ఎలాంటి వక్రీకరణలు లేకుండా దృశ్యరూపంలో ప్రజల ముందుంచడమే వారి ప్రధాన కర్తవ్యం. నాయకుల సభలు, సమావేశాలు, ఆడంబరాల కంటే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి నిలపాల్సిన సందర్భం ఇది. వ్యవసాయ రంగంలో మహిళలు పడుతున్న కష్టం, మైనింగ్‌లో కార్మికుల బాధలు, ఇటుక బట్టీలలో నలిగిపోతున్న బాల్యం, మురికివాడల్లో చితికిపోతున్న బతుకులు, వీధి వ్యాపారుల వెతలు-ఇలా సహస్ర వృత్తుల్లో పోగుపడిన సమస్యలపై కెమెరా కన్ను పడాలి. ప్రతి ఏటా ఆగస్టు 19న లూయీ డాగ్యురే జన్మదినోత్సవాన్ని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంగా జరుపుకుంటాం. ఈ సందర్భంగా ఫోటో జర్నలిస్టులు తమ బాధ్యతను మరోసారి గుర్తుచేసుకోవాలి. సమస్యలెన్ని ఉన్నా వృత్తి నిబద్ధతను వదలకుండా ముందుకు సాగాలి. సమాజ నిర్మాణంలో మీ పాత్రను మీరు పోషించాల్సిందే. ఇది సమాజం మీపై పెట్టిన బాధ్యత. సమాజాన్ని అత్యంత ప్రభావితం చేయగల శక్తివంతులైన ఫోటో జర్నలిస్టులు మరింత స్ఫూర్తితో ముందుకు సాగాలి. మంచి సమాజ నిర్మాణంలో మీ వంతు కృషిని మీరు చేయాలి. ఫోటో జర్నలిస్టులు కేవలం చరిత్రను రికార్డు చేసేవారు కాదు. వారు చరిత్రను మలిచేవారు. వారు సమాజం మనస్సాక్షి.

- పి.వి. రావు
సీనియర్ జర్నలిస్ట్ 9010153065

స్వేచ్ఛా ప్రణయ గీతం

" మంచి పని చేసావు."

శరత్ ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ వెచ్చని స్పర్శ సరితకు ఒక కొండంత అండ అనిపించింది. నవ్వుకుంటూ అనేక ముచ్చట్లు.

"నీ ఆలోచనలు వంద శాతం కరెక్ట్.." అన్నాడు శరత్.

బుద్ధ వనం ఆ ప్రశాంత వాతావరణంలో, జపాన్ మినియేచర్ కట్టడం సాక్షిగా... ఆ ఇద్దరు యువతీ యువకులు ఒక నూతన జీవిత విధానానికి, నూతన సామాజిక ఆచరణకు మానసికంగా పునాది వేసుకున్నారు.

నాగార్జున సాగర్ లో నిర్ణయించుకున్నట్టుగా శరత్, సరిత కలిసి ఒక మంచి గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ అద్దెకు తీసుకుని సహజీవనం (Living-in Relationship) ప్రారంభించారు.

సరిత వెళ్లి పోవడంతో సుచిత్రకు తాను మెచ్చిన నవీన్ తోడుగా వచ్చాడు.

ఇలా సరిత, సుచిత్ర సమాజపు పాత కొలమానాలను పక్కన పెట్టారు. ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పులు కూడా ఈ నూతన దాంపత్యాన్ని అంగీకరించి, పెళ్లి ద్వారా కలిగే హక్కులు, బాధ్యతలు వీరికి కూడా వర్తిస్తాయని చెప్పడం వారికి మరింత చట్టబద్ధమైన ధైర్యాన్ని ఇచ్చింది.

ఒకరోజు శరత్ రూమ్‌కి వాళ్ల నాన్న రాజారాం గారు ఊరి నుండి వచ్చారు. మూడు రోజులు హాస్పిటల్ చుట్టు కలిసి తిరిగారు. సొంత కూతురు లాగే తనకు అన్ని చేసి పెడుతున్న సరిత ఆ ఇంటో కొడుకుతో కలిసి వుంటున్న విషయం తెలిసి పోయింది.

" అమ్మాయి అమ్మా నాన్నతో మాట్లాడుత. పెళ్లి ముహూర్తం పెట్టిస్త." అన్నాడు రాజారాం.

" వద్దు నాన్నా! వాళ్ల నాన్నకు ఈ విషయం తెలియదు. మాకు భారీ ఖర్చులతో పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. "

" ఇట్ల పెళ్లి లేకుండా ఎన్నాళ్లుంటారు? "

అప్పుడు సరిత చాలా నిదానంగా, గౌరవంగా ఆయనకు సమాధానం చెప్పడం ప్రారంభించింది.

"మావయ్యా! ప్రేమ అనేది ఒక సహజమైన ప్రవాహం. టీనేజ్ దాటి, నిరుద్యోగ ఒడిదుడుకులు తట్టుకుని, ఉద్యోగ అన్వేషణతో స్థిరపడే దశలో ఒకరినొకరు అర్థం చేసుకున్న వాల్లం కద! ... "

రాజారాం ఆశ్చర్యంగా వింటుండగా, సరిత కొనసాగించింది:

"కుల పట్టింపులు, వరకట్న వేధింపులు, ముహూర్తాలు, పంచాంగాల లెక్కలు, భారీ పెళ్లి ఖర్చులు ఎందుకు? మాకు ఇపుడేం తక్కువైంది మామయ్యా? నేను మా నాన్నకు ఎప్పటిలా నెల నెల పంపుతున్న. చెల్లెకు పంపుతున్న. శరత్ కూడ మీకు ఎప్పటిలా పంపుతునే ఉన్నాడు. ఇద్దరం కలిసి ఇద్దరి పేరు మీద గేటెటెడ్ కమ్యూనిటీలో ఒక అపార్టు మెంటు కొందామనుకుంటున్నాం."

శరత్ కూడా, "అవును నాన్నా. సంపరదాయ పాత పెళ్లి లోని అన్ని సమస్యలకు ఈ లివిన్ గొప్ప పరిష్కారం నాన్నా! కులం సమస్య లేదు. కట్నం సమస్య లేదు. పెళ్లి ఖర్చులు, వృధా ఖర్చుల సమస్య లేదు. ముహూర్తాలు గణాల కలవడం సమస్య లేదు. " అంటూ సముదాయించాడు.

పైసా ఖర్చు లేకుండా కొడుకు పెళ్లయి పోయిందంటే రాజారాం కు ఆశ్చర్యంగా ఉంది. నమ్మశక్యంగా లేదు. లోలోపల సంతోషంగా వుంది.

" మామయ్యా! మేం రిజిస్టర్ మ్యారేజి కూడ చేసు కోలేదు. అయినా చేసుకున్నామని

ఊళ్ళో చెప్పండి. ఈ దసరా బతుకమ్మ పండుగలకు ఇద్దరం కలిసి వస్తాము. మా కోడలు అని అందరికీ పరిచయం చేయండి. మీకు అత్తమ్మకు దగ్గరి చుట్టాలకు కొత్త బట్టలు పెట్టి ఆశ

ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలి

- సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య

మొయినాబాద్, ఆగస్టు 18 (జనంసాక్షి) : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల గంగయ్య అన్నారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య యాత్ర నేడు మొయినాబాద్ మండల కేంద్రానికి చేరుకుంది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆర్థిక సామాజిక పరంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. దేశంలోని నిరుద్యోగ యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదని సత్యం విమర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల్లో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలు వంటి ఘటనల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఇలాంటి ఘటనలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు, స్వతంత్ర సంస్థల పనితీరుపై ప్రజల్లో ఆందోళన నెలకొందని సత్యం అన్నారు. ప్రతిపక్షాల గొంతును అణచివేయడానికి ప్రయత్నాలు జరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని

పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజల సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శివార్ల ప్రాంతాల నుంచి ప్రారంభమైన ఈ యాత్ర జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల మీదుగా కొనసాగుతుందని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల పార్టీ కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం

మతం, కులం పేరుతో విభజన రాజకీయాలు వద్దు

ఎన్నికల సమయంలో మతం, కులం పేరుతో ప్రజల మధ్య విభజన సృష్టిస్తూ అసలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని జంగయ్య విమర్శించారు. ప్రజలకు అవసరమైన ఉద్యోగాలు, ఉపాధి, విద్య, వైద్యం, రైతుల సమస్యలు, ధరల పెరుగుదల వంటి అంశాలపై రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ వ్యవస్థలను కాపాడేందుకు ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

ఆగస్టు 21న భారీ బహిరంగ సభ

ఆగస్టు 21న అబ్బుల్లాపూర్ మెట్టు భూపోరాట కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా సీపీఐ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, రైతులు, కార్మికులు, కర్షకులు, కూలీలు, విద్యార్థులు, యువత, పార్టీ సానుభూతిపరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, దేశంలో ప్రత్యామ్నాయ ప్రజా విధానాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఐదు రోజుల బస్సు యాత్రను ప్రజలు ఆదరించాలని, ప్రతి మండలం, గ్రామంలో యాత్రకు ప్రజల మద్దతు లభించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని జంగయ్య కోరారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు, పేదల హక్కుల పరిరక్షణ కోసం సీపీఐ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా చైతన్య బస్సు యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి కే రామస్వామి పానుగంటి పర్వతాలు బుద్ధుల జంగయ్య ఓరుగంటి యాదయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం ప్రభు లింగం వడ్ల సత్యనారాయణ ఆర్ యాదగిరి పి శివకుమార్ శ్రీదేవి దత్తు నాయక్ గార క్రాంతి వంశి వర్ధన్ రెడ్డి సుధాకర్ హైదరాబాద్ మండల కార్యదర్శి కే శ్రీనివాస్ ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు మల్లేష్ కార్యదర్శి సురేష్ తూర్పు నరసింహులు పాండు మోహన్ రెడ్డి అమృత బాలమణి జంగయ్య కిషయ్య కాశీం భాయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

చేవెళ్ల, ఆగస్టు 18 (జనంసాక్షి) : వ్యసనాలకు యువత దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. నశా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా చేవెళ్లలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు శ్రీ చైతన్య, వివేకానంద కళాశాలల్లో మంగళవారం వ్యసన విముక్తిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించి, విద్యార్థులతో వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. మద్యం, మాదకద్రవ్యాలు, పొగాకు వంటి వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిర్వాహకులు వివరించారు. నేటి యువత వ్యసనాలకు లోనై విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సంతోష్ కుమార్, బాల్ రెడ్డి, చిరుమని తిరుపతి రెడ్డి, వేణుగోపాల్, పాండు యాదవ్, గోపాల్, భాగ్యలక్ష్మి, శశికళతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళు ్ల, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

మద్దూరు, ఆగస్టు 18 (జనం సాక్షి) : మద్దూరు మండల కేంద్రంలోని చింతల్‌దిన్నె మార్గంలో రూ.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అకాడమిక్ బ్లాక్, డైనింగ్ హాల్, ప్రిన్సిపాల్ క్వార్టర్స్, టాయిలెట్ బ్లాక్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్.. పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలకు వచ్చే ప్రధాన రహదారి విస్తరణ పనులపై మున్సిపల్ కమిషనర్‌ను ఆరా తీశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం నవంబర్ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాల్సి ఉందని, వచ్చే మార్చి నాటికి పాఠశాల భవనాన్ని పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం మద్దూరు పట్టణ సమీపంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రూ.6.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. గ్రౌండ్‌ఫ్లోర్ స్లాబ్, టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి, సెకండ్‌ఫ్లోర్ స్లాబ్, ప్రహరీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తరగతి గదుల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత గడువులోగా అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌కు చేరిన వనపర్తి పంచాయితీ

- చిన్నారెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ అధ్యక్షుడికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఫిర్యాదు

వనపర్తి బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీపై రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరిపి, తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరుతూ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తమకు కేవలం రాజకీయ పార్టీ కాదని, కన్నతల్లి లాంటిదని అన్నారు. అలాంటి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిందించే విధంగా, కాంగ్రెస్ పార్టీ డబ్బులకు అమ్ముడుపోయిందనే విధంగా చేసిన వ్యాఖ్యలు పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని పేర్కొన్నారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తల మనోభావాలను ఇలాంటి వ్యాఖ్యలు తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. పార్టీకి నష్టం కలిగించేలా, కార్యకర్తల మనోభావాలను కించపరిచేలా ఎవరైనా వ్యాఖ్యలు చేస్తే అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి క్రమశిక్షణాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కోరారు. పార్టీని బలోపేతం చేయాల్సిన సమయంలో నాయకుల మధ్య విభేదాలు సృష్టించేలా, కార్యకర్తలను నిరుత్సాహపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

ఫిర్యాదుపై సానుకూల స్పందన

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు చేసిన ఫిర్యాదుపై టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలపై తగిన విచారణ చేపట్టి, పార్టీ పెద్దలతో చర్చించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పార్టీపై, ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే అంశాలను నాయకత్వం తీవ్రంగా పరిగణిస్తుందని మహేష్

కుమార్ గౌడ్ స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రతి నాయకుడికి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు ఉన్నప్పటికీ, పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా, పార్టీ నాయకత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఎనిమిది మండలాల పార్టీ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మార్కెట్ యార్డు చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

టేక్మాల్, ఆగస్ట్ 18 (జనం సాక్షి) : టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి లోగురువారం వరి పొలాల వద్ద మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్ రైతులకు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కల్పించారు.వరి సాగును తగ్గించి పెసర, మినుము, కంది, జొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.రైతుల ఆరోగ్యం, భూసారం దెబ్బతినకుండా యూరియా వాడకాన్ని తగ్గించాలని తెలిపారు.నానో యూరియా, నానో డీఏపీ వినియోగంతో పంటలు సాగు చేయాలని సూచించారు.మండలంలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని, రైతులు జొన్న సాగును పెంచాలని కోరారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు సాగు చేస్తున్న వడ్లను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్, పంట నమోదు వివరాలను అధికారులకు సహకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలన్నారు.

పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని రాంప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మహేష్,రైతులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన

ఘట్కేసర్, ఆగస్టు 18 (జనం సాక్షి) : తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, మహేంద్రహిల్స్‌లో సోమవారం నషా ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఘట్కేసర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, సబ్‌ఇన్‌స్పెక్టర్ హీనా పోలీసు సిబ్బందితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు విద్యార్థినులను ఉద్దేశించి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువతను ప్రభావితం చేస్తున్న మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే సామాజిక, వ్యక్తిగత నష్టాలను వివరించారు. అలాగే పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ఆన్‌లైన్ మోసాలు, అనుమానాస్పద లింకులు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవడం వంటి అంశాలపై విలువైన

సూచనలు అందించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

చేవెళ్ల, ఆగస్టు 18 (జనంసాక్షి) : వ్యసనాలకు యువత దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని బ్రహ్మకుమారీస్ నిర్వాహకులు సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. నశా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా చేవెళ్లలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు శ్రీ చైతన్య, వివేకానంద కళాశాలల్లో మంగళవారం వ్యసన విముక్తిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న 10 కోట్ల వ్యసన విముక్తి ప్రతిజ్ఞల మహా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించి, విద్యార్థులతో వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. మద్యం, మాదకద్రవ్యాలు, పొగాకు వంటి వ్యసనాలు వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని నిర్వాహకులు వివరించారు. నేటి యువత వ్యసనాలకు లోనై విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, విద్యార్థులకు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సంతోష్ కుమార్, బాల్ రెడ్డి, చిరుమని తిరుపతి రెడ్డి, వేణుగోపాల్, పాండు యాదవ్, గోపాల్, భాగ్యలక్ష్మి, శశికళతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాళు ్ల, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నివాస కాలనీల్లో వారాంతపు మార్కెట్లపై కఠిన నిఘా

- కొత్త మార్కెట్లకు అనుమతులు నో..
- చెత్త వేస్తే వచ్చే వారం వ్యాపారానికి బ్రేక్
- పరిశుభ్రత విషయంలో రాజీ లేదంటున్న
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

కూకట్‌పల్లి, ఆగష్టు 8 (జనంసాక్షి) : నివాస కాలనీల్లో పరిశుభ్రత, పారిశుధ్యాన్ని కాపాడేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ) కీలక నిర్ణయం తీసుకుంది. కాలనీల్లో కొత్తగా వారాంతపు మార్కెట్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని నిర్ణయించడంతో పాటు, ఇప్పటికే కొనసాగుతున్న వారాంతపు మార్కెళ్లపై కఠిన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించింది. మార్కెట్ల నిర్వహణ సమయంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు.

కొత్త వారాంతపు మార్కెట్లకు అనుమతి లేదు

నివాస ప్రాంతాల్లో కొత్తగా వారాంతపు మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని సిఎంసీ స్పష్టం చేసింది. ఇప్పటికే నిర్వహిస్తున్న మార్కెట్ల పరిస్థితిని మున్సిపల్ ఫీల్డ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్కడ పారిశుధ్య పరిస్థితులు ఎలా ఉన్నాయో నిరంతరం పర్యవేక్షించనున్నారు. మార్కెట్ నిర్వాహకులు నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించనున్నారు.

చెత్త వేస్తే వ్యాపారానికి బ్రేక్

వారాంతపు మార్కెట్లలో కూరగాయల వ్యర్థాలు, కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై లేదా బహిరంగ ప్రదేశాల్లో పడేయడాన్ని జవీజ తీవ్రంగా పరిగణించనుంది. ప్రతి వ్యాపారి తన స్టాల్ నుంచి వెలువడే చెత్తను సక్రమంగా సేకరించి, నిర్ణీత విధానంలో పారవేయాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించింది. తనిఖీల సమయంలో ఎవరైనా కూరగాయల వ్యాపారి రోడ్డుపై వ్యర్థాలు వేస్తూ కనిపించినా, మార్కెట్ పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణానికి కారణమైనా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారికి తదుపరి వారంలో వారాంతపు మార్కెట్‌లో వ్యాపారం చేసేందుకు అనుమతి నిరాకరించనున్నారు. అవసరమైతే మున్సిపల్ నిబంధనల ప్రకారం అదనపు చర్యలు కూడా తీసుకోనున్నారు.

మార్కెట్ నిర్వాహకులదే బాధ్యత

వారాంతపు మార్కెట్లను నిర్వహించే నిర్వాహకులు కూడా పరిశుభ్రత విషయంలో ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని జవీజ సూచించింది. మార్కెట్ ప్రారంభం నుంచి ముగిసే వరకు చెత్త నిర్వహణపై దృష్టి పెట్టడంతో పాటు, మార్కెట్ ముగిసిన వెంటనే పరిసరాలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. వ్యాపారులు కూడా తమ స్టాళ్ల వద్ద చెత్తను రోడ్లపై పడేయకుండా, వ్యర్థాలను సక్రమంగా సేకరించి పారవేయాలని అధికారులు కోరారు. మార్కెట్ కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

వారాంతపు మార్కెట్లు నిర్వహించే ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, దుర్వాసన రావడం, రోడ్లు మరియు ఫుట్‌పాత్‌లు అపరిశుభ్రంగా మారడం వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నారు. నివాస

కాలనీల్లో ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సిఎంసీ పేర్కొంది. మున్సిపల్ అధికారులు నిర్వహించే తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై ఎలాంటి మినహాయింపులు ఉండవని స్పష్టం చేశారు. మార్కెట్ నిర్వాహకులు, వ్యాపారులు అధికారులతో సహకరిస్తేనే మార్కెట్లను క్రమబద్ధంగా నిర్వహించగలమని అధికారులు తెలిపారు. పరిశుభ్రతకు అందరి సహకారం అవసరం నివాస కాలనీల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగించేందుకు మార్కెట్ నిర్వాహకులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులకు సహకరించాలని జవీజ విజ్ఞప్తి చేసింది. మార్కెట్లు నిర్వహించడం వల్ల ప్రజలకు సౌకర్యం కలగాలి తప్ప, కాలనీ పరిసరాల్లో చెత్తాచెదారం, దుర్వాసన, అపరిశుభ్రతకు కారణం కాకూడదని స్పష్టం చేసింది. స్వచ్ఛ మార్కెట్లు, పరిశుభ్రమైన కాలనీలు, స్వచ్ఛ సైబరాబాద్" అనే లక్ష్యంతో మార్కెట్లపై కఠిన పర్యవేక్షణ కొనసాగించనున్నట్లు సిఎంసీ తెలిపింది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
19 ఆగస్టు 2026

కళ్యాణలక్ష్మి పథకాలను రద్దు చేస్తే ఉద్యమం ఉధృతం

● ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 18 (జనం సాక్షి) : పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసాగా నిలుస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రద్దు చేసే కుట్రలను ప్రభుత్వం మానుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే, సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. పథకాలను రద్దు చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడబిడ్డ పెళ్లి ఎంతటి ఆర్థిక భారమో గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 అక్టోబర్ 2న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రారంభించారని తెలిపారు. రూ.51 వేలతో ప్రారంభమైన ఆర్థిక సాయాన్ని దశలవారీగా రూ.75,116కు, అనంతరం రూ.1,00,116కు పెంచినట్లు

పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో సుమారు 13 లక్షల మంది ఆడబిడ్డల కుటుంబాలకు రూ.13 వేల కోట్ల మేర సాయం అందించామని చెప్పారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపి పేదింటి ఆడబిడ్డలకు అందుతున్న భరోసాను తొలగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వం హైకోర్టులో సరైన కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, మంత్రులకు సంబంధించిన అవినీతి ఆరోపణల కేసుల్లో ప్రైవేటు న్యాయవాదులకు కోట్ల రూపాయలు ఖర్చు చేసే ప్రభుత్వం.. పేదల సంక్షేమ పథకం విషయంలో ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని నిలదీశారు. పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసాకు ప్రతీకగా నిలిచిన ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయొద్దని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెళ్లిళ్లు జరిగి చాలా కాలమైనా, కొందరికి పిల్లలు పుట్టినా కళ్యాణలక్ష్మి సాయం అందక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉందని విమర్శించారు. పథకాలను రద్దు చేసే ప్రయత్నాలను ప్రభుత్వం కొనసాగిస్తే మంత్రులు, ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుని ఆందోళనలను ఉధృతం చేస్తామని సునీత లక్ష్మారెడ్డి హెచ్చరించారు. పేదల పెళ్లి కలలను కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకాలపై స్టే ఎత్తివేయాలి

టేక్మాల్, ఆగస్టు 18 (జనం సాక్షి) : కల్యాణలక్ష్మి - షాదీ ముబారక్ పథకాలపై ఉన్న స్టేను వెంటనే ఎత్తివేసి, పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు భక్తుల వీరప్ప డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో టేక్మాల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం తహసీల్దార్ తులసీరామ్‌కు వినతిపత్రం అందజేశారు. పేద ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచే పథకాలను నిలిపివేయడం అన్యాయమని వీరప్ప అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై ప్రభుత్వం సమర్థవంతంగా వాదించలేదని విమర్శించారు. హామీని నెరవేర్చకపోగా ఉన్న పథకాలను కూడా నిలిపివేయడం పేదలను మోసం చేయడమేనన్నారు. పెండింగ్ దరఖాస్తులన్నింటికీ వెంటనే నిధులు విడుదల చేయాలని, తులం బంగారం హామీ అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమ్మరి సిద్ధయ్య, నాయి కోటి భాస్కర్,చింత స్వప్న, వరలక్ష్మి, సుప్రజ, మల్లేశం, సలీం, గోవింద్ చారి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే ధ్యేయం

● ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల, ఆగస్టు 18 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించాలని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశానికి ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ బలోపేతం, నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ, వారిలో కాంగ్రెస్ పార్టీపై మరింత విశ్వాసం పెంపొందేలా అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

బాలానగర్, ఆగస్టు 18 (జనం సాక్షి) : మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మంగళవారం బాలానగర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్ విధులు, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పురోగతి, ఫిర్యాదుల స్వీకరణ, స్టేషన్ రికార్డుల నిర్వహణ, బీట్ వ్యవస్థ, నేర నియంత్రణ చర్యలు తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, నేర నియంత్రణ, రాత్రి గస్తీ, బీట్ పోలీసింగ్, అనుమానితులపై నిఘా తదితర అంశాలపై సూనూతో సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరం స్వీకరించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి - 44 ఉండటంతో పాటు బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ సూనూను ఆదేశించారు. నిర్మాణ పనుల కారణంగా నిరంతరం ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ట్రాఫిక్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని సూచించారు. పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ రద్దీని ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఫైర్ వాహనాలు తదితర అత్యవసర సేవల వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మైనర్ల డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, అధిక వేగం, తప్పుదారి ప్రయాణం తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం పెంచి పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, కోర్టు కేసుల్లో సమర్థవంతమైన ఫాలోఅప్ కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు.

మహిళలు, పిల్లల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు.

వాహనాలను కండిషన్‌లో ఉంచుకోవాలి

● అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్

నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 18 (జనం సాక్షి) : నారాయణపేట జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీసు వాహనాలను అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్ మంగళవారం తనిఖీ నిర్వహించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించే వాహనాలు ఎల్లప్పుడూ మంచి కండిష న్‌లో ఉండేలా అధికారులు, డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకో వాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వాహనాలు శాంతిభద్రతల పరిరక్షణ, పెట్రోలింగ్, అత్యవసర సేవలు, నేరాల నియంత్రణ వంటి కీలక విధుల్లో నిరంతరం వినియో గంలో ఉంటాయని తెలిపా రు. అందువల్ల వాహనాల ను నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ పరిశీలించి, అవసరమైన సర్వీసింగ్, మరమ్మతులు వెంటనే చేయించుకోవాలని సూచించారు. ప్రతి రోజు విధులకు వెళ్లే ముందు వాహనాలను పూర్తిగా శుభ్రం చేసుకోవడంతో పాటు

టైర్లు, బ్రేకులు, ఇంజిన్ ఆయిల్, కూలెంట్, బ్యాటరీ, లైట్లు, ఇండికే టర్లు, హారన్ తదితరాలను పరిశీలించుకోవాలని డ్రైవర్లకు సూచించారు. వాహనాల మెకానిజం, ప్రాథమిక సాంకేతిక అంశాలపై ప్రతి డ్రైవర్‌కు పూర్తి అవగాహన ఉండాల ని అన్నారు. వాహనంలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు దానిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత అధి కారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించు కోవాలని తెలిపారు. వాహనం కండిషన్‌లో లేకపోతే అత్యవసర సమ యంలో ఇబ్బందులు తలె త్తే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తప్ప నిసరిగా పాటించాలన్నారు.

అదేవిధంగా డ్రైవింగ్ చేసే సమయంలో ట్రాఫిక్ నిబం ధనలు తప్పనిసరిగా పాటించాలని, వేగ నియంత్రణ పాటిస్తూ అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా డ్రైవింగ్‌లో జాగ్ర త్తలు పాటిస్తూ పోలీసు సిబ్బంది, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోలీసు వాహనా ల నిర్వహణ, భద్రత, డ్రైవ ర్ల పనితీరుపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు. వాహనాలను శుభ్రంగా, సక్రమంగా, ఎల్ల ప్పుడూ వినియోగానికి సిద్ధంగా ఉంచడం ప్రతి డ్రైవర్ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఏం టి ఓ,ఆర్ ఐ విజయ్ భాస్కర్, పోలీసు వాహన డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

నెలలుగా వేతనాలు లేక జూరాల భగీరథ వర్కర్ల ధర్నా

ధరూరు, ఆగస్టు 18 (జనం సాక్షి) : జూరాల మిషన్ భగీరథ 70 ఎం ఎల్ డి ప్లాంటులో పనిచేస్తున్న కార్మికులకు గత 8 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారు ఆందోళనకు దిగారు. ఐహెచ్‌పీ కంపెనీ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సుమారు 200 మంది కార్మికులు మంగళవారం ప్లాంటు ఎదుట శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. వెంటనే తమ బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు లేకపోవడంతో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నామని, ఇంటి అద్దెలు, నిత్యావసరాల ఖర్చులకు కూడా అప్పులు చేయాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కూలీ పనులకు వెళ్లి అయినా కుటుంబాలను నెట్టుకొస్తున్నామని, అయినా అసలు బకాయిలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి పని చేశామని, ఇప్పుడు కనీస వేతనం కూడా ఇవ్వకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని వారు కోరారు. కార్మికుల జీవితాలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి

ఉప్పునుంతల, ఆగస్టు 18 (జనంసాక్షి) : ఉప్పునుంతల మండల కేంద్రంలో సిపిఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ పోస్టర్ విడుదల చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్‌ను వెంటనే విడుదల

చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 20న కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పానుగంటి చిన్న రవి, డివైఎఫ్ఐ నాయకులు నవీన్ యాదవ్, రమేష్, సాలయ్య, వికాస్, జంగయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ

అచ్చంపేట, ఆగస్టు 18 (జనం సాక్షి) : మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలుర)ను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం, విద్యాబోధన, పారిశుద్ధ్యం, స్టోర్‌రూమ్‌లోని సరుకుల నిల్వ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థుల సంఖ్య, వారి హాజరు వివరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, భోజనంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వారిని నేరుగా అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల స్టోర్‌రూమ్‌ను పరిశీలించి అక్కడ నిల్వ ఉన్న సరుకులు, ఆహార ధాన్యాల వివరాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు

సరఫరా చేసే ఆహార పదార్థాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని సిబ్బందికి సూచించారు. పాఠశాల భవనాలు, విద్యార్థుల వసతి గదులు, ఇతర సౌకర్యాలను కూడా అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. తనిఖీ సందర్భంగా పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివపేట ఈఎస్ఐ డిస్పెన్సరీలో సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

సదాశివపేట, ఆగస్టు 18 (జనంసాక్షి) : సదాశివపేట ఈఎస్ఐ డిస్పెన్సరీలో కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. విధులకు సక్రమంగా హాజరుకాని డాక్టర్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్, ఫార్మసిస్ట్ అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ పరీక్షలకు అవసరమైన పరికరాలు, మందులు, ల్యాబ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈఎస్ఐ బోర్డు అధికారులు వెంటనే విచారణ చేపట్టి రెగ్యులర్ డాక్టర్, ఫార్మసిస్ట్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నాణ్యమైన వైద్యం అందే వరకు పోరాటం కొనసాగిస్తామని అనిల్ తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, నవీన్, కృష్ణ, అఫ్రోజ్‌తో పాటు కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

● అర్హులైన వారందరికీ పెన్షన్లు మంజూరు
● జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

మల్దకల్, ఆగస్టు 18 (జనంసాక్షి) : ప్రతి ఒక్కరి జీవితంలో పదవ తరగతి ఎంతో కీలకమని, విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం కలెక్టర్ మల్దకల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ను ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ గతేడాది కంటే ప్రస్తుత ఏడాదిలో టాపర్లు పెరగాలని, వంద శాతం ఉత్తీర్ణత వచ్చేలా చదవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరుకావాలని, గైర్హాజరైతే వివిధ సబ్జెక్టుల తరగతులను కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, పాఠ్యాంశాలను పునఃశ్చరణ చేసుకుంటే ఎక్కువ రోజులు గుర్తుంటాయన్నారు. అనంతరం కలెక్టర్ ఎఫ్ఏ1 ప్రోగ్రెస్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. వంటగదిని సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఆదేశించారు. వండిన పదార్థాలను పరిశీలించి, గుడ్లను కూడా తప్పనిసరిగా విద్యార్థులకు వడ్డించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి ఉపాధ్యాయులు కలెక్టర్ కు తెలియజేశారు.

అనంతరం మల్దకల్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ప్రభుత్వం అర్హులైన వారందరికీ కొత్తగా పెన్షన్లు ఇస్తుండడంతో వచ్చిన దరఖాస్తులపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ చేయూత పెన్షన్లు పొందేలా సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేసి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. గ్రామంలో ఉపాధిహామీ పథకం కూలీల వివరాలను అడిగి చేపట్టిన పనుల గురించి తెలుసుకున్నారు. జలసిరిలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటల నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, అభివృద్ధి పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ స్థలాల్లో ఎవరైనా

అనధికారికంగా డబ్బాలు ఏర్పాటు చేస్తే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు తీసుకున్న వారు సక్రమంగా నిర్దేశిత అద్దెలు చెల్లించడం వలన పంచాయితీకి ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు. గ్రామంలో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల వివరాలను తెలుసుకొని వారికి సకాలంలో జీతాలను చెల్లించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్, పంచాయతీ కార్యదర్శి అర్జున్, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

కాటారం ఆగస్టు 18 (జనం సాక్షి): భూపాలపల్లి జిల్లా కాటారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడు ఎలగొండ నవీన్ పై నేరం రుజువు కావడంతో, భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవన్ కుమార్ మంగళవారం నాడు నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు పూర్వాపరాలు. 2021 సంవత్సరంలో భూపాలపల్లి జిల్లా మల్హార్‌రావు మండలానికి చెందిన మైనర్ బాలిక హనుమకొండలో ఇంటర్ చదువుతున్న సమయంలో, ములుగు జిల్లా మల్లూరు శివారు మొట్లగూడెం గ్రామానికి చెందిన ఎలగొండ నవీన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పరుచుకున్నాడు. ప్రేమిస్తున్నానని నమ్మించి, 03 ఏప్రిల్-2021న "పెళ్లి చేసుకుందాం" అంటూ ఇంటి నుంచి పిలిపించాడు. బాధితురాలు కాటారం మండలం బస్వాపూర్ చేరుకోగా, నిందితుడు ఆమెను ములుగు జిల్లా పస్రా మీదుగా బర్లగూడెంలోని తన స్నేహితుడి ఇంటికి తీసుకెళ్లి మూడు రోజుల పాటు నిర్బంధించి పలుమార్లు బలవంతంగా లైంగిక దాడి చేశాడు. అనంతరం తన స్వగ్రామమైన మొట్లగూడెంకు తీసుకెళ్లి మరో రెండు రోజుల పాటు అదే విధంగా దాడికి పాల్పడ్డాడు. తన కుమార్తె కనిపించకపోవడంతో బాధితురాలి తండ్రి కాటారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, బాధితురాలు ఇంటికి చేరి జరిగిన విషయాన్ని వెల్లడించింది.

బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అప్పటి కాటారం ఎస్ హెచ్ ఓ సాంబమూర్తి కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి కాటారం డి.ఎస్.పి బోనాల కిషన్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలో లైజన్ ఆఫీసర్. వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ కె. రమేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు. విష్ణువర్ధన్ రావు మరియు వెంకట్రామ్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సమర్పించిన సాక్ష్యాధారాల ఆధారంగా కోర్టు నిందితుడిపై నేరం రుజువైందని నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష మరియు 1000 జరిమానా విధించింది. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా పని చేసిన ప్రస్తుత కాటారం డి.ఎస్.పి సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్సై శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఆఫీసర్ పి సి ఆర్ ఇన్‌స్పెక్టర్ రాజు, లైజన్ ఆఫీసర్ జి. వెంకన్న, కోర్టు డ్యూటీ ఆఫీసర్ కె రమేష్ తో పాటు అప్పటి దర్యాప్తు అధికారులను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్,ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

'రేవంత్‌రెడ్డి.. చిల్లర రాజకీయాలు మానుకో'

- ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం కూల్చివేతపై మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆగ్రహం..

మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 18 (జనం సాక్షి): ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని కూల్చివేయడంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం మహబూబాబాద్ బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. 'ఖబర్దార్ రేవంత్ రెడ్డి.. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకో. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇలాంటి రాజకీయాలకు పాల్పడటం సరికాదు" అని శంకర్ నాయక్ అన్నారు. ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం కూల్చివేత ఘటనపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. "మరోసారి ఇలాంటి చిల్లర వేషాలు వేస్తే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజల తీర్పుతో ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయి" అని శంకర్ నాయక్ వ్యాఖ్యానించారు. ఈ మీడియా సమావేశంలో బీఆర్ఎస్ యూవ అధ్యక్షులు యాళ్ల మురళీదార్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ రైస్ మిల్లుపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల దాడులు

- ప్రభుత్వ ధాన్యం మాయం చేసిన మిల్లర్ల గుట్టురట్టు
- యజమానులపై కేసులు నమోదు

సారంగాపూర్,ఆగస్టు15 (జనం సాక్షి) : నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామంలోని లక్ష్మీ నరసింహ రైస్ రెండు మిల్లులో సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారులు దాడులు నిర్వహించారు. ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీఎంఆర్ పెట్టాల్సి ఉంటుంది. ఈ మిల్లులో సకాలంలో సీఎంఆర్ పెట్టకుండా జాప్యం చేయడం, మొండికేయడం, బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 2020-23 వరకు మూడు సంవత్సరాల 2024-25 రబీ యాక్షన్ ప్యాడి 15545 ఎంటిసీ షార్ట్ జ్ ఉన్నట్లు లెక్కల్లో తేలింది. 2026 ఖరీఫ్ కి సంబంధించి యాక్షన్ ప్యాడితో కలిపి 6019 ఎంటిసీ ఉంది. ఈ నేపథ్యంలో అక్రమార్కులపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లర్ల జాబితాను సిద్ధం చేసి సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి దాడులు నిర్వహించి రూ. 16 కోట్లు విలువ చేసే ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు గుర్తించారు. మిల్లర్ల గుట్టును రట్టు చేసి ధాన్యం నిల్వలు, సివిల్ సప్లయ్ నిబంధనల అమలు, ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం నిల్వలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. ఈ రైస్ మిల్ యజమానులపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా డీఎస్ఓ రాజేందర్ తెలిపారు.

మూడు కూడళ్ల రహదారిపై మురుగు నీరు

- పరిష్కారం చూపని పంచాయతీ సిబ్బంది

భీమిని ఆగస్టు 18 (జనంసాక్షి) : అసలే వర్షాకాలం అందులో మురుగు దీంతో ప్రజలకు తప్పని రోగాలు అన్న పరిస్థితి మండల కేంద్రమైన భీమిని గ్రామపంచాయతీలో కళ్ళకు కట్టినట్టు కనబడుతోంది అయినా పంచాయతీ సిబ్బంది లో చలనం కనిపించడం లేదు. మురికి పోచ మల్లు ఇంటి ముందు ఉన్న మూడు రోడ్ల కూడలి వద్ద వర్షపు నీటితో పాటు ఇళ్లలో నుండి వచ్చిన నీరంతా రోడ్డుపై చేరి నిలిచిపోవడంతో ఈ పరిస్థితి ఇక్కడ ఏర్పడింది. ఈ నీటిలో పందులు బర్లు దొర్లడంతో పాటు ఈగలు దోమలు అభివృద్ధి చెందడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. కనీస వసతులైన మురుగునీటి కాలువలను పంచాయతీ సిబ్బంది నిర్మాణం చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు అర్థం కాని పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. ప్రజల ప్రాణాలకు ఏమైతే మాకేంటి అన్న వ్యవహార తీరు పంచాయతీ సిబ్బంది లో కనిపిస్తున్నట్లుగా ఉంది పరిస్థితి. ఇంటి పన్ను వసూలు చేయడంలో చూపిన శ్రద్ధ పారిశుద్ధంపై చూపకపోవడంతో నే ఈ పరిస్థితి నెలకొందని కాలనీవాసులు పంచాయతీ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే మురికినీటి కాలువల నిర్మాణమే సమస్యకు పరిష్కారంగా కనిపిస్తోంది. పంచాయతీ సిబ్బంది ఈ సమస్య పరిష్కారం కోసం కృషిచేసి నీటిని బయటకు పంపేలా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

మల్హార్, ఆగష్టు 18 (జనంసాక్షి) : మంగళవారం భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలంలోని కెజిబివి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, వంటగది, స్టోర్ రూమ్, విద్యార్థినుల వసతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, ఆరోగ్యం, భద్రత, క్రీడలు తదితర సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థినులతో ఆత్మీయంగా ముచ్చటించారు. 'హలో స్టూడెంట్స్... ఎలా ఉన్నారు. ఎలా చదువుతున్నారు. భోజనం ఎలా ఉంటోంది.రోజూ ఏమేమి ఆటలు ఆడుతున్నారు' అంటూ విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ చదువు, పాఠశాలలో అందుతున్న భోజనం, క్రీడలు, ఇతర కార్యక్రమాల గురించి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం భవిష్యత్తులో మీరు ఏమి కావాలనుకుంటున్నారు అని కలెక్టర్ అడగగా, కొందరు విద్యార్థినులు ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కావాలని తమ ఆకాంక్షించలను వెల్లడించారు. పదో తరగతి విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేసి, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యం, సబ్జెక్టుల వారీగా ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, వారి సందేహాలను నివృత్తి చేసి, చదువుపై ఆసక్తిని పెంపొందించే విధంగా బోధన సాగించాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి విద్యార్థి ప్రతిభను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థినులకు భోజనానికి ఉపయోగించే బియ్యం, కూరగాయలు, పప్పులు, ఇతర నిత్యావసర సరుకుల నిల్వలను తనిఖీ చేశారు. సరుకుల నాణ్యత, నిల్వ విధానం, వంటగది పరిశుభ్రత, భోజనం తయారీ విధానంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహార పదార్థాలను సక్రమంగా నిల్వ చేయడంతో పాటు, వంటగది మరియు భోజన ప్రదేశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చదువుతో పాటు విద్యార్థినులలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించేందుకు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థినులు ప్రతిరోజూ క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. యూనిఫారాలు పంపిణీని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మరుగుదొడ్లు నిర్మాణాలను పరిశీలించి న ఆయన నెల రోజుల్లో పూర్తి చేసేలా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ బావుందని వంట సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాటారం ఆర్డిఓ రవీందర్, డీఈఓ రాజేందర్, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, తహసీల్దార్ రవి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని హౌస్ అరెస్ట్

- బీఆర్ఎస్ కార్యకర్తల నిరసన.. ఉద్రిక్తత
- అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

వరంగల్ ఈస్ట్, ఆగస్టు 18 (జనం సాక్షి) : నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమకారుడు పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించిన క్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ను మంగళవారం పోలీసుల హౌస్ అరెస్ట్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అండర్ బ్రిడ్జి వద్ద గల మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఇంటి వద్దకు వచ్చి ఆందోళన కార్యక్రమాన్ని నిరసనను చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి నిరసన తెలుపుతున్న టువంటి కార్యకర్తలు నాయకులను బలవంతంగా వ్యాన్లు ఎక్కించుకొని పోలీస్ స్టేషన్కు తరలించారు. సాయంత్రం వరకు పోలీసులు నరేందర్ ను హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం సాయంత్రం నన్నపనేని నరేందర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయాలు నిజం చేస్తాం

తెలంగాణ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆశయాలను నిజం చేస్తామని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. నర్సంపేట నియోజక వర్గానికి ఎన్నో రకాల సేవలు అందించిన టువంటి పెద్ద విగ్రహాన్ని ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. ఇది ప్రభుత్వ ధమన కాండకు నిదర్శనమన్నారు. ప్రతి మండలా నికి పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన కొనసాగిస్తామ న్నారు. నేటినుంచి ప్రజలే స్వచ్ఛందంగా పెద్ది విగ్ర హాన్ని కూల్చేసినందుకు నిరసనలు చేపడతా రని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ దుర్మా ర్గాన్ని ప్రజలు గమనిస్తున్నారని నరేందర్ తెలిపారు.

ప్రమాదం నుంచి కోలుకోకుండానే

ఎంఈఓ ఆశన్న మృతి

- హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో కన్నుమూత
- పార్థివదేహానికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నివాళి

ఉట్నూర్ ఆగస్టు 18 (జనం సాక్షి) : ఉట్నూర్ మండల విద్యాశాఖ అధికారి (ఎం ఈ ఓ) రాపెల్లి ఆశన్న మృతి చెందారు. ఇటీవల ఉట్నూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు, సహచరులు వెంటనే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆశన్న.. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు.

ఆశన్న మృతి విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి ఆశన్న అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన మృతి విద్యాశాఖకు, ఏజెన్సీ ప్రాంతానికి తీరని లోటని అన్నారు.

ఆశన్న మృతిపట్ల వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ప్రాజెక్టులోని నీటి సామర్థ్యాన్ని పర్యవేక్షించాలి

- జిల్లా కలెక్టర్ కుమార దీపక్
- గొల్లవాగు ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ స్థితి పరిశీలన

మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 18 (జనంసాక్షి) : జిల్లాలోని భీమారం మండలంలో గల గొల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టును సందర్శించి నీటి నిల్వ స్థితిని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. మంగళవారం నాడు ప్రాజెక్టును సందర్శించి మాట్లాడుతూ ...ఎల్ నినో నేపథ్యంలో రైతులు సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి అవసరం గల ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న లోటు వర్షపాతం నేపథ్యంలో రైతులు వరి మినహా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని తెలిపారు. ప్రాజెక్టులోని నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. భీమారం మండల తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం ప్రతిపాదిత భూమి, మండలంలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న వి.ఓ. భవనం పనులను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం దృష్ట్యా అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ విలువైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, భోజనశాల పనులను పరిశీలించి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంటశాలను పరిశీలించి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థుల చదువు, పరీక్షల సన్నద్ధతపై సమీక్షించి, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాలలు, మరుగుదొడ్లు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే రీతిగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

నీటి లభ్యతకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలి

- రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించాలి
- రైతుల సమస్యలు, సూచనలను స్వయంగా అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్
- సమస్యల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి ఉండాలి
- జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావు

ములుగు ప్రతినిధి, ఆగష్టు 18(జనంసాక్షి) : నీటి లభ్యతకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణపై రైతులు దృష్టి సారించాలని, రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని, సమస్యల పరిష్కారంలో స్పష్టమైన పురోగతి ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నూతన కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో సంయుక్త సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, సాగునీటి లభ్యత, పంటల సాగు పరిస్థితి, ప్రత్యామ్నాయ పంటలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా రైతులతో మాట్లాడి ఆయా మండలాలు, గ్రామాల్లో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులు, సాగునీటి సమస్యలు, పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రత్యామ్నాయ పంటలపై వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. రైతులు తెలిపిన ప్రతి అంశాన్ని అధికారులు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ములుగు జిల్లాలో అత్యధిక శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నందున రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారులు ఒకే వేదికపై చర్చించడం ద్వారా క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలకు సరైన పరిష్కార మార్గాలను గుర్తించవచ్చన్నారు. మే నెల నుంచే ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు పరిస్థితులపై రైతులకు రైతు వేదికలు, ప్రచార మాధ్యమాల ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నీటి లభ్యతను అంచనా వేసుకోకుండా పంటలు సాగు చేసి రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆగస్టు నెలలో జిల్లాలో వర్షపాతం తీవ్రంగా తగ్గిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా మొత్తంగా సాధారణ వర్షపాతం 218 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా 83 మిల్లీమీటర్లు మాత్రమే నమోదై, సుమారు 62 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రస్తుత పరిస్థితులను రైతులు గమనించి నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు పూర్తిగా వరి పంటపైనే ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొంత విస్తీర్ణంలో వరి సాగు చేస్తూనే మిగతా భూముల్లో తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను చేపట్టడం ద్వారా వర్షాభావ పరిస్థితుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఆయా ప్రాంతాల నేల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను బట్టి ఏయే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చనే అంశంపై రైతులకు పూర్తి సమాచారం అందించాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అన్ని రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులతో సమావేశాలు నిర్వహించి, రైతులకు అనుకూలమైన పంటలు, సాగు విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యానవన పంటల సాగుకు అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి రైతులకు తగిన సాంకేతిక సలహాలు అందించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న సాగునీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. చెరువులు, కుంటల్లో పూడికతీత, వి బి జి రామ్ జి పథకం ద్వారా చేపట్టగల నీటి సంరక్షణ పనులను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు సమావేశంలో ప్రస్తావించిన సమస్యల్లో జిల్లా స్థాయిలో పరిష్కరించగల అంశాలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారం కావాల్సిన అంశాలను సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతి సమస్యకు సంబంధించి ఏ స్థాయిలో చర్యలు తీసుకోవాల్సి ఉందో స్పష్టంగా గుర్తించాలని అధికారులకు సూచించారు. రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య నిరంతర సమన్వయం ఉండేందుకు తరచూ సమావేశాలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశాల్లో కేవలం సమస్యలను ప్రస్తావించడం కాకుండా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సాధించిన పురోగతిని కూడా సమీక్షించాలని పేర్కొన్నారు.

మణుగూరు ఐటీఐ - ఏటీసీ విద్యార్థుల ఆవిష్కరణలు అభినందనీయం

● ఎలక్ట్రిక్ వాహనాల ఆవిష్కరణకు మంత్రి వివేక్ ప్రశంస

మణుగూరు, ఆగస్టు 18 (జనం సాక్షి) : మణుగూరు ప్రభుత్వ ఐటీఐ - ఏటీసీ విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు, భూగర్భ శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం నిర్వహించిన అభినందన సభలో విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనాలను మంత్రి పరిశీలించి అభినందించారు. పాత వాహనాల విడిభాగాలను పునర్వినియోగం చేసి ఎలక్ట్రిక్ వాహనాలను రూపొందించడం అభినందనీయమన్నారు. వాటిని కమర్షియల్ వాహనాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సాంకేతిక, ఆర్థిక సహకారం అందిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 119 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను టాటా సంస్థ సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఆధునిక సాంకేతిక కోర్సులను అందుబాటులోకి తెస్తున్నట్లు

తెలిపారు. 119 ఏటీసీల విద్యార్థుల మధ్య ఇన్నోవేషన్ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు అవార్డులు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల యువత, యువ రైతుల కోసం వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక కోర్సులు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టామ్‌కామ్ ద్వారా జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో ఉద్యోగ అవకాశాల కోసం విదేశీ భాషల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. మణుగూరులో ఐటీసీ సీఎస్ఆర్ నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు శిక్షణ, ఉపాధి కల్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణుగూరు ఏటీసీలో 244 మంది, ఐటీఐలో 168 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ హాస్టల్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సీఎన్‌సీ వంటి ఆధునిక కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పరిశ్రమలతో సమన్వయం చేసి ప్లేస్‌మెంట్ అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఏటీసీలో శిక్షణ పూర్తి చేసిన 50 మంది విద్యార్థులకు అభినందన పత్రాలు అందజేశారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కేంద్రీయ విద్యాలయాలు వేదికలు కావాలి

ఖమ్మం, ఆగస్టు 18 (జనం సాక్షి) : విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలు వేదికలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఖమ్మం పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యా ప్రమాణాలు, పరీక్ష ఫలితాలు, ప్రవేశాలు, పీఎం శ్రీ కార్యక్రమాలు, డిజిటల్ విద్య, మౌలిక వసతులు, విద్యార్థుల భద్రతపై సమీక్షించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. 2026--27 విద్యా సంవత్సరంలో 256 మంది విద్యార్థులకు కొత్తగా ప్రవేశాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. పాఠశాలలో 55 కంప్యూటర్లు, హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్, వైఫై, 25 ఈ-క్లాస్‌రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. డిజిటల్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల భద్రతలో ఎలాంటి రాజీ ఉండకూడదని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉంచాలని ఆదేశించారు. కోతుల బెడద, పాముల సంచారం, అప్రోచ్ రోడ్డు సమస్యలపై ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 18 (జనం సాక్షి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. మంగళవారం సింగరేణి మండలం కారేపల్లి--రేలకాయపల్లి గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, లైబ్రరీ, మ్యూజిక్ రూమ్, ఆర్ట్ గ్యాలరీ, సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆసక్తులు, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచన పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. కమ్యూనికేషన్, సాంకేతిక పరిజ్ఞానం, సమస్య పరిష్కారం, నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అధికారులతో సమావేశమై పాఠశాల నిర్వహణ, విద్యా ప్రగతి, మౌలిక వసతులపై సమీక్షించారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం, రోడ్డు నిర్మాణం, సోలార్ విద్యుత్ కంచె, అదనపు లైట్ల ఏర్పాటుపై సిబ్బంది సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భద్రత, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, విద్యుత్, ప్రయోగశాలలు, లైబ్రరీ, క్రీడా సదుపాయాలను మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, భోజనం నాణ్యత విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారి ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా భవిష్యత్ లక్ష్యాలపై ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని కలెక్టర్ అన్నారు.

నల్గొండను రాష్ట్రంలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం

● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 18 (జనం సాక్షి) : నల్గొండ పట్టణాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.మంగళవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో రూ.23.85 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, భూమిపూజలు చేశారు. 3వ డివిజన్‌లో ఎస్టీ కాలనీ నుంచి శేషమ్మగూడెం మీదుగా అద్దంకి రహదారి వరకు రూ.9.40 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పానగల్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి డీఈవో కార్యాలయం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర రూ.14.45 కోట్లతో చేపట్టనున్న వన్‌టైం ఇంప్రూవ్‌మెంట్ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. పట్టణం చుట్టూ రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు చేపట్టామని, పట్టణంలో రూ.500 కోట్లతో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. శివారు ప్రాంతాలను సైతం కలుపుకొని మున్సిపల్ కార్పొరేషన్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. రహదారులతో పాటు సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. నల్గొండ పట్టణానికి 24 గంటల తాగునీరు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల రూ.83 కోట్లతో వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని, పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. తాగునీటి అవసరాల కోసం ముఖ్యమంత్రిని ఒప్పించి మరో రూ.300 కోట్లు తీసుకొచ్చామని వెల్లడించారు.పట్టణంలో రూ.125 కోట్లతో 12 తాగునీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే ఒకటి పూర్తయిందని, మిగిలిన 11 ట్యాంకుల నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనతో నల్గొండ మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అన్ని డివిజన్లను సమానంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు.

రహదారులు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైటింగ్, సుందరీకరణ పనులతో నల్గొండ నగరానికి మరింత శోభ చేకూరుతుందని తెలిపారు.కార్పొరేటర్లు మల్లీశ్వరి, బొడ్డుపల్లి లక్ష్మి, కవిత, వేణు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ, మున్సిపల్ కమిషనర్ వంశీ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ పున్నమోహన్, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ గణేష్, ఆర్డీవో అశోక్‌రెడ్డి, తహసీల్దార్ పరశురాం, డీటీడీఓ, ఏసీఎస్ డైరెక్టర్ నాగరత్నం, కార్పొరేటర్లు స్వాతి, కవిత, జాతీయ రహదారి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతుల్లో కేసుల దర్యాప్తు

● సంఘటన స్థలం నుండే వేగంగా ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ
● నిందితులు తప్పించుకోకుండా త్వరగా గుర్తింపు
● మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట, ఆగస్టు 18 (జనంసాక్షి) : సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు మరో అత్యాధునిక సాంకేతిక వాహనం మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర పోలీసు శాఖ కేటాయించిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ పోలీసు అధికారులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర పరిశోధనలో ఫోరెన్సిక్ ఆధారం అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ఈ మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్ ద్వారా సంఘటనా స్థలం నుండే నేరుగా ఫోరెన్సిక్

ఆధారాలను వేగంగా సేకరించవచ్చని తెలిపారు. సాంకేతిక పద్ధతులను ఉపయోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం ద్వారా నిందితులను త్వరగా గుర్తించవచ్చని, వారు చట్టం నుండి తప్పించుకోకుండా కఠిన శిక్షలు పడేలా చేయవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డిసిఆర్బీ డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, అశోక్, రాజశేఖర్, సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల ప్రగతే ధ్యేయం

యాచారం, ఆగస్టు 18 (జనం సాక్షి) : ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా సమగ్రాభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే కాకుండా, పేదల సంక్షేమమే తమ ముఖ్యాజెండా అని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి పునరుద్ఘాటించారు. మంగళవారం యాచారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించి రూ. 3.60 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు. మండల పరిధిలోని మంథన్ గౌరెల్లి, కేసి తండా, నల్లవెల్లి, నల్లవెల్లి తండా, తమ్మలోని గూడ చౌదర్ పల్లి, గ్రామాల్లో రూ. 3.60 కోట్లతో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంథన్ గౌరెల్లి గ్రామంలో నూతనంగా రూ. 22 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి వార్డులోనూ నాణ్యమైన సీసీ రోడ్లు, మురుగునీటి పారుదల కోసం అండర్ డ్రైనేజీ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నట్లు చెప్పారు. గతంలో కంటే భిన్నంగా యాచారం మండల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అరవింద్ నాయక్, మస్కు అనిత శరణం, రమేష్ నాయక్, కిషన్ నాయక్, దెంది రామ్ రెడ్డి, కేశమోని రాజులతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీలకంటి శేఖర్ రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, మోటే శ్రీశైలం, మస్కు నర్సింహా, లక్ష్మి పతి గౌడ్, వరికుప్పల సుధాకర్, పోలమోని రామకృష్ణ మరియు వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నల్గొండను రాష్ట్రంలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతాం

● మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 18 (జనం సాక్షి) : నల్గొండ పట్టణాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.మంగళవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో రూ.23.85 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, భూమిపూజలు చేశారు. 3వ డివిజన్‌లో ఎస్టీ కాలనీ నుంచి శేషమ్మగూడెం మీదుగా అద్దంకి రహదారి వరకు రూ.9.40 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి, రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పానగల్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి డీఈవో కార్యాలయం వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర రూ.14.45 కోట్లతో చేపట్టనున్న వన్‌టైం ఇంప్రూవ్‌మెంట్ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. పట్టణం చుట్టూ రూ.900 కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు పనులు చేపట్టామని, పట్టణంలో రూ.500 కోట్లతో సీసీ రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. శివారు ప్రాంతాలను సైతం కలుపుకొని మున్సిపల్ కార్పొరేషన్‌ను సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. రహదారులతో పాటు సైడ్ డ్రైన్లు, సెంట్రల్ లైటింగ్, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. నల్గొండ పట్టణానికి 24 గంటల తాగునీరు అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల రూ.83 కోట్లతో వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని, పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. తాగునీటి అవసరాల కోసం ముఖ్యమంత్రిని ఒప్పించి మరో రూ.300 కోట్లు తీసుకొచ్చామని వెల్లడించారు. మహిళా సంఘాల ద్వారా గోదాముల నిర్వహణ, రైస్ మిల్లుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని, సంఘాల్లో లేని మహిళలు కొత్త సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనతో నల్గొండ మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

కామారెడ్డికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 (జనం సాక్షి) : కామారెడ్డి నియోజకవర్గానికి రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా జి.ఓ.ఆర్.టి. నం.145, తేదీ 04-08-2026 ద్వారా కామారెడ్డి జిల్లా, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.200 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమా శ్రీనివాస్, డీసీసీ మాజీ అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు కృషి

● జిల్లా ఎస్పి నరసింహ

తుంగతుర్తి ఆగస్టు 18 (జనం సాక్షి) : జిల్లాలో పోలీస్ శాఖ నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు జిల్లా ఎస్పీ నరసింహం అన్నారు, మంగళవారం మండల కేంద్రంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని వార్షిక తనిఖీల్లో భాగంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల దర్యాప్తు, నేరాల చేదనలో సాంకేతికత వినియోగం ఉపయోగిస్తున్నామని నేరాలకు పాల్పడితే ఎంతటివారైనా చట్టానికి చిక్కక తప్పదు అని అన్నారు, ముఖ్యంగా తాము జిల్లాలోని సమస్య ఆత్మక గ్రామాల్లో రౌడీషీటర్ల, హిస్టరీషీటర్లపై నిరంతరం నిఘా ఉంచినట్లు తెలిపారు, ఎవరికైనా ఇతరుల వల్ల ఇబ్బందులు కలిగితే డయల్ 112 నెంబర్కు చేయాలని అన్నారు, ఇంటివద్ద నుండి బాధితులు ఫిర్యాదు చేయవచ్చని అన్నారు, సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సిఐ తరచుగా తనిఖీ చేస్తూ సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షించాలని అన్నారు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిగా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు

గమనించాలని అన్నారు, ప్రతినెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని అన్నారు, కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ప్రజలకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాల తో పాటు వివిధ సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రాధాన్యతను ప్రజలకు వివరించి నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర వివరించాలన్నారు, ముఖ్యంగా మాదక ద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ ప్రాముఖ్యత ఇస్తుందని అన్నారు, అనంతరం స్టేషన్లో రికార్డ్స్ ను, పరిసరాలను తనిఖీ చేశారు. సర్కిల్ కార్యాలయానికి సంబంధించిన సర్కిల్ ఇన్ఫర్మేషన్ క్రైం రికార్డు ప్రాపర్టీ రిజిస్టర్, పిటిషన్ రిజిస్టర్ లను పరిశీలించారు. సర్కిల్ పరిధిలో ఉన్న తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ పోలీస్ స్టేషన్ ల పరిధిలో నమోదవుతున్న కేసులు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్ ట్రయల్ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను పరిశీలించారు. తీవ్రమైన కేసులు కేసులు, మహిళా సంబంధ కేసులు, దాడి కేసులు, పోక్సో కేసుల్లో నిందితులకు చట్టపరంగా శిక్షలు పడే విధంగా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. కేసుల దర్యాప్తులో ఎలాంటి లోపాలకు తావులేకుండా ఆధారాల సేకరణ, సాక్షుల విచారణ, కేసు డాక్యుమెంటేషన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి నెలా వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ ఉపేందర్ రావు, ఎస్ఐ లు వీరన్న, క్రాంతి, నాగరాజు, స్టోర్ ఆర్ఎస్ఐ అఖిల్, డిసిఆర్బీ సిబ్బంది అంజన్ రెడ్డి, శేఖర్ రెడ్డి, సీసీ సందీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దు

● మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంతరెడ్డి

సూర్యాపేట, ఆగస్టు 18 (జనంసాక్షి) : సూర్యాపేట పట్టణంలో నిబంధనలకు ,భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడంతో పాటు, రహదారులను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులు, మెట్లను మున్సిపల్ అధికారులు మంగళవారం తొలగించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంత రెడ్డి స్పష్టం చేశారు.పట్టణంలోని 19వ వార్డు మూసీ కాలువ ప్రక్కన న్యూ మార్కెట్ రోడ్డు ప్రాంతంలో ఎస్ ప్లస్ 3 నిర్మాణానికి అనుమతి తీసుకుని అదనంగా మరో ఫ్లోర్ నిర్మాణం చేపట్టడంతో ఆ అదనపు అంతస్తును మున్సిపల్ అధికారులు డిస్మెంటల్ చేశారు.31వ,33వ వార్డుల్లో తొలగింపులు చేపట్టారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సిహెచ్.హన్మంత రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో భవన నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా లేదా ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా అనుమతికి మించి అదనపు అంతస్తులు నిర్మించడం, రోడ్లను ఆక్రమించి ర్యాంపులు, మెట్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలను సహించబోమన్నారు.రోడ్లపై ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా ఆక్రమణలు చేపడితే వాటిని తొలగించడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వి.సోమయ్య, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు బేతం అఖిల్ రెడ్డి, బంగారు శివాజీ, పోలీస్ సిబ్బంది, చైన్‌మెన్లు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నష్టాల్లోనే ముగింపు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో నెలకొన్న అనిశ్చితి మార్కెట్‌లపై ప్రభావం చూపుతోంది. ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్ షేర్లు 2 శాతం వరకు కుంగాయి. దీంతో సెన్సెక్స్ వరుసగా మూడో సెషన్‌లో నష్టాలు చవిచూడగా.. నిఫ్టీ ఆరో రోజూ నష్టాల బాటపట్టింది. సెన్సెక్స్ ఉదయం 77,418.97 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,728.16) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా సూచీ నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,234.36 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయిన సూచీ.. చివరికి 492.70 పాయింట్లు క్షీణించి 77,235.46 వద్ద ముగిసింది. నిఫ్టీ 132.75 పాయింట్లు కోల్పోయి 24,154.90 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.68గా ఉంది. సెన్సెక్స్ 30లో యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఐటీ, రిలయన్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. మిగతా కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 90.94 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు ధర 4,394.72 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

మన స్టాక్‌మార్కెట్‌ను కొల్లగొట్టిన జేన్‌స్ట్రీట్‌కు ఊహించని షాక్

'పొట్టోడిని పొడుగోడు కొడితే.. పొడుగోడిని పోచమ్మ కొట్టిందంట'.. సరిగ్గా ఈ సామెత అమెరికాకు చెందిన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ జేన్‌స్ట్రీట్‌కు సరిపోతుందేమో. భారత స్టాక్ మార్కెట్‌ను కొల్లగొట్టి దేశంలో నిషేధం ఎదుర్కొన్న ఈ సంస్థకు.. వాల్‌స్ట్రీట్‌లో తాజాగా గట్టి షాక్ తగిలింది. నేరుగా ఈ కంపెనీ నష్టపోనప్పటికీ.. నమ్మి పెట్టుబడి పెట్టిన ఓ హెడ్జ్‌ఫండ్ భారీగా నష్టపోవడంతో జేన్‌స్ట్రీట్‌కూ భారీగానే నష్టం వాటిల్లింది. వక్రమార్గంలో భారత స్టాక్ మార్కెట్‌ను మోసం చేసిన ఈ సంస్థకు.. ఏడాది తిరగకముందే అంతకు రెండు, మూడింతలు నష్టపోవడం గమనార్హం.

ఇంతకీ ఏం జరిగిందంటే?

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకుడైన 24 ఏళ్ల లియోపోల్డ్ ఆస్చెన్‌బ్రెన్నర్ ఆస్చెన్‌బ్రెన్నర్ సిట్యువేషనల్ అవేర్‌నెస్ పేరిట హెడ్జ్ ఫండ్‌ను స్థాపించాడు. 19 ఏళ్లకే కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడైన ఈయన.. గతంలో ఎఫ్‌టీఎక్స్, ఓపెన్‌ఏఐలలో పనిచేశాడు. అయితే, సెమీకండక్టర్ షేర్లపై సిట్యువేషనల్ అవేర్‌నెస్ పెట్టిన పెట్టుబడులు బెడిసికొట్టడంతో ఈ సంస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. దీంతో ఈ హెడ్జ్ ఫండ్‌లో పెట్టుబడులు కలిగిన జేన్‌స్ట్రీట్‌కూ భారీగా నష్టం వాటిల్లింది. సిట్యువేషనల్ అవేర్‌నెస్ సంస్థ జూన్ నెలలో శాన్‌డిస్క్‌లో 5.7 బిలియన్ డాలర్లు, మైక్రాన్ టెక్నాలజీలో 5.6 బిలియన్ డాలర్లు చొప్పున పెట్టుబడులు పెట్టింది. జులైలో శాన్‌డిస్క్ షేర్లు 47 శాతం, మైక్రాన్ షేర్లు 29 శాతం మేర కుప్పకూలాయి. దీంతో కేవలం ఒక్క నెలలోనే పోర్ట్‌ఫోలియో విలువ దాదాపు 67 శాతం ఆవిరైంది. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో దాదాపు 10 శాతం వాటా కలిగిన బ్లూమ్ ఎనర్జీ షేర్లు కూడా అదే నెలలో 31 శాతం పడిపోయాయి. టీఎస్‌ఎంసీ, నెబియస్ షేర్లలో పెట్టిన పెట్టుబడులు కూడా నష్టాలను మిగిల్చాయి. ఫలితంగా 45 బిలియన్లుగా ఉన్న ఫండ్ విలువ దాదాపు 10 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఈ పతనం కారణంగా వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ దాదాపు 15 బిలియన్ డాలర్లు నష్టపోయినట్లు తెలిసింది. అంటే భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ.1.25 లక్షల కోట్లకు పైమాటే.

ఇదీ జేన్ స్ట్రీట్ కథ

మన స్టాక్‌మార్కెట్‌లో చట్టవ్యతిరేక విధానాల ద్వారా, అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించినట్లు తేలడంతో గతేడాది జులైలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. స్టాక్‌మార్కెట్లో ఇండెక్స్ (ఆయా రంగాల సూచీ) ధరలను ప్రభావితం చేసి, మదుపరుల సొమ్మును ఈ సంస్థ కొల్లగొట్టింది. దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు సెబీ నిర్ధారించింది. కొన్నింట్లో వచ్చిన నష్టాలను మినహాయిస్తే నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించింది. దీంతో రూ.4,843 కోట్లు జరిమానాగా చెల్లించాలని సెబీ ఆదేశించింది. ఈ పరిణామం జరిగిన ఏడాది తర్వాత జేన్‌స్ట్రీట్‌కు తన పెట్టుబడుల రూపంలో భారీ మొత్తంలో నష్టం వాటిల్లడం కొసమెరుపు.

వార్ ఎఫెక్ట్

పెరగనున్న కోల్గేట్ ధరలు!

న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ కోల్గేట్-పామోలివ్ తన ఉత్పత్తుల ధరలను పెంచే యోచనలో ఉంది. రానున్న త్రైమాసికాల్లో ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముడిసరుకుల వ్యయం పెరగడమే ఇందుకు కారణం. కంపెనీ లాభాల మార్జిన్లను కాపాడుకొనేందుకు ఈ ధరల పెంపు అనివార్యమైందని కంపెనీ పేర్కొన్నట్లుగా పలు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. "గతేడాది జీఎస్‌టీ సవరణ వల్ల ఉత్పత్తుల బరువును పెంచాం. ప్రస్తుతం రూ.10, రూ.20 నుంచే కోల్గేట్ ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులతో ముడి సరుకుల సరఫరాపై ప్రభావం పడుతోంది. ఇప్పుడు ధరలు పెంచకపోతే భవిష్యత్తులో ద్రవ్యోల్బణ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని కంపెనీ సీఈవో అండ్ ఎండీ ప్రభా నరసింహన్ తెలిపారు. అలాగే, కంపెనీ టూత్ బ్రష్, టూత్ పేస్ట్ రెండింటిలోనూ ప్రీమియం ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. మరోవైపు, కోల్గేట్-పామోలివ్‌కు చెందిన పర్సనల్ కేర్ బ్రాండ్ పామోలివ్ మార్కెట్ పనితీరుపై ప్రభా నరసింహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీ ఉత్పత్తుల మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకునేందుకు బాంబే షేవింగ్ కంపెనీతో జట్టు కట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కంపెనీ పతాంజలి, హేలియోన్ కంపెనీకి చెందిన సెన్సోడైన్, హిందూస్థాన్ యునిలీవర్‌కు చెందిన పెప్సోడెంట్ ఉత్పత్తులతో పోటీపడుతోంది.

స్థానికులకు 'ఫాస్టాగ్ లోకల్ పాస్'..

మీ టోల్‌ప్లాజా ఈ లిస్ట్‌లో ఉందా?

జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ డిజిటల్ ఫాస్టాగ్ లోకల్ పాస్ సదుపాయాన్ని తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 121 టోల్ ప్లాజాల్లో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. అర్హత కల్గిన వాహనదారులు నెలవారీ లోకల్ పాస్‌లను రాజ్‌మార్గ్‌యాత్ర మొబైల్ యాప్ ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనివల్ల టోల్‌ప్లాజాలకు వెళ్లాల్సిన ప్రయాస తప్పనుంది. టోల్ ప్లాజాలను ప్రత్యక్షంగా సందర్శించడం, అవసరమైన పత్రాలను మాన్యువల్‌గా సమర్పించాల్సిన అవసరం లేదన్నమాట. టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న నివాసితులు ఈ పాస్‌లు పొందేందుకు అర్హులు. మీ దగ్గర్లోని టోల్ ప్లాజా ఈ జాబితాలో ఉందో లేదో చెక్ చేయడానికి రాజ్‌మార్గ్‌యాత్ర వెబ్‌సైట్‌ను సందర్శించండి. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 12, తెలంగాణలో 3 టోల్‌ప్లాజాలను ఎంపిక చేశారు. నిబంధనల మేరకు ఈ పాస్ వినియోగించి టోల్ ప్లాజాల మీదుగా అపరిమితమైన ప్రయాణాలు చేయొచ్చు.

యూట్యూబ్‌లో వ్యూస్ లెక్కించే విధానంలో కీలక మార్పు



వాషింగ్టన్: గూగుల్‌కు చెందిన ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ వ్యూస్ లెక్కించే విధానంలో కీలక మార్పు తీసుకురాబోతోంది. వీడియో ప్రారంభమైన తొలి ఫ్రేమ్ నుంచే ఇకపై వీడియో వ్యూ కౌంట్ ప్రారంభవుతుంది. అన్ని ఫార్మాట్లకు వ్యూస్ లెక్కింపు విధానంలో ఏకరూపత ఉండాలన్న ఉద్దేశంతో ఈ మార్పు చేపడుతోంది. ఆగస్టు 24 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం అమల్లోకి రానుంది. యూట్యూబ్‌లో ప్రస్తుతం లాంగ్ ఫార్మాట్ వీడియోలను ఎవరైనా 30 సెకన్లు పాటు వీక్షిస్తేనే వ్యూగా లెక్కిస్తున్నారు. ఇకపై వీడియో ప్రారంభమైన తొలి ఫ్రేమ్ నుంచే వ్యూగా కౌంట్ చేస్తారు. యూట్యూబ్ షార్ట్స్‌లో ఈ విధానాన్ని యూట్యూబ్ ఇప్పటికే అమలు చేస్తోంది. కొత్తగా లాంగ్ ఫార్మాట్ వీడియోలకూ వర్తింపజేయనుంది. వీడియో ప్లే అయిన వెంటనే, లేదా ఎవరైనా లైవ్‌స్ట్రీమ్‌లోకి ప్రవేశించిన వెంటనే ఇకపై పబ్లిక్ వ్యూ నమోదవుతుంది. కేవలం వీడియో ప్లే అయిన తర్వాత చూసి వెళ్లిపోయిన వారిని, ఎక్కువ సమయం చూసిన వారిని వేర్వేరుగా చూపించేందుకు యూట్యూబ్ అనలిటిక్స్‌లో 'ఎంగేజ్డ్ వ్యూస్' ఆప్షన్‌ను ఉంటుంది. దీనిద్వారా నిజంగా తమ కంటెంట్‌ను ఎంతమంది చూస్తున్నారో క్రియేటర్లు తెలుసుకోగలుగుతారు. అయితే, ఈ మార్పు వల్ల ఆదాయం, మానిటైజేషన్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోదని యూట్యూబ్ స్పష్టంచేసింది. యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్‌ను అనుసరించే చెల్లింపులు కొనసాగుతాయని స్పష్టంచేసింది. ఈ మార్పు వల్ల యూజర్లకు వచ్చే ప్రయోజనం ఏమీ లేనప్పటికీ.. క్రియేటర్లకు మాత్రం ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

సరిహద్దుల్లో శత్రు డ్రోన్ల కట్టడి ఇంద్రజాల్‌కు రూ.155 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకాలాపాలు నిర్వహిస్తున్న ఇంద్రజాల్ అటానమస్ డిఫెన్స్ సిస్టమ్స్, కేంద్ర హోం శాఖ నుంచి రూ.155 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకుంది. సరిహద్దు గ్రామాలు, పట్టణ వీధులు, అత్యంత ప్రముఖులు ప్రయాణించే మార్గాల్లో ప్రమాదకర డ్రోన్ల ముప్పును అరికట్టేందుకు ఇంద్రజాల్ రేంజర్ వాహనాలను మోహరించనున్నారు. ఇందులో సరిహద్దు రక్షణ కోసమే రూ.145 కోట్లు కేటాయించారు. ఇంద్రజాల్-సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కలిసి ఈ ప్రాజెక్టు పూర్తి చేయనున్నాయి. మిగిలిన రూ.10 కోట్లతో పట్టణ పోలీసులు వీవీఐపీ రక్షణ, విమానాశ్రయాలు, బహిరంగ సభల వద్ద భద్రత కోసం రేంజర్ వాహనాలను వినియోగిస్తారు. సరిహద్దుల్లో మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఇవి కీలకం కానున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు సైనిక స్థావరాలకే ఇలాంటి వ్యవస్థలను పరిమితం చేయగా, భారత్ పౌర భద్రత కోసం వీటిని ప్రవేశపెడుతున్నట్లు ఇంద్రజాల్ వ్యవస్థాపకులు కిరణ్ రాజు పెనుమత్స తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో వీటిని రూపొందించడం ఆత్మ నిర్భర్ భారత్ దిశగా కీలక అడుగు అని సిగ్మా సీఈఓ సునీల్ కలిదిండి పేర్కొన్నారు.



అమెరికాను భయపెట్టిన.. అందాల సుందరి

వాషింగ్టన్: అమెరికా ప్రభుత్వ అంతర్గత రహస్యాలను తెలుసుకొనేందుకు ఆ దేశ కాంగ్రెస్ నాయకులను కూడా చైనా వదిలి పెట్టడంలేదు. ఏకంగా కీలకమైన ఇంటెలిజెన్స్ కమిటీ సభ్యుడినే డ్రాగన్ టార్గెట్ చేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికా చట్టసభ మాజీ సభ్యుడు ఎరిక్ స్వాల్‌వెల్ (ఇతీతిఇ ాలిజీశ్రీలివశ్రీశ్రీ)కు సంబంధించిన రహస్య ఫైల్స్‌ను ట్రంప్ యంత్రాంగం తాజాగా బహిర్గతం చేసింది. చైనాకు చెందిన ఓ మహిళ గతంలో ఆయనను హనీట్రాప్‌లోకి లాగినట్లు ఎఫ్‌బీఐ బట్టబయలు చేసింది. 2013లో చట్టసభకు ఎన్నిక కావడానికి ముందు ఎరిక్‌ను అమెరికాలో క్రిస్టీన్ ఫాంగ్ అనే చైనా మహిళ కలిసింది. ఎన్నికల సమయంలో ఆయనకు ఫండ్ రైజింగ్, ప్రచార కార్యక్రమాల్లో ఆమె సాయం చేసింది. వారి మధ్య 2012-2015 కాలంలో శారీరక సంబంధం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. 2020లో స్వాల్‌వెల్ కీలకమైన ఇంటెలిజెన్స్ కమిటీలో సభ్యుడిగా ఉన్న సమయంలో కూడా ఫాంగ్ తరచూ స్వాల్‌వెల్‌ను కలిసేది. ఆమెకు చైనా గూఢచర్య నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు అదే ఏడాది స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. చైనా కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీకి ఫాంగ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నట్లు అవి పేర్కొన్నాయి. వాస్తవానికి చైనాలో ఈ విభాగం ప్రధానంగా పౌర గూఢచర్యం చేస్తుంది. ఆ సమయంలో స్వాల్‌వెల్ హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీలో సభ్యుడిగా ఉండడంతో రిపబ్లికన్లు ఆయనపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఆరోపణలపై విచారణ జరిపిన హౌస్ ఎథిక్స్ కమిటీ.. ఫాంగ్‌తో స్వాల్‌వెల్‌కు ఉన్న సంబంధాలపై రెండేళ్లపాటు దర్యాప్తు జరిపింది. అనంతరం ఎలాంటి

చర్యలు తీసుకోకుండా దర్యాప్తును 2023లో ముగించింది. అనంతరం ఆమె తిరిగి చైనాకు వెళ్లిపోయింది. ఆ విషయంపై తాజాగా దర్యాప్తు చేపట్టిన ఎఫ్‌బీఐ అమెరికా రాజకీయాల్లో ఎదిగే అవకాశం ఉన్న నేతలకు వలపు వల విసిరి, వారి నుంచి ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి అమెను చైనానే పంపినట్లు తేల్చింది. ఆ సమయంలో కేవలం స్వాల్‌వెల్‌తో మాత్రమే కాకుండా పలు రాష్ట్రాల మేయర్‌లతోనూ ఆమె సంబంధాలు కొనసాగించినట్లు పేర్కొంది. అయితే ప్రభుత్వానికి చెందిన ఏదైనా సమాచారాన్ని ఆమె సంపాదించారా..? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా, తనపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో స్వాల్‌వెల్ 2026 ఏప్రిల్ 14న చట్టసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఆయన, కాలిఫోర్నియా గవర్నర్ రేసు నుంచి కూడా వైదొలిగారు. దీంతో చట్టసభలో ఆయన స్థానాన్ని భర్తీ చేయడానికి ఎన్నికలు నిర్వహించారు. ఈ క్రమంలోనే ఎఫ్‌బీఐ ఈ ఫైల్స్‌ను రిలీజ్ చేయడం గమనార్హం.

సన్‌షైన్ పిక్చర్స్ ఐపీఓ..

90 నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్

ముంబై: ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రొడ్యూసర్, డైరెక్టర్ విపుల్ షాకు చెందిన సన్‌షైన్ పిక్చర్స్‌కు మదుపర్ల నుంచి అనూహ్య స్పందన లభించింది సబ్‌స్క్రిప్షన్‌కు వచ్చిన తొలి 90 నిమిషాల్లో బిడ్డింగ్ పూర్తయింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. 54.59 లక్షల షేర్లకు గానూ.. 54.86 లక్షల బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ కోటా 1.49 రెట్లు, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 1.16 రెట్లు చొప్పున సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఈ కంపెనీ యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఇప్పటికే రూ.84.64 కోట్ల నిధులను సమీకరించింది. సన్‌షైన్ పిక్చర్స్ రూ.282 కోట్ల నిధుల లక్ష్యంతో మంగళవారం ఐపీఓకు వచ్చింది. ఆగస్టు 20న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.342-360గా కంపెనీ నిర్ణయించింది. 48 లక్షల తాజా షేర్లు, 30.37 లక్షల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. విపుల్ అమృతలాల్ షా, షెఫాలీ విపుల్ షా ప్రమోటర్లుగా తమ వాటాలను ఆఫర్ ఫర్ సేల్‌లో విక్రయిస్తున్నారు. ఈ కంపెనీ షేర్లు ఆగస్టు 25న స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ కానున్నాయి. డెయిరీ ఉత్పత్తులు తయారు చేసే మిల్కీ మిస్ట్ డైరీ ఫుడ్ కంపెనీ మదుపర్లకు లిస్టింగ్ లాభాలను అందించింది మంగళవారం దాదాపు 18 శాతం ప్రీమియంతో ఈ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధర రూ.140 కాగా.. దాదాపు 18 శాతం లాభంతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో రూ.165 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఓ దశలో 29.60% పెరిగి 181.45 వద్ద గరిష్ఠాన్ని తాకాయి.

టాటా సన్స్ ఏజీఎం వాయిదా..

చరిత్రలో తొలిసారి!

దిల్లీ: టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం అనుకున్నట్లుగానే వాయిదా పడింది. తగినంత కోరమ్ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. టాటా గ్రూపు కంపెనీలకు హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. మళ్లీ ఎప్పుడు ఏజీఎం నిర్వహించాలనే అంశంపై బోర్డు సభ్యులతో ఛైర్మన్ సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోనున్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 18న బాంబే హౌస్‌లో నిర్వహించ తలపెట్టిన ఏజీఎంకు ఛైర్మన్ చంద్రశేఖరన్, కొందరు బోర్డు సభ్యులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. నోయల్ టాటా, మెహ్లీ మిస్త్రీ సహా మరికొందరు సైతం ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. అయితే, మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ విధించిన నిషేధం కారణంగా టాటా సన్స్‌లో కీలక వాటాదారు అయిన సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ) తన ప్రతినిధిని నామినేట్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ట్రస్ట్ ప్రతినిధి గైర్హాజరీతో కోరమ్ లేకపోవడంతో ఏజీఎం వాయిదా పడింది. ఇదే విషయాన్ని మరో ట్రస్ట్ అయిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ ముందుగానే టాటా సన్స్‌కు తెలియజేసింది. దీంతో ఏజీఎం వాయిదా ముందుగా ఊహించినదే. వాస్తవానికి ఈ సమావేశంలో టాటా సన్స్‌కు ప్రస్తుత చంద్రశేఖరన్‌ను డైరెక్టర్‌గా రీనామినేట్ చేసే అంశం పరిశీలనతో పాటు, 2025-26 ఆర్థిక సంవత్సర స్టాండలోన్, ఏకీకృత ఖాతాలను పరిశీలించి, ఆమోదించాల్సి ఉంది. డివిడెండునూ ప్రకటించాల్సి ఉంది.

రోజూ రూ.2.2 లక్షల కోట్ల లావాదేవీలు

పసిడి డెరివేటివ్స్‌కు భారీ ఆదరణ

వాషింగ్టన్: మన దేశంలోనూ బంగారాన్ని ఆభరణాల కోసమే కాక, పెట్టుబడి సాధనంగా ఉపయోగించుకోవడమూ పెరుగుతోంది. పసిడి డెరివేటివ్స్‌కు లభిస్తున్న విశేష ఆదరణే ఇందుకు నిదర్శనం. షేర్లు, మ్యూచువల్ ఫండ్‌ల స్థాయిలోనే ప్రతిఫలం లభిస్తున్నందున పసిడి డెరివేటివ్స్‌లో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. అందువల్లే పసిడి డెరివేటివ్స్ మార్కెట్ సగటు రోజువారీ టర్నోవరు రూ.2.2 లక్షల కోట్లను అధిగమించింది. పసిడి ఫ్యూచర్స్, ఆప్షన్స్‌లో ట్రేడింగ్ కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయనే విషయాన్ని ఇది తెలియజేస్తోంది. పసిడి డెరివేటివ్స్‌ను 2003లో ఎంసీఎక్స్‌లో ప్రవేశపెట్టారు. పసిడి ధరల్లో హెచ్చుతగ్గుల ముప్పును హెడ్జ్ చేయాలనుకునే రిటెయిల్ పెట్టుబడిదార్లు, సంస్థలు, వ్యాపారులకు ఇది ఉపయోగపడుతోంది. అప్పటి నుంచి ఫ్యూచర్స్, ఆప్షన్స్‌లో తక్కువ పరిమాణంలో పసిడి కాంట్రాక్టులు అందుబాటులోకి వచ్చాయి. సుదీర్ఘ ట్రేడింగ్ సమయం ద్వారా ఈ మార్కెట్ విస్తరించినట్లు ఎంసీఎక్స్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2025-26లో పసిడి ఫ్యూచర్స్ సగటు రోజువారీ టర్నోవరు రూ.28,484 కోట్లు. 2024-25 లోని రూ.8,449 కోట్లకు ఇది దాదాపు 3 రెట్లు అధికం. ఇదే సమయంలో సగటు రోజువారీ ఫ్యూచర్స్ పరిమాణం 11 టన్నుల నుంచి 23 టన్నులకు పెరిగింది. పసిడి ఆప్షన్స్‌లో మరింత భారీ పెరుగుదల ఉంది. 2024-25లో రోజువారీగా రూ.28,148 కోట్ల టర్నోవర్ నమోదైతే, 2025-26లో ఇది రూ.1,93,564 కోట్లకు దూసుకెళ్లింది. సగటు రోజువారీ ఆప్షన్స్ పరిమాణం 36 టన్నుల నుంచి 156 టన్నులకు పెరిగింది. ఫ్యూచర్స్, ఆప్షన్స్ గణాంకాలను కలిపితే 2025-26లో రోజువారీ సగటు టర్నోవరు సుమారు రూ.2.22 లక్షల కోట్లుగా ఉంది. ధరల నిర్ధరణకు, హెడ్జింగ్ కోసం డెరివేటివ్స్ వినియోగం పెరిగింది. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కాంట్రాక్టులు పారదర్శక ధర సూచనను అందిస్తాయి. వ్యాపారులు ఇన్వెంటరీ (నిల్వలు), సేకరణ (కొనుగోలు), తయారీ, మార్కెటింగ్ విషయాల్లో నిర్ణయాలు తీసుకోవడానికి ఇది సహాయపడుతోంది. వివిధ కాంట్రాక్టు పరిమాణాలను అందుబాటులోకి తేవడం కూడా డెరివేటివ్స్ మార్కెట్ అభివృద్ధి చెందడానికి కారణమైంది. ఒక కిలో, 100 గ్రాములు, 10 గ్రాములు, 8 గ్రాములు, ఒక గ్రాము పరిమాణంలో పసిడి కాంట్రాక్టులను ట్రేడింగ్ కోసం ఎంసీఎక్స్ అందిస్తోంది. దీంతో చిన్న మదుపర్లు కూడా ట్రేడ్ చేయగలుగుతున్నారు. నగల వ్యాపారులు, రిఫైనర్లు, దిగుమతిదార్లు, బులియన్ వ్యాపారులకు పసిడి ధరల ఒడుదొడుకులను తట్టుకోవడంలో డెరివేటివ్స్ సహాయపడుతున్నాయి. దేశీయ, ప్రాంతీయ పసిడి ధరల నిర్ధరణను బలోపేతం చేసే సామర్థ్యం భారత పసిడి డెరివేటివ్స్ మార్కెట్‌కు ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. లోతైన లిక్విడిటీ, మదుపర్ల నుంచి విస్తృత భాగస్వామ్యం లాంటివి ప్రపంచ పసిడి కేంద్రంగా మారాలనే భారత ఆశయానికి అండగా నిలవనున్నాయి.

మ్యూచువల్ ఫండ్ల నమోదు.. ఇక సులభం

ప్రక్రియను సరళీకరించిన సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్ల నమోదు ప్రక్రియను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మరింత సులభతరం చేసింది. ఇప్పటివరకు ఉన్న సంక్లిష్ట విధానాన్ని మారుస్తూ, ఒకే దరఖాస్తు ద్వారా ప్రాథమిక, తుది అనుమతులు పొందేలా నిబంధనలను సరళీకరించింది. ప్రాయోజిత సంస్థల (స్పాన్సర్స్) ఆర్థిక పరిస్థితి, యాజమాన్య తీరుతెన్నులు, గత చరిత్రకు సంబంధించి సమగ్ర వివరాలు వెల్లడించడాన్ని తప్పనిసరి చేసింది. జులైలో నోటిఫై చేసిన సెబీ (మ్యూచువల్ ఫండ్ నిబంధనలు)-2026 ప్రకారం ఈ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇప్పటివరకు ఇలా: ఇప్పటివరకు మ్యూచువల్ ఫండ్ల నమోదు రెండు దశల్లో జరిగేది. ప్రాథమిక అనుమతికి ఫారం-ఏ, తుది నమోదు కోసం ఫారం-సి, డి సమర్పించాల్సి ఉండేది. ఇకపై వీటన్నింటి స్థానంలో ఒకే ఏకీకృత దరఖాస్తు (ఫారం-ఏ) అందుబాటులోకి వస్తుంది. ఇందులో సంస్థ నికర విలువ, గత 5 ఏళ్ల ఆడిట్ నివేదికలు, వాటాదారుల వివరాలను స్పష్టంగా పేర్కొనాలి.

అర్హతకు రెండు మార్గాలు..: ఫండ్ల ఏర్పాటుకు సెబీ రెండు మార్గాలను సూచించింది. మొదటి మార్గంలో రావాలనుకునే సంస్థలకు ఆర్థిక సేవల్లో కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. గత 5 ఏళ్లలో నికర లాభం కలిగి ఉండటంతో పాటు, సగటు వార్షిక లాభం కనీసం రూ.10 కోట్లు ఉండాలి. లాభాలు, అనుభవం లేని సంస్థలు రెండో మార్గం ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సదరు అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) నికర విలువ రూ.150 కోట్లు ఉండాలి. సీఈఓ, సీఓఓ, సీఆర్‌ఓ తదితర ఉన్నతాధికారుల ఉమ్మడి అనుభవం కనీసం 30 ఏళ్లు ఉండాలని సెబీ స్పష్టం చేసింది. అందులో ప్రవేశపెట్టే రూ.150 కోట్ల మూలధనాన్ని అయిదేళ్లపాటు లాకిన్ చేయాలి.

కఠినమైన నిఘా: మదుపరుల ప్రయోజనాల దృష్ట్యా సంస్థల నేపథ

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
19 ఆగస్ట్ 2026

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ
ఐఎన్టియూసీ ప్రతినిధి బృందంతో భేటీ

గోదావరిఖని (జనంసాక్షి)

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, పెండింగ్‌లో ఉన్న హామీల అమలు కోసం ఐ ఎన్ టి యు సి సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం రాష్ట్ర బొగ్గు శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో తన నివాసంలో మంగళవారం కలిసి సింగరేణి కార్మికుల సమస్యలను వివరించింది. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై సమగ్రంగా చర్చించారు.

ముఖ్యంగా , సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల మనుగడ కోసం నూతన బొగ్గు గనుల ప్రారంభం, మెడికల్ బోర్డు సమస్య, మారుపేర్ల మార్పు సమస్య, పెర్క్పై ఇన్‌కమ్ ట్యాక్స్ మాఫీ, సొంత ఇంటి కల సాకారం, సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా ప్రకటించడం, అధికారులకు సంబంధించిన పిఆర్‌పి సమస్య, అలాగే సింగరేణి యాజమాన్యంతో ఐఆర్ సమావేశం ఏర్పాటు వంటి అంశాలను డిప్యూటీ సీఎంకు వివరించారు. అదేవిధంగా కార్మికులకు ఇచ్చిన హామీలను కాలపరిమితిలోగా అమలు చేయడంతో పాటు, సింగరేణి సంస్థలో కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఐఎన్‌టియు సి నాయకులు కోరారు. ఐఎన్‌టియుసి ప్రతినిధి బృందం ప్రస్తావించిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. వీలైనంత త్వరగా ఐఎన్‌టియుసి యూనియన్ ప్రతినిధులు, సింగరేణి యాజమాన్యం, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఒక్కొక్క సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఐఎన్టియుసి నిరంతరం ప్రభుత్వంతో చర్చిస్తూ, కార్మికులకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తుందని ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, కాంపెల్లి సమ్మయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వడ్డేపల్లి దాస్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణతో సామాన్యులకు 'కరెంటు' షాక్

యూనిట్ విద్యుత్ ధర రూ.12 నుంచి రూ.14కు పెరిగే ప్రమాదం
ఓపెన్ యాక్సెస్, స్మార్ట్ మీటర్లతో వినియోగదారులపై పెను భారం
వైటీపీఎస్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. సుధా భాస్కర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 18 (జనంసాక్షి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన విద్యుత్ విధానాలు, ప్రైవేటీకరణ చర్యలు సామాన్య, వ్యవసాయ వినియోగదారులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపే ప్రమాదం ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. సుధా భాస్కర్ హెచ్చరించారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వినియోగదారులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లోని రంగినేని గార్డెన్స్‌లో తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్-1829, సీఐటీయూ అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. సుధా భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువల స్వామి తదితరులు మాట్లాడారు. జెన్‌కో, ఎన్టీపీసీ తదితర విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి డిస్కంలు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేస్తున్నాయని నేతలు తెలిపారు. అయితే ఓపెన్ యాక్సెస్ విధానం ద్వారా భారీ పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు నేరుగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి కరెంటు కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీంతో డిస్కంలకు పరిశ్రమల నుంచి వచ్చే క్రాస్ సబ్సిడీ తగ్గిపోయి, ఆ భారాన్ని గృహ, వ్యవసాయ వినియోగదారులపై మోపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో విద్యుత్ ధరలు యూనిట్‌కు రూ.12 నుంచి రూ.14 వరకు పెరిగే పరిస్థితి ఏర్పడితే పేద, మధ్యతరగతి కుటుంబాలతో పాటు రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. విద్యుత్‌ను ప్రజల ప్రాథమిక అవసరంగా కాకుండా లాభార్జన వ్యాపారంగా మార్చే విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో అదనపు భారం

విద్యుత్ రంగంలో తీసుకొస్తున్న స్మార్ట్ మీటర్ల విధానం భవిష్యత్తులో వినియోగదారులకు భారంగా మారే అవకాశం ఉందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరరావు అన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సమయాల వారీగా విద్యుత్ వినియోగాన్ని లెక్కించే విధానం అమలైతే పీక్ అవర్స్‌లో వినియోగించే విద్యుత్‌కు అధిక చార్జీలు పడే ప్రమాదం ఉందన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చాల్సిన విద్యుత్ సంస్కరణలు కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చేలా ఉండకూడదన్నారు. విద్యుత్ రంగంలో మార్పులు తీసుకురావడానికి ముందు ఉద్యోగ, కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, వినియోగదారులతో ప్రభుత్వం విస్తృతంగా చర్చించాలని కోరారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని దశలవారీగా ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని ఆరోపించారు. విద్యుత్ ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే చివరికి ఆర్థిక భారం వినియోగదారులపైనే పడుతుందని అన్నారు. నల్లగొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణా జలాల ఆధారంగా నడుస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1, స్టేజ్-2తో పాటు యాష్, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల ప్రైవేటీకరణ ప్రతిపాదనలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో నిర్మించిన విద్యుత్ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దని కోరారు. డిస్కంలకు రావాల్సిన రూ.45,398 కోట్ల బకాయిలు విడుదల చేయాలి. డిస్కంలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటికి చెల్లించాల్సిన రూ.45,398 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువల స్వామి డిమాండ్ చేశారు. వినియోగదారుల

సంఖ్య ఏటా పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా విద్యుత్ శాఖలో సిబ్బందిని పెంచడం లేదన్నారు. దీంతో ఉద్యోగులు, కార్మికులపై పనిభారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. విద్యుత్ శాఖలో కీలకంగా పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని నేతలు డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు జేఎల్ఎంలకు బకాయిలను చెల్లించాలని కోరారు. 2026 ఏప్రిల్ నుంచి అమలు కావాల్సిన పీఆర్సీకి సంబంధించి వెంటనే కమిటీ ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలకు పిలుపు

విద్యుత్ రంగ ప్రైవేటీకరణను కేవలం కార్మికులు, ఉద్యోగులు మాత్రమే అడ్డుకోలేరని, ప్రజలు, రైతులు, వినియోగదారులు కూడా ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆర్. సుధా భాస్కర్ పిలుపునిచ్చారు. పవర్ జేఏసీ, ఆర్టిజన్ జేఏసీలు ఏకతాటిపైకి వచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేయాలని సూచించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన ఐక్య పోరాటాల స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉద్యమాలను నిర్మించాలని నేతలు పిలుపునిచ్చారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలను తిప్పికొట్టి, ప్రజలకు అందుబాటులో ఉండే విద్యుత్ విధానాల కోసం పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గిట్ల ముకుంద రెడ్డి, రాష్ట్ర ఓబీ సభ్యులు, ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు జి. ఆంజనేయులు, కంపెనీ కార్యదర్శి వెంకట్ రాజం, ఎస్పీడీసీఎల్ కంపెనీ కార్యదర్శి కే. సత్యం, ఎస్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు చంద్రారెడ్డి, కరీంనగర్ జిల్లా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సంతోష్ నాయక్, జిల్లా కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్, రాష్ట్ర ఓబీ సభ్యులు రాచకొండ వెంకటేశ్వరరావు, ట్రాన్స్‌కో అధ్యక్షులు కాటం మధు, కార్యదర్శి మధు, సురభి శ్రీకాంత్, అజ్మీర తిరుపతి నాయక్, లావుడియా లవ్‌సీ లాల్, కనకయ్య, శ్రీనివాస్, వంగ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనకు సర్వం సిద్ధం

ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, ఆగస్టు 18, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మంథని పట్టణం గంగాపురి వద్ద న్యాక్ స్కిల్ డెవలప్‌మెంట్ బిల్డింగ్‌తో పాటు, పాత పెట్రోల్ బంక్ వద్ద నాలుగు మండలాల్లోని 9 గ్రామాలకు సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన 9 వైకుంఠ రథాలను సర్పంచులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రులు ప్రారంభించనున్నారు. మంథని బస్ డిపో వద్ద రూ.164.64 కోట్లతో పలు అభివృద్ధి పనులకు, బ్రిడ్జి రోడ్డు నుంచి బస్ డిపో వరకు వెడల్పు డ్రెయిన్ నిర్మాణానికి రూ.15 కోట్లు, సెంట్రల్ లైటింగ్‌కు రూ.1.20 కోట్లు, గాంధీచౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌కు రూ.59 లక్షలు, అంబేద్కర్ చౌక్ నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు రోడ్డు విస్తరణకు రూ.35 లక్షలు, క్యాంప్ ఆఫీస్ రోడ్డుకు రూ.50 లక్షలు, ఇతర వార్డుల్లో రోడ్ల పనులకు రూ.9 కోట్లతో శంకుస్థాపనలు చేయనున్నారు. మంథని డిపో నుంచి డిగ్రీ కళాశాల వరకు రూ.21 కోట్ల సీఎఆర్ఎఫ్ నిధులతో, మంథని డిపో నుంచి గోదావరి వరకు 2 కిలోమీటర్ల నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి రూ.22 కోట్లతో పనులు ప్రారంభించనున్నారు. సూరయ్యపల్లి నుంచి కాకర్లపల్లి మీదుగా సీతంపేట

వరకు 10.8 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు రూ.29.94 కోట్లు, గుంజపడుగు నుంచి ఉప్పట్ల మీదుగా విలోచవరం వరకు 10.9 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.8.78 కోట్లు, కూనారం నుంచి ముత్తారం వరకు 18 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.36.28 కోట్ల నిధులతో శంకుస్థాపనలు చేయనున్నారు. మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో నాలుగు మండలాల ప్రజలకు రేషన్ (స్మార్ట్) కార్డులు, కల్యాణలక్ష్మి/షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మైనార్టీలకు కుట్టుమిషన్లు, మహిళా స్వశక్తి సంఘాలకు చెక్కులను మంత్రులు పంపిణీ చేయనున్నారు. కాగా ఏర్పాట్లను మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష దగ్గరుండి పర్యవేక్షించారు. వారి వెంట మంథని మునిసిపల్ చైర్ పర్సన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్ తో పాటు పలు శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి) : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో కోట్లాది రూపాయలతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి , పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ అన్నారు. నగరంలోని 20, 21వ డివిజన్ల పరిధిలో గల శ్రీరామ్ నగర్, ఇతర చోట్లలో కోటి రూపాయల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న పైప్ డ్రైన్, సీసీ రోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం 16వ డివిజన్ మల్కాపూర్ ఏరియాలో 15వ ఆమోదిత ఫైనాన్స్ కమిషన్ ద్వారా 15లక్షల నిధులతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బండి సంజయ్ కుమార్ తో పాటు మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్లు వరాల నర్సింగం, పర్వతం మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి ఇతర కార్పొరేటర్లు బండ రమణారెడ్డి, వంగల పవన్, బండారి వేణు, బోయిన్పల్లి ప్రవీణ్ రావు, గాజ రమ- శివరాం, ఎన్నం లక్ష్మీ- ప్రకాష్‌లతో పాటు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్న పథకాలను ఊడగొట్టాలనే కుట్రలు చేస్తుండ్లు

ప్రజాపాలన పేరుతో కొత్త పాలనకు తెరలేపిన కాంగ్రెస్
మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, ఆగస్టు 18, (జనంసాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దోపిడికి వత్తాసు పలికే మంత్రులకు చిత్తశుద్ధి, చీము నెత్తురు ఉంటే పథకాలను కొల్లగొడుతున్న ముఖ్యమంత్రిని కుర్చీ దించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కళ్యాణలక్ష్మి పై కాంగ్రెస్ కుట్రలకు నిరసనగా మంగళవారం మంథనిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా రాజగృహ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బారీ ర్యాలీగా వచ్చి, మహిళలు చౌరస్తాలో బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా లో ధర్నా నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 130 ఏండ్ల చరిత్ర కల్గిన కాంగ్రెస్ పార్టీ చేతులకు మట్టి అంటకుండా ప్రజలను ఏ విదంగా మోసం చేయాలని చూస్తుందో అర్థం అవుతుందని, ప్రజాపాలన పేరుతో కొత్త పాలనకు తెరలేపిన కాంగ్రెస్ తమకు సంబంధం లేనట్లుగానే కోర్టుల ద్వారానే పథకాలు ఆగిపోతున్నయని కొత్త తరహాలో మోసం చేస్తున్నారని ఆయన వివరించారు. రేవంత్‌రెడ్డి నాయకత్వం, పాలనలో దాడులు, కేసులు, దౌర్జన్యాలు, కూల్చివేతలు తప్ప

అభివృద్ధికి నోచుకోని ఈ రాష్ట్రంలో మనం ఉండటం దౌర్భాగ్యాంగా బావిస్తున్నట్లు చెప్పారు. మంథని నియోజకవర్గంలో ప్రజల ఓట్లతో గెలిచి 40 ఏండ్లుగా ప్రజలను వంచిస్తున్న స్థానిక ఎమ్మెల్యే రాష్ట్రాన్ని ఏ విధంగా మోసం చేయాలనేది చూపించిన చరిత్రను చూస్తున్నామని అన్నారు. బీసీబిడ్డ అయిన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఎస్సీ మంత్రులు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని, పథకాలు అనుభవించేది 95శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ బిడ్డలే కదా అని ఆయన అన్నారు. పథకాలను కొల్లగొట్టాలని చూస్తున్న ముఖ్యమంత్రికి మంత్రులు వత్తాసు పలుకడం సిగ్గు చేటు అన్నారు. 420 హామీల రాసిన సన్నాసి ఎమ్మెల్యే కళ్యాణ లక్ష్మి తోపాటు తులం బంగారం ఏది అని ప్రశ్నించారు. ప్రజలతో బీఆర్ఎస్ పార్టీకి పేగు బంధమని, అందుకే ఆనాడు కేసీఆర్ కళ్యాణలక్ష్మి, దళితబంధు లాంటి పథకాలను అమలు చేశారని ఆయన గుర్తు చేశారు.

బైక్ దొంగల ముఠా అరెస్ట్

రెండు చోరీ బైక్‌లు స్వాధీనం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 (జనంసాక్షి) : మద్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహారాష్ట్రలోని దేగ్లూర్‌కు చెందిన జాదవ్ అజయ్, షేక్ అయాన్ డబ్బుల కోసం బైక్‌లను చోరీ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గతంలో మహారాష్ట్రలోని చాకుర్ పోలీస్ స్టేషన్ పరిధిలోనూ వీరు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 28న తెల్లవారుజామున డోంగ్లి గ్రామంలో ఇంటి కాంపౌండ్ గేట్ తాళం పగలగొట్టి హోండా షైన్ (టీఎస్16ఈటీ7946) ను చోరీ చేసిన నిందితులు, అనంతరం హాండేకలూర్ గ్రామంలో ఇంటి ముందు ఉన్న హీరో హఫ్ డీలక్స్ (టీఎస్17సీ4311)ను కూడా పాత తాళం సహాయంతో అపహరించారు. రెండు వాహనాలను మహారాష్ట్రలోని దేగ్లూర్‌కు తీసుకెళ్లి తమ ఇళ్ల వద్ద ఉంచుకున్నారు. చోరీ చేసిన బైక్‌లను పిట్లం, బిచ్కుంద ప్రాంతాల్లో విక్రయించేందుకు ఈ నెల 17న తీసుకెళ్తుండగా, మద్నూర్ శివారులోని పాత భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఎస్ఐ ఏ. మోహన్ రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు చోరీ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, ఇతర చోరీ కేసుల్లోనూ వారి ప్రమేయంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఏ. మోహన్ రెడ్డి, పోలీస్ సిబ్బంది విఠల్, శ్రావణ్, సంతోష్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలపై ఉక్కుపాదం మోపాలి

నిజామాబాద్ కలెక్టర్ భవేష్ మిశ్రా



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (జనంసాక్షి) : పుట్టబోయే శిశువు అమ్మాయా, అబ్బాయా అని తెలియజేసేందుకు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుట్టబోయేది ఆడ శిశువు అని నిర్ధారణ చేసి, గర్భవిచ్ఛిత్తికి పాల్పడడం క్షమించరాని నేరమని, ఇది ఎంతో శోచనీయమని అన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడేవారిని ఎంతమాత్రం ఉపెక్షించకుండా, బాధ్యులపై ఎం.టి.పి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం గర్భస్థపూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది. లింగ నిర్ధారణ పరీక్షల నిరోధానికి చేపడుతున్న చర్యల విషయమై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకుని నివేదికలు పరిశీలించారు. కమిటీ పనితీరు ఆశించిన స్థాయిలో లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నామ్ కే వాస్తేగా సమావేశాలు నిర్వహించి తీర్మానాలు రాసుకోవడంతోనే సరిపెట్టుకోకుండా, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్షేత్ర స్థాయిలో గట్టి నిఘా ఉంచాలని అన్నారు. జనన వివరాలను అనుసరిస్తూ ఆడ, మగ నిష్పత్తిలో ఎక్కువ వ్యత్యాసం ఉంటే, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఈ తరహ వ్యత్యాసం ఎక్కువగా నగరాలు, పట్టణ ప్రాంతాలలోనే కనిపిస్తోందని, దీనిని బట్టి గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగుతున్నట్లు తెలుస్తోందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో గట్టి నిఘా ఉంచితే ఈ తరహా అమానవీయ ఘటనలకు ఆస్కారం ఉండదని సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు జరుగకుండా గట్టి నిఘా పెట్టాలని, నిబంధలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలని, స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భం దాల్చిన నాటి నుండి గర్భిణీల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, వారిలో ఎంతమందికి కాన్పు జరిగిందన్నది పరిశీలించాలన్నారు. పి.సి.పి.ఎన్.డి.టి, ఎం.టి.పీ చట్టాలను ఉల్లంఘించడం వల్ల సమాజంలో స్త్రీ, పురుషుల నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నదని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. పుట్టబోయే శిశువు ఆడ, మగ ఎవరైనా సరే, అందరూ సమానమే అని ప్రజల్లో విస్తృతంగా అవగాహన కలిగించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, కమిటీ సభ్యులు ఎస్.సిద్దయ్య, బి.ఆంజనేయులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు భరించలేక మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య

శంకర్‌పల్లి, ఆగస్టు 18(జనంసాక్షి) : భర్త వేధింపులు భరించలేక వివాహిత మహిళ తల్లి గారి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంకరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ రుద్వీర్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారంగా శంకర్ పల్లి కి చెందిన ప్రశాంతి(36) వికారాబాద్ జిల్లా పూడూరు మండలం ఎన్మేపల్లి గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ తో 18 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. కొన్నాళ్లపాటు సాఫీగా సాగిన సంసారంలో భర్త వేరే మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగించే విషయం భార్యకు తెలిసింది. మృతురాలు ప్రశాంతి భర్తను నిలదీయడంతో భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో మృతురాలు ప్రశాంతి తమ తల్లిగారిల్లు అయిన శంకర్ పల్లి లోని భవాని నగర్ లో కీ ఈనెల 11వ తేదీన వచ్చింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో సోమవారం బెడ్రూంలో ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు శంకరపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ఒక బాబు ఒక పాప ఉన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త శ్రవణ్ కుమార్ ను అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ కు తరలించి నట్లు తెలిపారు.

హామీ నిలబెట్టుకున్న సర్పంచ్ సుక్కిరెడ్డి అనూష సతీష్ రెడ్డి

చౌదర్‌పల్లి పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పౌష్టికాహారం

మహమ్మదాబాద్, ఆగస్టు 18 (జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పౌష్టికాహార

మాజీలపై నిఘా.. లేఖలపై ఆరా?

- మేడారం ఘటనపై ముందుకు సాగుతున్న పోలీసులు....
- సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు ముమ్మరం..



ములుగు, ఆగస్టు 18 (జనం సాక్షి): మేడారం సమ్మక్క సారక్క గద్దెల సమీపంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయం గేటు వద్ద ఏటీపీహెచ్ పేరిట ఈనెల16వ తేదిన వెలసిన హెచ్చరిక లేఖల ఘటన ములుగు జిల్లాలో సంచలనం సృష్టించింది.సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టినప్పటికి లేఖలు ప్రత్యక్షమవడంతో పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు.ఈ నేపథ్యంలోనే ములుగు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు మేడారం సమీప గ్రామాల్లోని మాజీ నక్సలైట్లపై గట్టి నిఘా పెట్టినట్లు సమాచారం.గతంలో మావోయిస్టు ఉద్యమంలో కీలకంగా పనిచేసి, ప్రస్తుతం సరెండర్ అయి సాధారణ జీవితం గడుపుతున్న మాజీల కదలికలపై నిఘా పెట్టడం తోపాటు ఇప్పటికే పలువురు మాజీలను ఇప్పటికే పోలీస్ స్టేషన్ పిలిపించి విచారించినట్ట తెలిసింది. అదేవిదంగా తాడ్వాయి మండలంలోని కొంతమంది మాజీల ఇళ్లలో సైతం పోలీసులు సోదాలు నిర్వహించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అంతేకాకుండా ఏటీపీహెచ్ పేరుతో లేఖలు వేసింది ఎవరన్నది తెలుసుకునేందుకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగుతున్నట్టు తెలుస్తుంది.అలాగే మేడారంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయం చుట్టూ ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు కొంతమేర సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన రోజే మేడారంలో హెచ్చరిక లేఖలు బహిర్గతం కావడంతో పలు అనుమానాలకు తావివ్వడంతో అప్రమత్తమైన పోలీసులు ఏజెన్సీ ప్రాంతంలో తనిఖీలను ముమ్మరం చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి వదిలేస్తున్నారు.దీంతో గత కొద్దిరోజులు గా ప్రశాంతంగా ఉన్న ములుగు ఏజెన్సీలో మళ్ళీ వెలసిన ఈ హెచ్చరిక లేఖలతో స్థానిక ప్రజల్లో కొంత ఆందోళన పరిస్థితి నెలకొంది. పోలీసులు మాత్రం ఈ ఘటనను సీరియస్ గా తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.కాగా,మేడారం లో కరపత్రాలు అంటించి అలజడి సృష్టించిన వారిని పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక ప్రణాళికతో పోలీసులు ముందుకు వెళ్తున్నట్లు తెలుస్తుంది.ఇది ఇలా ఉండగా, సీఎం రేవంత్ రెడ్డి పర్యటన రోజే ఈ కరపత్రాలు బహిర్గతం కావడం వెనుక అంతర్యమేమిటనే కోణంలో ములుగు జిల్లా ప్రజలు జోరుగా చర్చించుకుంటున్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం నివేదిక రూపకల్పనకు కృషి

- ఫిలిప్పీన్స్ దేశంలోనే ఉత్తమ మైగ్రేషన్ విధానం
- అదే తీరులోనే తెలంగాణ రాష్ట్ర వలస విధానంపై ప్రణాళికలు రచిస్తాం
- ఫిలిప్పీన్స్ దేశ మైగ్రేషన్ పాలసీ స్టడీ టూర్‌లో తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వయిజరీ కమిటీ బృందం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రపంచంలోనే ఉత్తమ మైగ్రేషన్ పాలసీ (వలస విధానం) అమలులో ఉన్న ఫిలిప్పీన్స్ దేశంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందం మూడు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ఆ దేశ రాజధాని మనీలాలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొంది. తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కోసం వలస వెళ్లిన సుమారు 15 లక్షల మంది కార్మికుల సంక్షేమం కోసం అనుసరించాల్సిన విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించనున్న కార్యాచరణ ప్రణాళికను రచించేందుకు రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ ఫిలిప్పిన్ దేశ పర్యటన అనుభవాలతో తయారు చేసే నివేదిక ఎంతో ఉపయోగపడనుంది. ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలా నగరంలోని ఇబీస్ స్టయిల్స్ అరెనేట కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ గల్ఫ్ లో నివాసముంటున్న కార్మికుల కోసం సంక్షేమం కోసం ఉత్తమమైన సంక్షేమ విధానాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు, అందులో భాగంగానే ఫిలిప్పీన్స్ దేశ పర్యటనకు వచ్చినట్లు తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసం ఉత్తమమైన గల్ఫ్ సంక్షేమ పాలసీని రూపొందించడం కోసం కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ గల్ఫ్ ఎన్నారై పాలసీ రూపకల్పన, 'గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు' ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ పర్యటన చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఫిలిప్పీన్స్ లేబర్ మైగ్రేషన్ అండ్ సివిల్ సొసైటీస్ ఆర్గనైజేషన్ రెస్పాన్స్, ఫిలిప్పీన్స్ లేబర్ మైగ్రేషన్ గవర్నెన్స్, బిల్డింగ్ అండ్ వుడ్ వర్కర్స్ ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్, గ్లోబల్ మైగ్రేషన్ యాక్షన్ ప్లాన్, లేబర్ మైగ్రేషన్ కారిడార్ ఆర్గనైజేషన్ ఎక్స్పీరియన్సెస్ అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కాన్ఫరెన్స్ లో తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరి కమిటీ చైర్మన్ అంబసడర్ డాక్టర్ బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి సభ్యులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, నంగి దేవేందర్, స్వదేశ్ పరికిపండ్ల, ప్రొఫెసర్లు విజయ్ కొర్ర, జునుగూరు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మా భూములు కాపాడండి

- తహశీల్దార్ కు వినతి పత్రం అందజేసిన పాషిగామ రైతులు
- పాషిగామ నుండి కోటిలింగాల వై జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణానికి 4కోట్లు మంజూరు

వెల్గటూర్, ఆగస్టు 18(జనం సాక్షి) : 2027 సంవత్సరం లో జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని పాశిగామ బస్‌స్టాండ్ నుంచి కోటిలింగాల వై జంక్షన్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు కావడంతో రహదారి విస్తరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే రోడ్డు నిర్మాణం కోసం పట్టా భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే తమ పట్టా భూములకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. ఈ క్రమంలో కొలతలు చేపట్టేందుకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకుని తమ అభ్యంతరాలను తెలిపారు.

కాలువ పక్కనుంచి రోడ్డు నిర్మించాలి

పట్టా భూములను రోడ్డు నిర్మాణానికి వినియోగించకుండా కాలువ పక్క నుంచి రహదారి నిర్మాణం చేపట్టే అవకాశాలను పరిశీలించాలని రైతులు డిమాండ్ చేశారు. తమ భూములు కోల్పోతే సాగు విస్తీర్ణం తగ్గిపోయి కుటుంబాల జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గ్రామ రైతులు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టా భూముల వివరాలు,రోడ్డు నిర్మాణం వల్ల కలిగే నష్టాన్ని పరిశీలించి, కాలువ పక్కనుంచి రహదారి నిర్మాణం చేపట్టేలా సంబంధిత అధికారులతో చర్చించాలని కోరారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో కోటిలింగాలకు భక్తులు, యాత్రికుల రాకపోకలు భారీగా పెరిగే అవకాశం ఉన్నందున డబుల్ రోడ్డు నిర్మాణం అవసరమేనని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే అభివృద్ధి పనులతో పాటు రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రోడ్డు నిర్మాణం జరగాలి. కానీ మా పట్టా భూములు కోల్పోయేలా కాకుండా. కాలువ పక్కనుంచి రోడ్డు నిర్మించి రైతులకు నష్టం జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. , ఈ కార్యక్రమంలో రైతులు గొపతి నరేష్, సతీష్, శ్రీనివాస్,రాజు, ఎంబడి తిరుపతి, కంటెం అంజి, ఎంబడి రామయ్య, కంటెం సత్తయ్య, తిరుపతి,సాంబయ్య, నలిమెల తిరుపతి, బరుపటి కొమురయ్య, నలిమెల కళావతి, చంద్రయ్య, అంజి, తిరుపతి, బుచ్చయ్య, మల్లేశం, సత్తయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

టైటిల్ క్లియర్‌గా ఉన్న రైతులకు పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలి

- హైవే పనులకు ఆటంకాలు లేకుండా చర్యలు
- పోతారంలో నేషనల్ హైవే నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఆగస్టు 18(జనంసాక్షి) : మంచిర్యాల-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు, రైతులు-నిర్వాసితుల సమస్యలను సత్వరమే పరిష్కరించి పనులు సజావుగా కొనసాగేలా చూడాలని సూచించారు.మంగళవారం ముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే నిర్మాణ పనుల పురోగతి, భూసేకరణ,నిర్వాసితులకు పరిహారం చెల్లింపులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా హైవే నిర్మాణ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలి

మంచిర్యాల-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి సంబంధించి పరిహారం చెల్లింపుల అంశంలో ఏర్పడుతున్న సమస్యల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పోతారం, సర్వారం, ఓడేడు, లక్కారం గ్రామాలకు చెందిన రైతులు, నిర్వాసితులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.టైటిల్ క్లియర్‌గా ఉన్న రైతులకు సంబంధించిన పరిహారం చెల్లింపుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపుల విషయంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరించాలని సూచించారు.నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు, నిర్వాసితుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి నిబంధనల మేరకు పరిష్కరించాలని తెలిపారు. సమస్యల కారణంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రైతులు, నిర్వాసితులు హైవే నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.అనంతరం ముత్తారం మండలం పోతారం గ్రామంలో కొనసాగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత ప్రకారం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు,నిర్వాసితులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ పనులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు.ఈ సమావేశంలో మంథని ఆర్డీఓ సురేష్,నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్, ముత్తారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బుద్దె స్వామి,సబ్‌ఇన్స్పెక్టర్ ఎన్ రవికుమార్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరమంటే కాంగ్రెస్‌కు భయం: బండి

హైదరాబాద్, ఆగస్ట్18 (జనంసాక్షి) : కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కొరడా.. రూ.8 వేల జరిమానా

నిర్మల్: ఆగస్టు 18(జనంసాక్షి) : నిర్మల్ పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విని యోగంపై మున్సిపల్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ దుకాణాలు, స్వీట్ హోమ్‌లు, బేకరీలు, మిల్క్ సెంటర్లలో తనిఖీలు చేపట్టి, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు మొత్తం రూ.8 వేల జరిమానా విధించారు. తనిఖీల్లో సానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రజిని, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా నేడు ఏజెన్సీ బంద్...

తుడుం దెబ్బ పిలుపు

నూగూర్ వెంకటాపురం ఆగస్టు 18(జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర తుడుందెబ్బ అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు ఏజెన్సీ లో బందుకు పిలుపు నిచ్చారు. ఆగస్టు 19న ఏజెన్సీ లో బందు విజయవంతం చేయాలని, ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించి,ఈ సమావేశానికి తుడుం దెబ్బ , వాజేడు, వెంకటాపురం, మండలాల అధ్యక్షులు తుర్స చంటి దొర ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ప్రధాన కార్యదర్శి మిచ్చ సురేష్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్లో ఏజెన్సీ ప్రాంతంల యువతకు తీవ్ర నష్టం జరుగుతుందని నాయకులు ఆరోపిస్తున్నారు.గతంలో ఉన్న జీవో నెంబర్ 109, అకారమే 75% రిజర్వేషన్లు మళ్లీ అమలు చేయాలనిఅన్నారు.ఈ నిబంధనల వల్ల ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి అవకాశం ముందుగా లభిస్తుందని దొర స్పష్టం చేశారు.ఈ రాష్ట్ర బంద్ కు గిరిజన ఆదివాసి ప్రజా ప్రతినిధులు అలాగే రవాణా సంస్థ మరియు స్థానిక వ్యాపార వర్గాలు పూర్తిగా సహకరించాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గతంలో ఉన్న 70 శాతం రిజర్వేషన్ విధానాన్ని యధావిధిగా అమలు చేయాలని, అలాగే జీవో నెంబర్ 3ని పునరుద్ధరణ చేయాలని, 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు.రాష్ట్రవ్యాప్తంగా తుడుం దెబ్బ చేపట్టిన బంద్ కార్యక్రమాన్ని ఆటో యూనియన్ మరియు చిన్న తరహా పెద్ద తరహా వ్యాపార సంస్థలు బంద్ విజయవంతం చేసేందుకు అన్ని సంస్థల వారు సహకరించాలని చంటి దొర విజ్ఞప్తి చేశారు. తమకు తగినంత న్యాయం జరిగే వరకూ ఈ పోరాటాన్ని శాంతియుతంగా గాని తీవ్రంగా గాని కొనసాగిస్తామని హెచ్చరించారు.ప్రభుత్వాలు స్పందించి స్పష్టతమైన హామీలు ఇవ్వాలని ఆదివాసి సంఘాలు కోరుతున్నాయి. ఈ సమావేశానికి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సోడి శ్రీను, ఉపాధ్యక్షులు మట్టి రమేష్ని,రుద్యోగ యువత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18(జనంసాక్షి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లాలోని వాంకిడి మండలం ఇందాని గ్రామంలో గ్రాన్యుల్స్ ఇండియా ఫార్మా కంపెనీ, సి.ఎస్..ఆర్. నిధులతో చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి 25 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. నూతన ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణంతో ఇందాని గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని, మారుమూల ప్రాంతాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుందని తెలిపారు. ఆరోగ్య సదుపాయాల అభివృద్ధిలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నాగేంద్ర, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి గురువయ్య, మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ప్రతినిధి లోకేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ నిర్మల, గ్రాన్యుల్స్ ఇండియా సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్ల భారీ ర్యాలీ

వరంగల్ ఈస్ట్, ఆగస్టు 18 (జనం సాక్షి) : వరంగల్ నగరంలోని అనంతలక్ష్మి ఆయుర్వేద వైద్య కళాశాలకు చెందిన హౌస్ సర్జన్లు మరియు యూజీ వైద్య విద్యార్థుల స్టైపెండ్ పెంపు కోసం అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేదిక్ మెడికల్ కాలేజ్ , హాస్పిటల్, వరంగల్‌లో కొనసాగుతున్న నిరవధిక సమ్మె ఈరోజు 15వ రోజుకు చేరుకుంది. గత 15 రోజులుగా వివిధ ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో, నిరసనలో భాగంగా మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో హౌస్ సర్జన్లు మరియు విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 7.5 కిలోమీటర్ల మేర సాగిన ఈ ర్యాలీ ఎండ, వాన, రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజలకు సేవలందిస్తున్న హౌస్ సర్జన్లు మరియు వైద్య విద్యార్థులు భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొని సమాన పనికి సమాన స్టైఫండ్ ఇవ్వాలంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఆయుష్ జాయింట్ యాక్షన్ కమిటీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ రోహిత్ బాస్రే మాట్లాడుతూ"గత 15 రోజులుగా మా నిరసన కొనసాగుతోంది. వివిధ కార్యక్రమాల ద్వారా మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. అయినప్పటికీ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన కూడా లేకపోవడం చాలా బాధాకరం.ఊగూగే రాలేదు బిడ్డా, కూర్చునే సీటు' అని రాష్ట్ర ముఖ్యమంత్రి గారు పాట పాడతారు కదా. కానీ ఈరోజు మా డాక్టర్లకు కూడా ఊగూగే సీటు రాలేదు. ఈ సీటు మాకు సులభంగా రాలేదు. ఎండైనా, వానైనా, రాత్రైనా, పగలైనా లెక్కచేయకుండా ఎన్నో కష్టాలు పడి సంపాదించిన సీటు ఇది.నాలుగున్నర సంవత్సరాలు ఎంతో కష్టపడి వైద్య విద్యను పూర్తి చేసి, ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు హౌస్ సర్జన్లుగా ఆసుపత్రుల్లో సేవలందిస్తున్నాం. రోగులకు ఐపి, ఓపి సేవలు, ఎమర్జెన్సీ సేవలు, నైట్ డ్యూటీలు చేస్తూ రాత్రింబవళ్లు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం అన్నారుఅయినప్పటికీ గత పది సంవత్సరాలుగా హౌస్ సర్జన్ల స్టైపెండ్‌లో తగిన పెంపు జరగలేదు. అదే సమయంలో జీవన వ్యయం పెరుగుతున్నా, వైద్య సేవల బాధ్యతలు పెరుగుతున్నా మా స్టైపెండ్ మాత్రం తగిన స్థాయిలో పెరగకపోవడం అన్యాయం. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఏం ప్రాబ్లం డాక్టర్ ప్రణీత, డాక్టర్ దీప్తి, సదానంద్, కిరణ్ సాయి, సోమేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల గుర్తింపునకు త్వరలో కార్యాచరణ

- ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కీలక నిర్ణయాలు
- 13 వేల మందితో సంప్రదింపుల ఆధారంగా ముసాయిదా
- వర్గీకరణ, సంక్షేమ విధివిధానాలపై విస్తృత సమీక్ష
- త్వరలో అధికారిక పోర్టల్‌లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు 18 (జనం సాక్షి): తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు ప్రారంభమ య్యాయి. ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు నివాసంలో మంగళవారం కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుల ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు మోతె శోభన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములునాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఇటీవల అమరదీపం వేదికగా 16 రోజులపాటు 13 వేల మందికి పైగా ఉద్యమకారులు, ప్రజా సంఘాలు, వివిధ జేఏసీలతో నిర్వహించిన విస్తృత సంప్రదింపుల్లో వచ్చిన అభిప్రాయాలు, విజ్ఞప్తుల ఆధారంగా రూపొందించిన 'చర్చలపై ముసాయిదా నోట్'పై సమావేశంలో క్షుణ్ణంగా చర్చించారు.

క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం ఆధారంగా ఉద్యమకారులను వివిధ కేటగిరీలుగా గుర్తించే విధానాన్ని కమిటీ ప్రాథమికంగా పరిశీలించింది. ఉద్యమ క్రమంలో అమరులైన వారి కుటుంబాలను తొలి కేటగిరీగా గుర్తించాలని నిర్ణయించారు. సుమారు 1,400 మంది అమరులైనట్లు సమాచారం ఉండగా, గతంలో కొందరి కుటుంబాలకు మాత్రమే సహాయం అందిందని, మిగిలిన అర్హులైన కుటుంబాలను గుర్తించి పూర్తి న్యాయం చేయాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. పోలీసు కాల్పులు, లాఠీచార్జీల్లో శాశ్వత అంగవైకల్యానికి గురైనవారు, ఆత్మహత్యాయత్నాల్లో తీవ్రంగా గాయపడిన వారిని రెండో కేటగిరీలో చేర్చే అంశాన్ని పరిశీలించారు. 1969 తొలిదశ ఉద్యమంతో పాటు మలిదశ ఉద్యమంలో ప్రివెంటివ్ కస్టడీ, రిమాండ్, జైలు శిక్షలు అనుభవించిన విద్యార్థులు, ఉద్యమకారులను మూడో కేటగిరీగా గుర్తించే ప్రతిపాదనపై చర్చ జరిగింది. ఉద్యమ సమయంలో క్రిమినల్ కేసులు, బెయిలబుల్, నాన్-బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు ఎదుర్కొన్న వారిని నాలుగో కేటగిరీలో గుర్తించే అంశాన్ని పరిశీలించారు. కేసులు నమోదు కాకపోయినా ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలంగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, మహిళా ఉద్యమకారులు, ధూమ్‌ధామ్ కళాకారులు, వివిధ సంస్థల సభ్యులకు ప్రత్యేక కేటగిరీల్లో గుర్తింపు ఇవ్వాలని ప్రతిపాదించారు. ఉద్యమకారులకు గుర్తింపు, గౌరవం, సంక్షేమ ప్రయోజనాలు అందించే విషయంలో సమగ్ర విధానాన్ని రూపొందించాలని కమిటీ స్పష్టం చేసింది.

ఉద్యోగులు, ఆర్థికంగా స్థిరపడిన వారు ప్రధానంగా గుర్తింపు కార్డు లేదా ప్రశంసాపత్రం కోరుతుండగా, నిరుపేదలు, నిరుద్యోగ యువత 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, పెన్షన్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, పిల్లలకు ఉచిత విద్య, స్వయం ఉపాధి రుణాలు వంటి సంక్షేమ చర్యలను కోరినట్లు సమావేశంలో వెల్లడైంది. జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో అమలవుతున్న తరహాలో తెలంగాణలోనూ ఉద్యమకారుల సంక్షేమ పథకాలకు చట్టబద్ధత కల్పించడంతో పాటు శాశ్వత కమిషన్ లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న సూచనలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి.

సమీక్ష అనంతరం ఉద్యమకారుల గుర్తింపు కోసం తదుపరి కార్యాచరణను కమిటీ ఖరారు చేసింది. త్వరలోనే అధికారిక వెబ్‌సైట్ లేదా ప్రత్యేక పోర్టల్ ద్వారా ఉద్యమకారులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. పారదర్శకమైన ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని రూపొందించడంతో పాటు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులతో విస్తృతంగా చర్చలు జరపాలని నిర్ణయించారు. మిగిలిన ప్రజాసంఘాల ప్రతినిధులతోనూ సంప్రదింపులు పూర్తి చేయనున్నారు. ఇప్పటివరకు నిర్వహించిన అన్ని చర్చలు, అభిప్రాయాలు, సూచనలను సమగ్రంగా క్రోడీకరించి నివేదిక, సమావేశాల మినిట్స్ రూపొందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించాలని కమిటీ నిర్ణయించింది.

ఏజెన్సీ గ్రామాలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి

- పీసా చట్టం అధికారాలను ప్రజల కోసం వినియోగించాలి
- గ్రామసభలతో సామాజిక మార్పు తీసుకురావాలి
- స్థానిక వనరులతో ఉపాధి, ఆదాయం పెంచాలి
- సర్పంచులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: సీతక్క

హైదరాబాద్, ఆగస్టు 18 (జనం సాక్షి): ఏజెన్సీ గ్రామాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేలా సర్పంచులు నాయకత్వం వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు స్థానిక వనరులను ఉపయోగించుకుని ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలని సూచించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఎంసిఆర్‌హెచ్ ఆర్‌డీలో ఏజెన్సీ ప్రాంతాల మహిళా సర్పంచులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఏజెన్సీ ప్రాంతాల గ్రామపంచాయతీలకు ప్రత్యేక పరిస్థితులు, సంస్కృతి, సంప్రదాయాలు ఉంటాయని సీతక్క అన్నారు. పీసా చట్టం ద్వారా గ్రామసభలకు కల్పించిన ప్రత్యేక అధికారాలను సర్పంచులు అర్థం చేసుకుని ప్రజల ప్రయోజనాలకు వినియోగిం చాలని సూచించారు. అడవులు, ప్రకృతిని కాపాడుకుంటున్న ఆదివాసీ లకు వారి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ అభివృద్ధి, వనరుల వినియోగంలో ప్రజలను భాగస్వాములను చేయాలని చెప్పారు. సర్పంచులు కేవలం ప్రజాప్రతినిధులుగా కాకుండా గ్రామాలకు మార్గదర్శకులుగా పనిచేయాలని మంత్రి సూచించారు. ఐదేళ్ల పదవీకాలాన్ని గ్రామాల అభివృద్ధికి ఉపయోగించు కోవాలని, ప్రతి గ్రామానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని సొంత ఆదాయ మార్గాలను పెంచుకోవాలని సూచించారు. రోడ్లు, భవనాల నిర్మాణమే అభివృద్ధి కాదని, ఉపాధి, ఆదాయం, విద్య, వైద్యం, మహిళల ఆర్థిక సాధికారత కూడా అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు.

గ్రామసభలను సామాజిక మార్పునకు వేదికలుగా మార్చాలని సీతక్క అన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళలపై వేధింపుల నివారణ, పిల్లల విద్య, పోషకా హారం, ఆరోగ్యం వంటి అంశాలపై గ్రామసభల్లో చర్చించి తీర్మానాలు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించి ఉపాధి అవకాశాలు పెంచాలన్నారు. ఇప్పపువ్వు లడ్డూలు, మిల్లెట్స్ బిస్కెట్లు వంటి స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా మహిళలకు, కుటుంబాలకు ఆదాయం కల్పించవచ్చని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా సర్పంచులు కృషి చేయాలని మంత్రి సూచించారు. ఏజెన్సీ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉందన్నారు. మూడు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలతో ప్రతి సర్పంచు తన గ్రామానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. "మీరు ముందుండి గ్రామాలను నడిపించండి.. ప్రభుత్వం మీ వెంటే ఉంటుంది" అని సీతక్క భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డీ డీజీ శాంతికుమారి, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, శిక్షణ కోఆర్డినేటర్ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ పునఃప్రారంభం

- ఆగస్టు 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- నీట్ యూజీ-2026 అర్హత సాధించిన వారికి అవకాశం..సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు ఇదే తుది అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 18 (జనం సాక్షి): తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య, దంత వైద్య కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాల యం (కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్) పునఃప్రారంభించింది. అభ్యర్థుల విజ్ఞప్తుల మేరకు మరో అవకాశం కల్పించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ తెలిపారు. నీట్ యూజీ-2026లో నిర్ణీత కటాఫ్ మార్కులు లేదా అంతకంటే ఎక్కువ సాధించి అర్హత పొందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ధ్రువపత్రాల అప్‌లోడ్ ప్రక్రియ ఆగస్టు 18 మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై ఆగస్టు 20 సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. ఇప్పటికే దరఖాస్తు సమర్పించిన అభ్యర్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని వర్సిటీ స్పష్టం చేసింది. ఇతర వివరాల కోసం గతంలో జారీ చేసిన నోటిఫికేషన్, ప్రాస్పెక్టస్‌ను పరిశీలించాలని సూచించింది. అర్హులైన అభ్యర్థులు https://tsmed adm.tsche.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

గోదావరి పుష్కర ఏర్పాట్ల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి

- అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం
- పుష్కరఘాట్ నిర్మాణానికి అనువైన స్థలం పరిశీలన

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 జనం సాక్షి : గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నవీపేట మండలం యంచ వద్ద పుష్కర ఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి అనువైన స్థలం కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. స్థానిక ప్రజాప్రతినిధు లు, రైతులతో ముఖాముఖి భేటీ అయి, వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. యంచ గ్రామ శివారులో ఎక్కడ పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తే భక్తులకు అనుకూలంగా ఉంటుంది, అవసరమైన స్థలం అందుబాటులో ఉందా, రవాణా వసతి, ఇతర సదుపాయాలు, భద్రతాపరమైన అంశాలు తదితర వాటి గురించి సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన అన్ని అంశాలను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని, ప్రభుత్వం నిర్ధారణ చేసిన ప్రాంతంలోనే పుష్కరఘాట్ నిర్మాణం చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. పరిశీలన జరిపిన ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఏమేరకు అందుబాటులో ఉంది, పట్టా భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయన్నది పక్కాగా సర్వే నిర్వహించి వారం రోజుల్లోపు మార్కింగ్ పూర్తి చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించేలా ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పనులను చేపట్టి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర దేవాలయం యంచ గ్రామానికి అత్యంత చేరువలో ఉన్నందున గోదావరి పుష్కర పుణ్య స్నానాల కోసం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, ఇరిగేషన్, ఎండోమెంట్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.





Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370